
కథలు

# అపూర్వ చింతామణి



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని ద్వారకాధీష్ వాస్తు వెబ్ సైట్ నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) ద్వారకాధీష్ వాస్తు వారి వెబ్ సైట్: http://dwarkadheeshvastu.com
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో ద్వారకాధీష్ వాస్తు వారి వెబ్ సైట్ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Helpline/WhatsApp: 9042020123


" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

ద్వారకాదీష్ వాస్తు వారి వెబ్ సైట్:

**http://dwarkadheeshvastu.com**



# అతి విశిష్టం ఈ దానం!

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

సహస్రశిరచ్ఛేద

# అపూర్వ చింతామణి

## మరుద్వతీ నగరము

అది మణిద్వీపమునందున్న మరుద్వతీ నగరం. అతి సుందర
మయింది. దానిని పాలించే రాజు పేరు ధీమంతభూపాలుడు. ధర్మపాలన
కాయన పెట్టినపేరు. మిన్నువిరిగి మీదపడినా చలించే మనిషికాదు. ప్రజల
కష్టాలు తన కష్టాలుగా భావించి వారికి సుఖశాంతులు కలిగిందాకా కన్నుమూయడు
వెన్ను వాల్చాడు. ధీమంతభూపాలుని దేవేరిపేరు సుగుణాదేవి. ఆ పేరామెకు
సార్థకమయింది. వారికి నమ్మదగిన మంత్రి విశారదుడు. ధీమంతునికి ధనం,
దర్పము, పేరు, ప్రతిష్ఠలలో లోపమంటూ లేదు.

ఎక్కేటందుకు మేడలున్నా, ఏలేటందుకు వాడలున్నా, కులం నిలిపే
టందుకు కొడుకులేని కొరత వారికి తీరలేదు. ఆ రాజదంపతులు దాన ధర్మాలు
చేయగా, చేయగ దివ్యక్షేత్రాలు తిరగగా, తిరగగ నోములు వ్రతాలు నోయగా-
నోయగ, వేల్పులకు విప్రులకు మ్రొక్కగా మ్రొక్కగ చాలాకాలానికి కలిగిం
దొక్క చక్కదనాల బాల. ఆడపిల్లయినా అదేచాలనుకొని పుట్టిన పాపాయికి
"చింతామణి" అని పేరుపెట్టి ముద్దుముచ్చటలతో మురిపెముగా పెంచుకుంటు
న్నారా తల్లిదండ్రులు.

ఆడంగ పాడంగ అయినవారందరికి ఆనందాలు పండంగ అమ్మా
యికైదేండ్లు నిండినై. పెద్దయెత్తున అక్షరాభ్యాసం చేయించాలనుకున్నాడు
ధీమంతుడు. మహారాజుల మాటకు తిరిగేముంటుంది? ఎక్కడెక్కడి చుట్ట
పక్కాలను పిలిపించాడు. ఆ వచ్చినవారిలో ధీమంతుని బావమరుదులైన ఉజ్జయినీ
పురాధీశ్వరుడు సూర్యవర్మ మహారాజు, వజ్రపురాధీశ్వరుడు చంద్రవర్మ మహా
రాజులు గూడ వారివారి బంధుమిత్ర పరివారాలతో గూడ విజయం చేసియున్నారు.

పాలకులంతా తమ తమ లాంఛనాలతో విచ్చేసియున్న సమయం కనుక నాటి మరుద్వతీ నగరం క్రొత్తక్రొత్త హంగులు సంతరించుకొని కలియుగవైకుంఠం లాగా కళకళలాడుతూంది.

దూరదేశాలనుండి వచ్చిన బ్రాహ్మణులు మొదలైన వారికిగూడా తగిన సన్మానములు జరిగినై. కవులకు, గాయకులకు, పండితులకు, శిల్పులకు,



చింతామణి, ప్రభాకర్, సుధాకర్‌లు ఉద్యానవనంలో ఆటలాడుకోవడం.

కళాకారులకు బహుమతులందినై. వచ్చిన వారంతా ధీమంతభూపాలుని త్యాగ శీలాన్ని పొగిడారు. కుంటి, గ్రుడ్డి, మూగ మొదలైన నిరుపేదలందరకు లేదనుకుండా అన్నదానం జరిగింది, పెద్దలైన వారంతా రాజకుమారిని వేదమంత్రాలతో ఆశీర్వదించారు. తరువాత ధీమంతుడు తన కుమారిని విద్యావంతురాలిని చేయు

నిమిత్తం గురువులవారికి అప్పగించారు. రాజగురువులకన్ని వసతులు తమ కోట లోనే యేర్పరచటం జరిగింది.

తరువాత వారందరకు కొంచెం విశ్రాంతి దొరికింది.

ఆ సాయంకాలం వేళ రాజదంపతులు తమ బంధువులను వెంటబెట్టుకొని పూలవనంలోనికి పోయారు. వారికంటే ముందుగానే యుద్యానవనంలో చేరి ఆటలాడుకుంటున్న చింతామణిని, సుధాకరుని, ప్రభాకరుని చూచి ముచ్చటపడ్డారు. పిల్లలాడుతున్నది దొంగాట. ప్రభాకరుడు చింతామణి కన్నులకొక గుడ్డతో గంతకట్టాడు. ప్రభాకర సుధాకరులిద్దరూ చింతామణిని కవ్వించుతూ తప్పుకుంటున్నారు. వారిని కనిపెట్టి గంతకట్టుకొనిన చింతామణిని వారిలో నెవరినైన పట్టుకోవాలి. ఒకవైపునుండి యింకొకవైపు పరుగిడే ప్రభాకరుని పట్టుకుంది. సుధాకరుడు వచ్చి ఆమెకు కట్టిన గంత విప్పాడు. చింతామణి ప్రభాకరుని చేయిపట్టుకొని "నేను దొంగను పట్టుకున్నా"నన్నది. అంతవరకు ప్రక్క-ప్రక్కలందే రాజదంపతులు, బంధువులంతా సమీపించి పకపకనవ్వారు. ధీమంతుడు "భలేదొంగను పట్టుకున్నావమ్మా! ఇంతకీ దొంగ యింటిదొంగా? బయిటిదొంగా!" అన్నాడు. పిల్లలు ముగ్గురూ బిడియంతో మారుమాటాడకుండా పారిపోయారు.

తరువాత వారంతా వనంలోని శిలావేదికలమీద కూర్చున్నారు.

సుగుణాదేవి చిరునవ్వు నవ్వుతూ "చింతామణి ఈ యిద్దరు బావలలో ఏ బావను చేసుకుంటుందో!" అన్నది. ఎవరైనను మాకొక్కటియే. ప్రభాకర సుధాకరులిద్దరూ ధీమంతునకు మేనల్లుండ్రేకదా!" అన్నాడు సూర్యవర్మ. చంద్రవర్మ అందుకుని మన ప్రభాకరుడు సుధాకర్ కన్న ఆరునెలలు పెద్దయినను పెద్దవాడే నిజానికి నాకన్నాగారును ధీమంతభూపాలునకు పెద్ద బావమరిదియునైన సూర్యవర్మ మహారాజుగారి తరువాతనే నేనును. కావున ప్రభాకరుడే మరుద్వతీ నగరాని కల్లుడు కాదగినవా"డన్నాడు. సూర్యవర్మ యంతట "అది నిజమే తమ్ముడూ! ఒకప్పుడు నీ కుమారుడే బావగారి కల్లుడైతే నేను కాదందునా! నాకు ప్రభాకర సుధాకరులలో యెవరైన నొక్కటేగద! అందుగురించి యింతగా చర్చింపవలసిన పనిలే"దన్నాడు.

"ఎప్పుడో జరగబోయే పెండ్లికి యిప్పుడే ముచ్చటలెందుకులె"మ్మంది సుగుణాదేవి మహారాణి. ధీమంతుడంతట వారలనుచూచి "నాకున్నదొక్క కుమారి ఇద్దరితో నేను వియంమందుకొనలేను. కాబోయే వియ్యాలవారెవరైనా అనగ మా చింతామణి రేపు ఉజ్జయినీ నగరం కోడలయిన, వజ్రపురం కోడలయినా మన ముప్పురిలో భేధభావా లుండరాదు. ముగ్గురిదొకటే మాట-ఒకటే రాజ్యం. ఒకటే కుటుంబం" అన్నాడు.

అంతకన్నా కావలసిన దేమున్నదన్నాడు సూర్యవర్మ.

అదే కావాలన్నాడు చంద్రవర్మ.

నాటికందరూ లేచి రాజభవనం ప్రవేశించారు. మరునాటి యుదయాన బంధువులందరికి మర్యాదలుచేసి వీడ్కోలు చెప్పాడు ధీమంతభూపాలుడు.

## ప్రాణదానం చేసిన పరమయోగి

చింతామణికి చదువంటే మంచినీటి ప్రాయమయింది. ఏడాది తిరగక ముందే యెంతో చదువు చదివింది. ఎంత గొప్ప పుస్తకమైనా యిట్టే చదివి అర్థం చెప్పడం, విమర్శించి మాటాడటంలో గూడా గొప్ప దిట్టయింది. తండ్రికి కొడుకయినా కూతురయినా తానేయైనందుకు చదువులో యెదురు లేకుండా ముందుకు పోతున్నందునను ధీమంతుడామెకు రాజ్యాంగధర్మాలు యుద్ధ రహస్యాలుగూడ నేర్పించాడు. అంతేగాకుండా కత్తిపట్టడం, సాము సేయడాలలో గూడ చింతామణి ఆరితేరింది.

ఆ తల్లిదండ్రుల ఆనందానికి అవధులు లేకపోయినై.

అయ్యవారికి ఘనమైన గురుకట్నం లభించింది.

చింతామణి అందచందాలు, చదువు సంస్కారాలు, గుణగణాలు చూచిన రాజకుమారులంతా ఉబలాటపడినా మేనరికం ఉన్నందున మనాలోచనలు సాగవు లెమ్మనుకొని యెక్కడి వారక్కడనే సర్దుకుంటున్నారు. ధీమంతుడు కుమారికి వివాహం చేయాలనుకుంటున్నాడు.

ఒకనాటి సమయాన చింతామణి చెలులతో గూడి వనవిహారం చేస్తోంది. గుబురుగావున్న పొదరింటి పూలు స్వయంగా కోసికొనబోయింది. ఎటునుండి వచ్చిందో త్రాచుపాము కాటువేయడంతో రాజకుమారి పడిపోయింది. వెంటనే చెలులు పరుగెత్తుకుంటూ పోయి అంతఃపురంలో చెప్పారు. అందరూ గుమి గూడారు. చింతామణికి విషమెక్కి మనస్మారకం తెలియకుండ ప్రాణాపాయ స్థితిలో పడిపోయింది. మంత్రులవారు రాజవైద్యులను రావించారు. ఆవాలు



రాజకుమారి ప్రాణాపాయ స్థితిలో రాజవైద్యులు బ్రతికించలేమనుట

మంత్రించి చల్లారు. మంత్రాలు పెట్టారు. చెట్లువేరులరగదీసి పూశారు. ఎవరెన్ని చేసినా బూడిదలోపోసిన పన్నీరనట్లు ఫలితం లేకుండా పోయింది.

రాజకుమారికి తెలివి రాలేదు - లేకపోగా నోటనురుగు రావడ మధిక మయింది. దేహం చాలవరకు నల్లబడింది. కాలు సేతులు కూడ మంచుముద్ద

లయ్యాయి. చింతామణి బ్రతుకును గురించి చెప్పలేమంటూ పెద్దపెద్ద వైద్యు లంతా పెదవి విరిచారు. ఆ మాటలు విన్న సుగుణాదేవి "అమ్మో! నా చిట్టి లేకపోతే యింక నేనీ భూమిమీద బ్రతకటమెందు" కంటూ గోడుగోడున నేడుస్తూ నేలమీద బడి బాధపడుతూంది. ఆమె దుఃఖాన్ని యెవరూ ఆపలేక పోయారు.

ధీమంతభూపాలుర వారికి కాలుచేతు లాడలేదు. మహారాజా వారు మగవారైనందు వలన రాణిగారి మాదిరే రోదనం చేయడం లేదనేకాని లోలోపల కుళ్ళిపోతున్నాడు. "ఎవరైనాసరే యీ సమయంలో వచ్చి నా కుమార్తె ప్రాణాలు రక్షించిన వారికి నా రాజ్యంలో సగంయిస్తా"మని ప్రకటిం చాడు కూడాను. కాని యెవరూ ముందుకు వచ్చిన వారులేరు.

అంతలోనే రాజసేవకుడు ఒక బైరాగిని వెంటబెట్టుకొని ప్రభువు లకు పరిచయం చేశాడు. ఆ వచ్చిన సన్యాసి రాకుమారిని పరిశీలించి చూచి "మహారాజా! పరిస్థితి చాలవరకు విషమించి పోయినమాట నిజం. నేను వైద్యం చేసి యీమె ప్రాణాలను కాపాడతాను. నేను చెప్పినట్లు చేయించండి" అన్నాడు. ప్రభువుగారు "చెప్పండి మహారాజా! మీరు చెప్పినట్లే చేస్తా"నని అంగీకరించాడు. వచ్చిన వైద్యుడు చింతామణి నొక ప్రశాంతమైన గదిలో పరుండ బెట్టించి-తన యొద్దనున్న మూలిక దీసి అరగదీయించి ఆమె దేహమంతట పూయించాడు. తన దగ్గరున్న యింకొక పొడిని తీసియిచ్చి నిప్పులమీద దీనిని వేసి పొగ పట్టించాడు- ఆమె లేచేవరకు మీరెవరును లేవవద్దని కట్టుబాటు చేయించాడు. విసనకఱ్ఱలతో విసరించాడు.

ధీమంతుడలాగే చేయించాడు.

నడిరేయి జామున చింతామణి కాలుసేతులు కదిలించింది.

అది చూచిన వారంతా "హమ్మయ్య" అని ఊపిరి పీల్చుకున్నారు.

ధీమంతు భూపాలుని ముఖం వికసించింది. మహారాణి చెవులలో నుంచి మాటలు వినబడినంతనే ఆమె వెయ్యిమంది దేవతలను మ్రొక్కుకుంది. రాజకుమారి యిపుడు కన్నులు విప్పి మాటాడుతూంది. నీరసంగా వున్నట్లు

కనబడుతుంది. సన్యాసి పుణ్యమా అంటూ రాజకుమారి బ్రతికిందని ఊరువాడా చెప్పుకున్నారు. రాజదంపతులు వైద్యునికి చేతులు మోడ్చి "అయ్యా! మీరు భగవంతుని లాగా సమయానికి వచ్చి మాకు పుత్రభిక్ష పెట్టారు. ఇంకొక గడియ గడిచి యుంటే మాకామె దక్కి యుండేదికాదు. ఏమైన కానీయండి. నేనాడిన మాట తప్పను. అన్న ప్రకారం మీకు నేనర్థ రాజ్యమిచ్చుచున్నాను. తీసుకొనండి" అన్నాడు.

## గుట్టు చెడని గుప్తయోగి

ఆ మాటలకు సన్యాసి నవ్వి "రాజా! మేము సన్యాసులం. ఏమీ అక్కర లేదనుకొని మాకున్న వానినే అనుభవించకుండా లోకకల్యాణం గోరి దేశయాత్రలు చేసేమాకు రాజ్యమెందుకు? పరోపకారి ప్రతిఫలం కోరరాదు. మేమే పనిచేసినా మంచిపనినే చేస్తాం. ఆ ఫలితం ప్రజలకే పంచి పెడతాం" అన్నాడు ప్రశాంతంగా.

ధీమంతు డందులకు సవినయంగా "స్వామీ! ఇస్తానన్న రాజ్యం మవసరం లేదంటున్నారు. మరి మీకేంకావాలి! అదయినా చెప్పండి-నేను మీ ఋణం తీర్చుకుంటా"నన్నాడు.

నాకు కావలసిన పనిని నీవు చేస్తావా?
తప్పక చేస్తాను స్వామీ!
నాకు నమ్మకం మేమిటి?

ఒక్కగానొక్క కుమార్తెయైన మా చింతామణిమీద ప్రమాణం చేస్తున్నాను.

ఇకచాలు. ఐతే విను మహారాజా! ఆడినమాట తప్పరాదు. మము బోంట్లతో మీకు పరిహాసములు తగవు. మాకు కోపం వచ్చినచో శపించక తప్పదు. అంతవరకు రానీయకుండ నీవు చూచుకొనవలయును. నేనొక దీక్ష బూని యున్నాను. అది నీ యాజమాన్యం క్రింద, నీ నగరంలో జరుప నిశ్చ

యించుకున్నాను. నా సంకల్పం నెరవేరితే నీ క్రింపదవి లభిస్తుంది. నీ రాజ్యములో కనకవర్షం కురుస్తుంది. మరుద్వతీ నగరం మహేంద్రుని స్వర్గమై పోతుంది" అన్నాడు సన్యాసి.

"అంతా మీ దయ సెలవీయండి" అన్నాడు రాజు.

మీయా పట్టణానికి తూర్పుగా మైలుదూరంలో ఒక పెద్ద ప్రాకారం



ధీమంతుని యోగి ప్రలోభ పెట్టడు

నిర్మించాలి. అందులో ఒక భవనం. లోపల మరికొన్ని వేదికలు రాకుమారి దీక్షా కంకణం ధరించి ఆ మందిరంలోనే యుండాలి. నమ్మదగిన దాసియొకరుండ వచ్చును. తల్లిదండ్రులయిన మీరైనను నా యనుమతి లేకుండగ నామెను చూడ రాదు.

నేనామెకు మూడుప్రశ్నలు చెప్పుదును. వానినింకొక రడగరాదు. ఎవ

రైననుగాని ఆ ప్రశ్నలకు సమాధానం చెప్పిన వానినే రాజకుమారి వివాహమాడవలయును. రాజకుమారి ప్రశ్నలకు సమాధానం చెప్పెదమని వచ్చి చెప్పలేకపోయినవాడు మీకెంత బాంధవుడైనను-మిత్రుడైనను-యెవరైనను నేను చాటున నుండి సైగచేసినంతనే చింతామణి తనచేతి కరవాలమున వాని మెడనరికి వేయవలయును. ఏమంటా"వన్నాడు.

ధీమంతుని నోటమాట రాలేదు. అమాంతంగా లేచి బైరాగి పాదాల ముందు కూర్చొని "మహామునీ! చావనున్న నా కుమార్తె బ్రతికినదేకాని- ఆమె బ్రతికిన యానందము మాకేమున్నది! అభం శుభం తెలియని నాబిడ్డకింత భయంకర నియమంబులెందుకు? చింతామణి నాకు లేకలేక కలిగిన యొక్కగానొక్క కుమార్తె. ఆమెను నా మేనల్లునకిచ్చి వివాహము సేయుటగూడ నిశ్చయం జరిగిపోయింది. దయయుంచి యీ పని యింకెవరి చేతనైనను చేయించండి. మీకు పుణ్యముంటుంది. మీకు కావలసిన ధనమిస్తాను తీసికొనండి" అని వేడుకున్నాడు.

ఆ మాటల కాగ్రహం కలిగిన సన్యాసి చివాలునలేచి "ఏమిరాజా! కావలసినంత ధనమిచ్చెదవా! నీ ధనమెవరికి కావలయును. చేతనైన నాకిచ్చిన మాట చెల్లించుకో, లేకపోయిన నేనింకొక చోటుకు పోగలను. నాయంత మునీంద్రుని మాటమీదనే నీకు నమ్మకం లేకపోయినపుడు నిన్ను నేనేమి బాగుసేయగలను! చింతామణిమీద నీవు చేసిన ప్రమాణ మొకసారి జ్ఞప్తికిదెచ్చుకో, ఆమె బ్రతుకునింక బండలపాలు సేయడం తండ్రిగా నీకుతగదు."

"ధీమంతా! నేనే రాలేదనుకో. పాముకరచిన నీ కుమారి బ్రతుకదనుకో అపుడేమి చేయుదువు? అలాగేననుకొని నాకిచ్చినమాట నిలబెట్టు కొనలేవా? ఒకవేళ నీవు తలచినట్లు నీ మేనల్లుడే నా ప్రశ్నలకు సమాధానం చెప్పి ఇంటల్లుడైతే కాకూడదా? దానికంత బాధపడే పనేమున్నది? నేనామెను బ్రతికించాను. నీవు చేసిన ప్రమాణం వలన ఆమెకపకారం కలగడం నాకిష్టంలేక యింతగా చెప్పాను. ఇక నీ ఇష్ట"మంటూ రెండడుగులు ముందుకువేశాడు బైరాగి.

మహారాజమాంతంగా ముని పాదాలు పట్టుకొని "స్వామీ! మన్నించండి

నాకేదో భయముగనే యున్నది. ఐనా కాదనలేక మీ నిర్ణయానికి బద్ధ పడు చున్నాను. మీ ఇష్టానుసారంగానే చేయించండి. రేపే పని మొదలుపెట్టించి మీరే దగ్గరుండి కావలసినట్లా భవనం కట్టించుకోండి. ఎప్పుడెంత ధనమవసరమైతే అంత తీసుకొనండి. ఇక భారమంతా మీదే"నన్నాడు.

స్వామి గడ్డం సవరించుకున్నాడు.

మహారాణి మౌనంగా అంతఃపురానికి తిరిగిపోయింది.


"అయ్యా! తెలియక నేనడుగుచున్నాను. మీరు వేరుగా భావింపక మీ పేరేమి? ఊరేమి? ఏమిచేయుదురు మొదలైన వివరములు సెలవీయ ప్రార్థన" యని యడుగుతూ నిలవంబడియున్న రాజుతో నా సన్యాసి గంభీరముగనే "ఓయీ రాజా! నేనొక మునినని తెలియుచూనే యున్నదిగద? మహా తపస్విని-నేనిపుడొక కార్యార్థిని, మాకొకచోట నివాసమంటూ యుండదు. సన్యాసి యెచటను కాపు రస్తుడు కారాదు కనుక మాకూరుపేరు లుండవు. ఐనను పిలుచుట కంటివి కనుక నన్నిపుడు "గుప్తయోగి" అనవచ్చును. మీకాపేరెందుకు వచ్చింది అనిగాని యిక ఏ వివరములుగాని మీరడగరాదు-మేము చెప్పరా"దన్నాడు.

బైరాగి మునియైనందున శపించునేమో నను భయంబున ధీమంత భూపాలుడేమియు తిరిగి ప్రశ్నింపక సన్యాసి చెప్పిన వాటినన్నింటికి తలవంచి సరేనన్నాడు.

## చింతామణి రహస్య భవనము

నగరానికి తూర్పుగా ఒక మహారాజ భవన మవతరించింది. చుట్టుగోడ చాలా ఎత్తయింది. లోపల విస్తీర్ణము చాలా పెద్దది. లోపల నొక దివ్యభవనం భవనంలో ఒక వేదిక. ఆ వేదికమీద నిలబడి చింతామణి ప్రశ్నలడుగుతుంది. వచ్చిన రాజకుమారునకొక బల్లపరుపు వేదిక. దానిమీద కంబళి పరచియుంటుంది. ఇచ్చటనున్న మనిషి రాజకుమారి చేతికరవాలం వ్రేటునకందే దూరమున నున్నది. ఆ చెక్క కూర్పునకు క్రిందనొక విశాలభవనం. దానికొకవైపున గుప్తయోగి

నివసించే గది. రెండవవైపున రాజకుమారి చింతామణి తన నెచ్చెలి మంజులతో కూడ నివాసముండే మందిరం. ఆమె ప్రశ్నలడిగే సమయంలో గుప్తయోగి దగ్గరనే చింతామణిని కనపడమంటాడు. కాని రాజకుమారునికి కనపడదు. ఆ యోగి నరికివేయమని సైగ చేయగనే ఆమె నరికివేయాలి. సేవకులా తలను వెనువెంటనే గొనిపోయి సింహద్వారం ముందు పెట్టాలి.



యోగి నిర్మింపచేసిన ప్రశ్నలడిగే మందిరం

రాజకుమారుడు నిలబడే వేదిక ఇతరసమయాలలో ఎవరూ రావడానికి వీలులేకుండా తలుపులు బిగింపబడినై. బల్లపరుపు క్రిందుగా మెట్లున్నవి. అవి చింతామణికి గూడ తెలియవు. మెట్లుదిగితే క్రింద అంతా విశాలభవనం. అక్క-డొక క్షుద్రదేవత నిలువబడి యున్నది. దానిముందు గుగ్గిలం-నిప్పుల కుంపటి-

చిన్న ఎముకలు తల పుర్రెలున్నవి. అదియొక క్షుద్రమాంత్రికుని రహస్యమందిర మని తెలిసికొనవచ్చును. అది గుప్తయోగి కవసరం.

ఆ భవనమంతా చీకటి మయం. అందులో కొన్నిచోట్ల విలువైన రత్నాలు నిలుపబడినై, రత్నాల కాంతిలో భవనమంతా పట్టపగలుగా కనుపిస్తుంది కానీ గుప్తయోగి ఆ రత్నాలకు కొన్ని మూతలమరించాడు. ఆ మూతలను రత్నాలమీద నుంచడం, తీయడం యోగికి తప్ప యింకొకరికి తెలియదు. ఆ రహస్య భవనం తరువాత దట్టమైన గోడ, వెలుపల కొక మార్గం, తరువాత కొంచెం బయలు, బయలు నంటుకొని పెద్ద సరస్సున్నది. అది చాలా లోతయింది విశాలమయింది కూడాను. పేరుగాంచిన పెద్ద యీతగాండ్రు తప్ప సామాన్యులా సరస్సులో దిగలేరు. సరస్సుకు బయలుకు రెండు పెద్ద పెద్ద రాళ్ళు చట్టుబండల లాగ నున్నవి. ఆ బండల నంటుకొని సరస్సులోనికి పోనవకాశం లేకుండగ బారుగా ఇనుపతీగెల వల అమర్చబడింది. ఈ యినుపతీగెల వలలోనుండి సరస్సు మొత్తం కనుపిస్తుంది. కావలసినంత గాలి వెలుగులు లభించినా రాకపోకల కవకాశంలేదు. తీగెవలలోని సందులలో చేతులు మాత్రమే పడుతుంది.

ప్రాకార ముఖద్వారాని కెదురుగా నూరుగజాల దూరములో ఎత్తయిన నిలువులు రెండు నిలిపి, దానిమీదుగా నొకదూలము నమరించి దానికొక పెద్దగంట కట్టబడి వుంది. గంట మ్రోగించుటకు గొలుసును కూడా కట్టబడింది. ఎవరయినా వచ్చి ఆ గొలుసు లాగిన యెడల వానిని వెంటనే పట్టుకొనిపోయి గుప్తయోగి గారికి కప్పగించుటకు ఇరువురు రాజసేవకులు కాచుకొని యున్నారు.

ఆ గంటకు ప్రక్కగా ఇంకొక పెద్ద చెక్క పలకమీద "ఎవరైననుగాని రాజకుమారి యడిగే ప్రశ్నలకు సరియైన సమాధానం చెప్పగలవానిని మాత్రమే ఆమె వివాహ మాడగలదు. మరియు వారికి మరుద్వతీ రాజ్యం దక్కుతుంది. సమాధానము చెప్పవచ్చిన యువకుడు గొలుసు లాగవలయును. రాజభటులతనిని గొనిపోయి వేదికమీద నిలబెట్టెదరు. రాకుమారి యడిగిన మూడు ప్రశ్నలకు సమాధాన మీయలేక పోయిన యెడల వానినిఅప్పటికప్పుడే అక్కడి కక్కడే ఆమె కరవాలంతో నరికివేస్తుంది. వాని తల తెచ్చి ఈ కోట ద్వారంముందు

ప్రేలాడ గట్టబడుతుంది. తగిన సత్తా కలిగిన వారే ఇందులో పాల్గొనండి" అని వ్రాయబడింది.

మునిస్వాములు నిర్ణయించిన సుముహూర్తంలో చింతామణి తలంటు స్నానంచేసి, పట్టుబట్టలు ధరించి, నవరత్న హారాల నలంకరించుకొని, రాజరాజేశ్వరిదేవికి ప్రదక్షిణ సహితంగా వందనాలు చేసి బైరాగికిచ్చిన మాట ప్రకారం దీక్షాకంకణం చేతికి కట్టుకున్నాక తనకై నిర్మింపబడిన మందిరంలో ప్రవేశించింది! ఆమెకు తోడుండుటకు మంజులను మాత్రము నియోగించాడు.

## ప్రభాకరుని సాహసము

తలపులన్నీ తారుమారు లయ్యాయి. ఎవరూ-ఏ నాడూ ఊహించి యుండని మార్పు మరుద్వతీ నగరంలో జరిగింది. ధీమంత మహీపాలునకు సంభవించిన యీ దురవస్థ కందరును సానుభూతి చూపిరేకాని, దానిని తప్పింప ఎవరికిని సాధ్యంకాక పోయింది. నేడో రేపో జరగబోతూన్నదనుకున్న చింతామణి పెండ్లి కింతలోనే యింత యవాంతరం కలగడంతో ఉజ్జయినీపురంలోను, వజ్రపురంలోను రాజకుటుంబాలలో చింతలేర్పడినై. ఇప్పటి పరిస్థితిలో రాకుమారి వివాహం జరుగుతుందా అసలు జరుగకనే పోతుందా అనే సందేహంగూడ తల ఎత్తింది.

ప్రభాకరుని మనస్సు మరింత వేగంగా కొట్టుకాడింది. ఒకప్పుడు రాకుమారి వివాహం తనతోగాక తన చిన్నాయనగారి కుమారుడు సుధాకరునితో జరిపే మార్పులు వచ్చినా సంతోషంగా అంగీకరించేవాడు కాని చింతామణి ఇటువంటి విషవలయంలో పడిపోయిందంటే ఎంతమాత్రమూ సహించలేక పోయాడు. మేనగోడలు నా మిడిమేలపు జడదారి యమపాశ్ములనుండి తప్పించి యామెకు సంపూర్ణ స్వతంత్రం కలిగించితీరాలని నిశ్చయించుకున్నాడు.

ఉన్నట్టులున్న ప్రభాకరు డొకనాడు ప్రయాణమై తలిదండ్రుల చెంతకు

వచ్చి మరుద్వతీ నగరం పోయి రావడానికి అనుమతి కోరాడు. ఉజ్జయినీ పురాధీశ్వరుడు మహారాణి శకుంతలాదేవి ఇద్దరూ స్థంభించిపోయి "ఎందుకు నాయనా! ఇపుడేం పని?" అని యడిగారు.

"చింతామణి యడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పి ఆమె నా బంధం నుండి విడిపించి మామగారి కొప్పగించి రావడానికే"నన్నాడు ప్రభాకర్.

ఆ మాట వినడంతోనే రాజదంపతులకు గుండె ఝల్లుమంది. "నాయనా! దూర మాలోచింపక తొందర పడరాదు. ఆ సన్యాసి అన్ని కట్టుదిట్టములు చేసినాడంటె అవి సామాన్యమైన ప్రశ్నలై యుండవు. మన కెవరికిని తెలియని కథ యేదో వానికి వాని ప్రశ్నలకు ముడిపడి యుండవచ్చును. ఆలోచన లేని ఆవేశమునకిది సమయం కాదు. మన ధీమంత మహారాజేమి తెలివితక్కువ వాడా! రాజ కుటుంబమునే తన గుప్పిట నిరికించుకొన్న మాంత్రికుని నమ్మరాదు. కొంతకాలం నిదానించిన చూడవచ్చు"నని యెన్నివిధాల చెప్పినా వినని ప్రభాకరుడామరునాటి యుదయంబున యింటిలో చెప్పకయే మరుద్వతీనగరం పోయి చేరుకున్నాడు.

ప్రభాకరుని రాక కానందించిన ధీమంత మహారాజు "నాయనా! ప్రభాకరా! విధి బలీయమైనది. దాని నెవరును తప్ప జాలరు. చింతామణి బ్రతుకు చిక్కుల పాలయింది. పరమేశ్వరుడే ఆమెను కాపాడ దగినవాడు. చూస్తూ చూస్తూ నీవెందులకా యురికంబం పాలుకావాలి? రాబోయే మార్పు చూచి చేయబోయే పని నిర్ణయించుదాం. తొందరపడి ముందుకు పరుగెత్తకు"మని చెప్పారు. కాని ప్రభాకరుడెవరి మాటలను చెవిబెట్టకుండా పోయి గొలుసు లాగాడు. రాజభటులాతనిని గొనిపోయి వేదికముందు నిలబెట్టారు. చింతామణి కంకణం ధరించి ఆనాటికి పదునైదు దినములైనది. సమాధానం చెప్పడానికి రాకుమారులు రావడమేదే ప్రారంభం.

గుప్తయోగి శిక్షణ పొందిన చింతామణి వేదిక మీదికివచ్చి ప్రభాకరుని చూచింది. వెంటనే వెనుకకు తిరిగిపోయి సన్యాసితో "స్వామి! ఆ వచ్చినది మా బావగారు నాకిప్పుడు సంకటం వచ్చి పడింది. అటుచూస్తే బాధ్యతగల

బాంధవ్య బంధం-యిటుచూస్తే గురువుల వారి యాజ్ఞ. నేనేమి చేయవలయు?" నని అడిగింది.

అందులకా స్వామి కఠినంగా "చింతామణీ! కంకణం ధరించిన తరువాత బాంధవ్యా బాంధవ్యములను చూడరాదు. నీవు నాకిచ్చిన మాట చెల్లి తీర వలసిందే. ఐతే ఒక్క సదవకాశం. ఆ వచ్చిన రాకుమారుడు నీకంతగా బావ



యోగి వచ్చిన వారెవరైననూ నీ పని నీవు నెరవేర్చవలెనని కఠినంగా చెప్పుట.

గారని చెప్పుచుంటివి కనుక చేతనైనచో నీవు వానిని ప్రశ్నలడక ముందే తిరిగి పొమ్మని చెప్పు. అతడు మఱలిపోయిన నేను కాదనను కాని, ప్రశ్నలు వినిన తరువాత సమాధానం చెప్పలేకపోయెనేని ఆ వచ్చిన వారెవరైనను గాని నీ పని నీవు నెరవేర్చి తీరవలయును. అందుకు భిన్నముగా జరిగిన నేనెంత మాత్రము సహింప"నని శాసించాడు.

చింతామణి తిరిగి వేదికమీదకు వచ్చింది. "బావగారూ! నా మాట వినండి. పరిస్థితుల ప్రభావంవలన నే నొక కిరాతకురాలినిగా మారిపోయాను. పూర్తిగా స్వతంత్ర్యము లేని దానను. నే నడుగబోవు ప్రశ్నలకు మీ పాండిత్యమునకు సంబంధ ముండదు. మీరు చెప్పలేరు. ఈ విషయం చెప్పి ప్రశ్నలడుగకయే మిమ్ము తిరిగి వెనుకకు పంపగల యనుమతిని నేను గురువుగారినుండి సంపాదించుకున్నాను. ప్రశ్నల నడిగిన తరువాత నే నెవరినైన వధింపకతప్పదు. నేనుగా బ్రతిమాలాడు కొనుచుంటిని కావున నా మాట విని మీరింతట మరలిపోవుట మంచి"దని యెంతగానో బ్రతిమిలాడి చెప్పింది.

ప్రభాకరు డామాటలు లెక్కచేయక "తిరిగిపోవడానికా నేనింతదూరం వచ్చితిని చింతామణీ! నిన్ని చెఱసాల నుండి విముక్తి చేయకుండా విడిచిపోయిన దానికంటె చనిపోవడమే మంచిది. నీ వడగగల ప్రశ్నలడుగు"మని ధీమాగా నిలబడ్డాడు. చింతామణి ఇంకనేమి మాటలాడలేక పోయింది. అయితే వినండి నా ప్రశ్నలలో మొదటిది.

1. వది :- సర్వము సన్యసించిన పరిశుద్ధ మునీంద్రున చందంబున నటించి, రాజాదరణము పొంది, పూజారి మరదలకు మచ్చికపడి, మహామంత్రి నమాంతంగా సంహరించి, ప్రియురాలితో గూడా సరిహద్దు రాజ్యానికి పారిపోయిన కపట సన్యాసి యెవరు. సరిహద్దు రాజుల వైరములెట్లున్నవి? ఆ రాజులెవరు? వారి పేరులేవి?

2. వది:- తన నుండి రక్షణ పొందిని రాజుకు విశ్వాసపాత్రుడుగా నటించి, వాని చెఱసాలయందున్న శత్రురాజ దంపతులను బందీలనుండి తప్పించిన తరువాత వారిని విడదీసి రాణి పొందుగోరి మోసపోయిన యోగీంద్రుడెవరు? ఆతడిప్పు డెక్కడున్నాడు? తిరిగి ఈ రాజదంపతులు కలిసికొన్నారా? ఇపుడేమి చేయుచున్నారు? వారి పేరులేమి?

3. వది :- పెండ్లి సందడిలో ప్రవేశం కల్పించుకొని, ఆ రాజును వంచించి ఆలయ పాలకులై యుండి నమ్మి సేవించిన రాజును వాని కుమారులను మోస

ముతో బందీలను గావించి, పరాయి రాజులతో చెయ్యిగలిపి, మొదటిరాజు సింహాసనము నాశ్రయించిన సాహసి ఎవరు? అతడిపు డెక్కడ నున్నాడు? ఆ రాజ దంపతులేమి చేయుచున్నారు? వారెవరు?

ప్రశ్నలు విన్న ప్రభకరున కేమియు బోధపడలేదు. చింతామణి కరవాల మెత్తింది. ప్రభాకరుడు జంకు గొంకులు లేకుండా "చింతామణీ! తొందరపడకు. ప్రశ్నలకు నిబంధము లుండవలయును. అవి లేనివి ప్రశ్నలనిపించుకొనవు. నీ వడిగిన మూడు ప్రశ్నలలో నే యొక్కటేనియు నాధారము గలది లేదు. ఇది దేశములకు సంబంధించినవా! రామాయణార్థము లోనివా! భారతమునకు సంబంధించినవా! చారిత్రాంశములా! సాంఘిక సమస్యలా! ఛందోవ్యాకరణ తర్క మీమాంశ లంటలి విషయములా! ఏ సంబంధం లేని యీ మాటలు ప్రశ్నలెలాగ కాగలవు! ఈ తలాతోకాలేని పిచ్చిమాటలకు సమాధావం చెప్పలేదని రాజకుమారుల సంహరించుట మీ కెవరధికార మిచ్చా"రని గద్దించాడు.

ప్రభాకరుని మాటలు నిజములేనని చింతామణి గ్రహించింది.

లోపల నుండి యొక గంభీర స్వరం వినబడింది. "చింతామణీ! మనదొక రాజసభ కాదు- పండితసభ కాదు. మన నిర్ణయంబునకు బద్ధులై మన దగ్గరకు వచ్చిన వారినే మన మడుగుచున్నాం. మన ప్రకటనలో మన ప్రజలకు సమాధానములు చెప్పవలయు ననియేకాని, వారు తిరిగి ప్రశ్నించుట కవకాశమును కల్పించి యుండలేదు. మీ ప్రశ్నలు దీనికి సంబంధించిన వని చెప్పియుండను లేదు! మన మీతనికి సమాధానం చెప్పవలసిన పనిలేదు. ముందీతని తల నరికి వేయి" అనే మాటలు భయంకరంగా వినబడినై.

అంతే-చింతామణి కరవాలం ప్రభాకరుని తల నరికివేసింది.

మరుక్షణంలో ప్రభాకరుని తల కోట ద్వారమున వ్రేలాడగట్టబడింది. చింతామణి తన మందిరానికి పోయి బావురుమని యేడ్చింది. ఆ వార్త వినిన

ధీమంత మహారాజు కుటుంబమేగాక ఉజ్జయినీ నగరంలోను వజ్రపురంలోను రాజకుటుంబాలవారు శోకం పాలయ్యారు.

## సుధాకరుని శుభోదయము

ప్రభాకరుని దుర్మరణవార్త విని వినడంతోనే సుధాకరునకు ఒడలు మండిపోయింది. "ఏమీ చింతామణే స్వయముగా ప్రభాకరుని తలనరకడమా? ఎంత ఘోరం? ఎంత విపరీతం? ఇంతకా ముని యెవడు? వాని కింతధికార మెవరిచ్చారు వీరందరూ బడుగు బైరాగి యడుగులకు మడుగు లొత్తుచుండిరా? నేనిపుడేపోయి ఆ కపట సన్యాసిని నా కరవాలంబున కెరగావించి చింతామణి చెర విడిపించుకొని వస్తా"నంటూ ప్రయాణ మయ్యాడు.

చంద్రవర్మ మహారాజు ధర్మపత్ని పద్మావతీదేవియు కుమారుని మందలించి "నాయనా! చిరంజీవి! జరిగిన దానికై మేము మాత్రము విచారింపక సంతోషించు చుంటిమా! మన ధీమంత మహారాజేమి యసమర్థుడా! చింతామణేమి యమాయకురాలా! బాటసారిగా వచ్చిన బైరాగి కింత బలము చిక్కినదన నాతడెంత మంత్రతంత్రశక్తులున్నవాడో తెలియకుండా తొందరపడిన ప్రయోజన మేమున్నది? నీవలె వీరావేశమున బోయిన ప్రభాకరుని గతియేమైనది? ప్రభాకరుం డంతంత మాత్రపు వారిని లెక్క జేయువాడు కాడే. పోయినవాడు తిరిగి రాలేకపోయినపుడు నీవు ముందుకు పరుగిడడం మంచిది కాదు.

ప్రస్తుతం మీ పెద్దనాన్న సూర్యవర్మ మహారాజు కిపుడు కులము నిలుపగల కుమారుడే కొరవయై పోయినాడు. నీవు కూడాను అలాంటివాడివే. అంతే కాదు. ఒక రూపంగా నిజం చెప్పాలంటే మా మూడు కుటుంబాలకు నీవే వారసుడవు కాదగినవాడవు. ఎదుటి శౌరి, బలాబలాలు- యుక్తి కుయుక్తులు-మాయ మర్మాలు తెలిసికొన కుండ సాహసించితే మేలు కలుగకపోగా కీడు రాకమానదు కనుక ముందు వెనుక లాలోచించినాక దేనికైనా పూనుకొనడం మంచి"దన్నారు.

"ఆ మాట లాలకించిన సుధాకరుడుగూడ ఒక దారికి వచ్చాడు.

నాన్నగారు! మీరన్న మాటలలో యెంతో యోచనవుంది. నా యావేశాన్ని అదుపులో పెట్టుకున్నాను. నేను మరుద్వతీ నగరం పోయిన వెంటనే ముని ప్రశ్నలకు సమాధాన చెప్పడానికి తొందరపడను. అక్కడనైనా యుక్తిశక్తుల కొలది ప్రయత్నించి గుప్తయోగి యడిగించే ప్రశ్నలేవో తెలిసికొని ఎన్ని దేశాలు తిరిగైనా వాని సమాధానాలు సేకరించిన తరువాతనే చింతామణి యొద్దకు పోయి విజయం సాధించుకొని వస్తాను. నన్ను దీవించి పంపండి" అంటూ నమస్కరించాడు.

పద్మావతీ చంద్రవర్మ మహారాజు లానందమొంది కుమారుని దీవించి పంపించారు. సుధాకర్ మరుద్వతీ నగరం చేరి రాజదర్శనం చేసినంతనే ధీమంత మహారాజు "నాయనా నీవును, గుప్తయోగి ప్రశ్నలకు సమాధానం చెప్పు తలంపు మీదనేవచ్చావా!" అని అడిగాడు తడబడుతూన్న మాటలతో, సుధాకరుడంతట మామగారు! సమాధాన మీయడానికే నేను వచ్చాను కాని యిప్పుడు కాదు. ఆ ప్రశ్న లేమిటో! వాని భావములేమిటో? సమాధానము లేమిటో? బాగుగా తెలిసి కొన్న తర్వాతనే చింతామణి దగ్గరకు పోదలంచాను. నాకు కొన్ని వివరాలందే దాక నేనిక్కడనే యుండదలచా"నన్నాడు.

ఆనందంతో పొంగిపోయిన రాజ దంపతూ లిద్దరూ "అంతకంటేనా, నీకీ యిల్లయితే మాత్రం పరాయిచోటు కాదుగదా! కొన్నాళ్ళేం? ఎన్నాళ్ళయినా నీవుండ దగిన వాడవే"నన్నారు. సుధాకర్ మామగారింటనే నివాసం చేసి సన్యాసి యడిగే ప్రశ్నలేమిటో తెలిసికొన వలయునని వారిని వీరిని యడిగి చూచాడు— నగరమంతా గాలించాడు కాని-కావలసిన సమాధానం చెప్పిన వారులేరు. ఎవరు బట్టినా "ఆ ప్రశ్నలేవియు మేము వినలేదు. మాకు తెలియవు. ఐనా- అంతా కట్టుసిట్టములు చేయబడిన సన్యాసి ప్రశ్నలు మాకు మాత్రమెట్లు తెలియగల" వన్నారు.

ఇది యిటులుండగ చింతామణి సన్యాసి తనకు ప్రశ్నలు చెప్పి వల్లించు

మనిన మొదటి రోజులలో నామె మఱచిపోకుండుటకుగాను వానినొక మొగలి రేకుమీద వ్రాసుకొని బట్టిపెట్టింది. కొంత కాలానికి మొగలి రేకు మాటే చింతామణికి గురుతులేదు. అది చింతామణి నెచ్చెలియైన మంజుల చేతికి దొరికినందున భద్రం చేసింది. ఆమె కొకనాటి కలలో కాళికాదేవి కనబడి "అమ్మాయీ! నీకు నీ రాజకుటుంబం మీద గల గౌరవాభిమానాలు చెప్పుకొనదగినవై! నీ స్నేహి



చెలికత్తె మంజులకు కాళీ ప్రశ్నల రహస్యమును చెప్పుట

రాలు చింతామణికి నీ వలన కొంత మేలు జరగవలసి యున్నది. వేదిక క్రిందగ బల్లకూర్పు నడుగున మెట్లున్నవి! అదొక చీకటి గది! దాని వెనుక ద్వార మున్నది. తలుపు తెరిచితే సరస్సు. రేపు సాయంత్రం నీవచటకు పొమ్ము. ఈ మందిరం గోడనంటి యున్న శిలమీద కూర్చుండి యుండువానిని నీవు పోల్చు కొనగలవు. నీవు దాచియుంచిన మొగలిరేకు నతిరహస్యముగ నా యువకుని కందజేయుము. మీకు విజయం తప్పక కలుగు తుం"దని చెప్పి మాయమయింది.

మంజుల మనసారా కలలో కనబడిన దేవి మాయమైపోయింది.

సాయం సమయంవేళ సరసు తీరాన చల్లగాలికై జనం చేరుకుంటున్నారు. సుధాకరుడు గూడ అక్కడకు వచ్చి కూర్చున్నాడు.

కొందరు యువకులు స్నానాలకు సరసులో దిగి ఈతలు కొట్టుతున్నారు. వారి యందొకడు ప్రమాదానికి గురియై నీటిలో మునిగిపోవడం చూచి "అయ్యో! పాపమాతడు చావసిద్ధంగా వున్నా"డన్నవారే కాని మిక్కిలి లోతుగల నీటిలో దిగడాని కెవరును సాహసించలేదు. అది చూచిన సుధాకరుడు వెనుక ముందు లాలోచించకుండగనే సరసులోనికి దుమికి యీతతో పోయి ప్రమాద స్థితిలో నున్న యువకుని రక్షించాడు. ఆయనకు దగ్గరలో కనిపించింది చట్టుబండ. సుధాకరుడు తనచే కాపాడబడిన వానిని చట్టుబండ మీద విశ్రాంతి తీసుకొన నియమించి తానా భవనపు గోడవైపు దృష్టి సారించి మనసునందేదో యాలోచించుచు కూర్చున్నాడు.

సరసు గట్టునందున్న జనం సుధాకరుని మెచ్చుకొని మేము ఓ చెంతకు వచ్చుచున్నామని సైగచేసి పడవలలో బయలుదేరారు. వారు రాకుమారుని చేరుకుంటానికి కొంత కాలం పట్టుతుంది గనుక సుధాకర్ మళ్ళీ తన యాలోచనలో బడ్డాడు. ఇంతలో యెదురుగా నున్న ద్వారం తెరుపబడింది. లోపలనుండి బయటకు వచ్చి చిరునవ్వుతో తన్ను సమీపించుచున్న మంజులను చూచిన రాజబంధువు మనసులో రకరకాల యూహలు తరంగాలుగా రాసాగినై.

"ఎవరు?" అన్నాడు సుధాకర్.

"నీకు దగ్గరదాననే"నన్నది మంజుల చనవు కల్పించుకొంటూ—

"దగ్గరకే వచ్చావు కాని-వివరాలు తెలియాలిగా!"

"తెలియ జెప్పడానికే వచ్చాను రాజకుమారా! నీ పేరు సుధాకర్! వజ్రపురాధీశ్వరులవారి కుమారులు. మా మహారాజుగారికి ప్రియబంధువులు. చింతామణి యడుగబోయే ప్రశ్నలేమిటో తెలిసికొనడానికి ఆలోచించుచున్నారు. చాల పెద్ద పని పెట్టుకున్నారుకూడాను. ఏమిటలాగ చూస్తున్నారు! ఇదంతా నాకెలాగ తెలి

యుననేగదా! చెప్తాను వినండి. నేను ధీమంత మహారాజావారి అంతఃపుర పరిచారికను. నా పేరు మంజుల. మిమ్ము నేను పోల్చుకున్నాను. రాజావారు చింతామణికి తోడుగా నన్నిక్కడ నుండ నియమించారు. రాత్రి నా కలలో కాళికాదేవి కనుపించి మీకీ మొగలిరేకు నందించమని చెప్పింది. సన్యాసి యడిగే ప్రశ్నలిందు వ్రాయబడినై. కార్యసాధనలో భగవంతుడు నీకు సాయపడతాడు. నీకు జయం కాగలద"ంటూ మొగలిరేకు నాతని చేతి కందించింది.

సుధాకర్ మహానందంతో పొంగిపోయాడు.

"మంచిది మంజులా! నీవు చేసిన యీ మేలు నేనెన్నటికి మరచిపోను. నీకు నీ రాజ కుటుంబం మీదున్న భక్తి విశ్వాసాలు చెప్పుకోదగినవి. మీ స్నేహితురాలు చింతామణి నీకు బ్రతికినంతకాలం ఋణపడి యుంటుంది. నీవు చెప్పినట్లు నేను కార్యం సాధించుతాను. అదుచూడూ! అక్కడ బయలుదేరిన పడవలోని వారిటే వచ్చుచున్నారు. వారికంట పడకుండా నీవు వెంటనే యిక్కడ నుండి తప్పుకో మంజులా! మఱచి పోకుండా మా చింతామణితో మీ బావ తొందరలో ప్రశ్నలకు సమాధానం సంపాదించుకొని వస్తానన్నాడని చెప్పి యామె నూరట బుచ్చు"మన్నాడు.

మంజుల సంతోషంతో మరలిపోయింది.

## సుధాకరుని సాహస యానము

సుధాకరుని మనసులో యింతకు ముందున్నది సన్యాసి యడిగించే ప్రశ్నలేమై యుంటాయి యనేదొకటే ఆలోచన. దైవ సహాయంతో ప్రశ్నలకు సమాధానాలేమి? ఎవరి నడగాలి యనే యాలోచనలు పెరిగి పోతున్నాయి. ఐనా సుధాకరుడు వెనుకాడే రకం కాదు. సహనంతో, సాహసంతో కార్య సాఫల్యానికి విరామంలేని శ్రమచేయడానికి అలవాటు పడిన మనిషి.

దేవాలయానికి పోయి మనసారా నమస్కరించాడు.

"పరమేశ్వరా! కేవలం యిది నా స్వార్థానికే కాదని నీకూ తెలిసినదే.

ఎవడో యొక మాయ సన్యాసి క్షుద్రదేవతోపాసనా శక్తితో దేశద్రోహానికి పాల్పడ్డాడు. ధర్మమూర్తియైన ధీమంత మహారాజు విషవలయంలో చిక్కుకున్నాడు. మా అన్నగారేగాక యింకా ఎందరెందరో రాజకుమారులు యీ మహాదారుణ మారణారంగంలో బలియైపోనున్నారు! ఈ ఘోరాన్ని మీరుసహింపరాదు. ఆ గుప్తయోగి ప్రశ్నలకు సమాధానం చెప్పగల శక్తి నాకు ప్రసాదించు. నా వలన యీ దొంగబైరాగి గుట్టు బట్టబయలు కావాలి. దేశంరక్షింపబడాలి. ఇందుకు నేను నిమిత్త మాత్రుడనే. నాకు ముందు దారి చూపేవాడివి-విజయం కలిగించే వాడివి కూడా నీవే"నని ప్రార్థించాడు. మంచి సుముహూర్తాన మామ ధీమంత మహారాజావారి ఆశీస్సులు పొంది బయలుదేరాడు.

ఆనాడు వైశాఖ శుద్ధ విదియ, సోమవారం, నెలపొడుపయింది. సుధాకరుడా రాత్రంత్ర విసుగు విరామం లేకుండా-చెట్టు పుట్టలనకుండా-రాయిరప్పలు చూడకుండా ప్రయాణంచేసి ఒక ఎడారిలో ప్రవేశించాడు. తానింతవరకు కొన్ని వందల యోజనాల దూరం ప్రయాణం చేశాడు. అక్కడ నుండి దారి మూడు వైపులా చీలియున్నందున నెటు పోవలయునో తెలియలేదు. అడుగుదామన్నా చెప్పడానికి నరసంచారం కనపడడంలేదు. అంతలో నవ్వువచ్చి నవ్వుకున్నాడు. పోను నా కెవరయినా కనపడ్డారే యనుకుందాం! "నీ వెక్కడను పోవడానికి దారి కావాలి" అని వారడిగితే, నేనెక్కడకు వెళ్ళుచున్నానని చెప్పగలను? అని యనుకున్నాడు.

"నిజమే! నేనిప్ప డెక్కడకు పోవుచున్నాను? ఏ ఊరు పోవాలి? ఎవరిని కలియాలి? ఏమి చేయాలి" యని యాలోచించుచుండగ వానికి "రాజకుమారా!" అనే పిలుపు వినవచ్చినది. ఈ ఎడారిలో నన్ను పిలిచే వారెవరని సుధాకర్ నలువైపుల తిరిగి చూచాడు. మళ్ళీ వానికి "సుధాకరా! నిన్నే పిల్చుచున్నాను. నా దగ్గరకు రమ్మ"నే మాటలు వినబడినై, అతడు పరిశీలనగా చూచాడు. ఆయనకు ప్రక్కగా నొక ముని తన్ను సమీపించి "భయపడకు చిరంజీవి! నీవీ తూర్పు

దిక్కున నున్న మార్గమున పది యోజనముల దూరము పొమ్ము. అక్కడ తల క్రిందులుగా తపసు చేయుచున్న మునివలన నీకు మేలు జరుగుతుం"దని చెప్పి వెళ్ళిపోయాడు.

సుధాకరుడా పరిచయం కలిగిన బాటసారిని ఏవేవో అడగాలనుకున్నాడు. కాని వానికామాట చెప్పిపోవుచున్న వ్యక్తి యిక మాటడడని గ్రహించి నందున మళ్ళీ గుఱ్ఱమునెక్కి తూర్పుగా నున్న మార్గమందే ప్రయాణం సాగించాడు. పది యోజనాల దూర మెంతసేపో ప్రయాణం జరుగలేదు. తల్లక్రిందులుగా తపస్సు చేయుచున్న మునినిచూచి నమస్కరించాడు. ముని పలుకలేదు. ఇక పలుకరింపరా దనుకొని నందున సుధాకరుడు ప్రక్కగా నొక రాతిపలకమీద కూర్చున్నాడు. కొంతసేపటికా ముని కన్నులు తెరచి చూచి రాజకుమారుని పేరబిలిచి ప్రక్కన కూర్చుండ నియమించి "నీవెవరవు? నీవు వచ్చిన పనియేమి? నీకు నావల్ల కావల సినదేమి?" అని యడిగాడు.

సుధాకరుడు జరిగినదంతా వివరించి చెప్పుకున్నాడు.

తలక్రిందులుగా తపస్సు చేసిన మునీంద్రు డొక్కసారి గట్టిగా యూపిరిని పైకి పీల్చి యొదలివేసిన తరువాత "బిడ్డా! నీవు మంచిపనికి కంకణం గట్టుకొన్నావు. గుప్తయోగి మోసగాడు. అతడు శపించు నేమోనను భయంబున ధీమంత మహారాజు చిక్కుబడిపోయాడు. చింతామణి ప్రశ్నలకు సమాధానములు చెప్పలేక రాజకుమారు లెందరో చనిపోవుచుండుట విచారకరం. అట్టి భయంకర నరహంతక చర్య నరికట్ట నడుం గట్టిన నీవలన లోకోపకారం జరుగునున్నది."

"సుధాకరా! సన్యాసి యడిగించెడి మూడు ప్రశ్నలకు సమాధానములు వరుసగా యిలా, కాంశ్యరజిత నగరాలలో లభింపగలవు. వానిని సాధించుట సామాన్యమైన పనికాదు. ప్రమాదములెన్నో రాకమానవు. ఐనను ధైర్యసాహస ములుగలవాని కెదురయ్యేడి యాటంకముల వలన కాలహరణంబైన కావచ్చును

కాని కార్యము నెరవేరకపోదు. ఐతే ధైర్యసాహసంబులకుతోడు అంతకన్న మించిన సహనము, యుపాయములవసరములు. ఇచ్చటకు యుత్తరపు దిక్కుగ నిరువదైదు యోజనంబుల దూరము పోయితివేని మొదట యిలానగరము కనపడగలదు. నీకు ప్రమాదము సంభవించినపుడు మనస్సులో "జై జై మృత్యుంజయ



తలక్రిందులుగా తపస్సు చేసుకొనే ముని సుధాకరునికి
సన్యాసి యడిగెడు మూడు ప్రశ్నలకు మూలము చెప్పుట

మహాముని యే నమః" అని నన్ను స్మరింపుము. నీకు విజయం కలుగుతుంది. ఇక పోయిర"మ్మని దీవించి పంపించాడు.

సుధాకరున కపుడు తాను పోవలసిన నగరముల పేరులు తెలిసినై. మొదట చేరవలసిన పురమునకు దారియు కనిపించింది. అంతేకాకుండా దూర ప్రదేశములు, క్రొత్తచోటులలో నెప్పుడు ప్రమాదం కలిగినా దానినుండి తప్పు

కోని బయటపడగల మంత్రంగూడ లభించింది. రెట్టించిన ఉత్సాహంతో చివాలున లేచి మునీంద్రునకు నమస్కారంచేసి ప్రక్కనున్న కొలనులో స్నానంచేసి చెట్ల కాయలు కోసుకొని తిన్న తరువాత మళ్ళీ ప్రయాణం సాగించి ముందుకు దూసుక పోయాడు.

ప్రొద్దు నడినెత్తిమీది కెక్కింది. ఎండ తీవ్రమధికమై దేహమంతా చెమటతో తడిచిపోయింది. గుఱ్ఱంగూడ అలసింది. అదొక వనప్రదేశం. కొంత సేపు విశ్రాంతి యవసరమనుకొని సుధాకరుడా గుఱ్ఱాన్ని పచ్చికబయలులోనికి తోలి తానొక పూపొదనీడ పరుండి కన్నుమూశాడు. వెంటనే గాఢనిద్రపట్టి యొడలు తెలియలేదు. సాయంత్రం చీకటిబడు వేళకు మెలకువ వచ్చి కన్నులు తెరచి చూడగా రాజకుమారు డంతకుముందు శయనించిన చోటునలేడు. కాలు సేతులు బంధింపబడినై. గుర్రమెక్కడ నున్నదియు తెలియుటలేదు. ఆయన కంతయు నయోమయంగా మారిపోయింది.

వానికంతలోనే తప్పెటల మ్రోత వినబడింది. కత్తులు, గండ్రగొడ్డళ్ళు చేతులందుంచుకొనిన కోయజాతి గుంపు వికటాట్టహాసాలు చేస్తూ వచ్చి తన్ను చుట్టుముట్టారు. దానినిబట్టి రాజకుమారుడు తానిపుడున్నది కోయగూడెం అని గ్రహించాడు. అంతేకాదు-వారంతా తనను వారి కొండదేవతముందు బలిచేయ డానికే యీ తతంగమంతా చేయుచున్నారన్నదియు తెలిసికొన్నాడు. కోయగుంపు సుధాకరుని యొంటినిండా పసుపుపూసి వేపమండలు గట్టి బండమీద నూరేగింపు చేసికొని కొండదేవత గుడి ముందుకు తీసుకొనిపోయి బలియిచ్చు స్థానంలో నిల బెట్టారు.

సుధాకరుని మనసులో నేటితో నాకాయువు పరిసమాప్తి కాబోవుచున్న దేమోనని కొంచెం చలించాడు. కాని పురుష ప్రయత్న ముస్నదనే మాటను మరచిపోలేదు. తల్లకింద్రు మునీంద్రులు చెప్పిన "జై మృత్యుంజయ మునియే

నమః" అనే మంత్రాన్ని మనసులో మాటిమాటికి జపించుతునే యున్నాడు. కల్లు త్రావిన కైపుకూతలు కూయుచున్న కోయవాడొకడు గండ్రగొడ్డలి చేతపుచ్చుకొని వచ్చి రాకుమారుని సమీపించాడు. కాలుసేతులు బంధింపబడినందున సుధాకరు డేమియు చేయలేక తలవంచి కనులు మూసుకున్నాడు.

మెడమీద పడిందనుకొనిన గొడ్డలి పడలేదు..

కొన్ని నిముషములలో అలజడి జరిగిన చప్పు వినబడింది.

సుధాకరుడు కన్నులు విప్పి చూచాడు.

ఆశ్చర్యం, ఆనందాలు రెండూ యొక్కసారిగా పెల్లుబికొచ్చినై. ఇంత లోనే యింతమార్పు జరుగుతుందని యెవరూ వూహించి యుండలేదు. ఎక్కడ నుంచి వచ్చిందో తన గుర్రం పెద్దపెట్టున సకిలించుకుంటూ వచ్చి అక్కడున్న వారందరనూ చిందర వందర చేసింది. నిజానికైతే మారణాయుధాలు చేనున్న కోయవాండ్రు తిరగబడితే గుర్రం చేయగలదంటూ యేమీ యుండదు. కాని-యిలా జరుగుతుందని యెవరికీ తెలియదు. అనుకొనకుండా అమాంతంగా యేదో ప్రళయం వచ్చి పైనబడిందనుకొన్న కోయ గుంపంతా భయపడి యెటువారటు పారిపోయారు కల్లుత్రావిన మైకంలోబడి కదల మెదలలేకపోయిన వారిపైతే గుర్రం అణగద్రొక్కి నాట్యమాడింది.

విషయాన్నంతా అర్థంచేసుకొనిన రాకుమారుడు తన చేతికి గట్టియున్న త్రాళ్ళనెట్లో సడలింప చేసుకొని లేచి గుర్రాన్ని చేరదీసుకున్నాడు. దుస్తులు మార్చుకున్నాడు. కోయలు వదిలేసిపోయిన భోజన పదార్థాలలో వానికి కావలసిన వానిని కడుపునిండారగించిన తరువాత యిక్కడనుండి దాటి యెక్కడికైనా పోవడ మెందుకైనా మంచిదనుకొని వెంటనే గుర్రానెక్కి వాయువేగంతో పరుగిడి చాలా దూరం పోయాడు.

## విక్రమార్కునితో చెలిమి

కనుమసక చీకటి పడింది. పండువెన్నెలను గాయ ప్రారంభమయే సమయం. అదొక చక్కని సరస్సు. పరిసరాలను బట్టి చూడగ కొంతవరకు జన సంచారంగల చోటనిపించింది. ఐనప్పటికిని అది వెనుకటిలాగ కోయలు, కొండ జాతివారు నివసించే ప్రమాదంగల ప్రదేశం మాత్రం కాదని గ్రహించాడు సుధాకర్. తన ప్రాణాలను కాపాడిన మిత్రునిలాంటి గుర్రం బాగా అలసిపోయినందున దిగి దానికి కృతజ్ఞతలు చెప్పి నీరు త్రావించి పచ్చిక మేయ నియమించిన తరువాత తను చక్కగ స్నానం చేసి సమీపమందున్న చెట్ల కాయలు తిని పూల పందిరికి దగ్గరగనున్న శిలా వేదికమీద విశ్రమించాడు.

రాజకుమారుడు కొంచెంసేపు తన ప్రయత్నమును గురించి ఎదురగుచున్న ప్రమాదాల గురించి యోచించాడు. మనసు తనకు తెలియకుండగనే గగన మార్గంలో తనకెదురయ్యే మేఘాలలోనుండి దూసుకొని ముందుకు పోతూన్న చంద్రగమనం మీదికి ప్రసరించింది "చందమామా! నాకిపుడెవరూ యిక్కడ తోడులేరు. కనపడుతూన్న నీ వెంత తొందర తొందరగా పరుగెత్తిపోయినా నాకు కనపడకుండ పోలేవులే." అని నవ్వుకున్న మరికొంత సేపటి కాయనను గాఢనిద్రా వరించింది.

తెల్లవారింది.

బడలికచేతయొడలెరుంగక పడి నిద్రించిన సుధాకర్ మేల్కొని చూచునప్పటికి సూర్యోదయమయింది. మళ్ళీ పరమాశ్చర్యం. తన ప్రక్కగ నెవరో గుడారాలు వేశారు. పరివారంతో కోలాహలంగా వుంది. అదంతా చూచిన రాజకుమారుడు ముందు కలవరపడ్డాడు. ఒక సేవకుడు వచ్చి నమస్కరించి "ప్రభువులకు జయమగుగాక. మీరిపుడు యిలాపురాధీస్వరులైన జయసేన మహారాజు

కుమారులు విక్రమార్క భూపాల యువరాజావారి యాశ్రయమందున్నారు" అని వివరించాడు.

ఇలాపుర మనినంతనే సుధాకరుని మనస్సునందు దాశాజ్యోతి వెలిగింది. తిరిగి "మీ పురము పేరేమిటి?" అని యడిగాడు.

"ఇలాపుర" మన్నాడు రాజసేవకుడు.

"ఐతే నేనిప్పుడు చేరవలసిన చోటుకే చేరుకున్నాను" అని అనుకున్నాడు.

రాజసేవకుడు తిరిగి పని కల్పించుకొని—

"మా ప్రభువులు వేటకై వచ్చినప్పుడెల్లయు నిచటనే మజిలీ చేయుటాచారం. రాత్రి వచ్చిన మేము మా వెనుకటి పద్ధతి ననుసరించి యిక్కడనే గుడారములు వేయుచుండ మా యువరాజావారు మిమ్ము చూచి జాలిపడ్డారు. ఎవరో మార్గస్థుడు మార్గాయాసం పొందిన నిద్రలోనున్నాడు. సుఖనిద్ర యందున్న వారిని మేల్కొలుపరాదు. ఈ యువకుడు నిద్రలేచువరకును కాచియుండి అనంతరమున కుశలప్రశ్నలుచేసి కావలసిన యుపచర్య లొనరించిన తరువాత నా చెంతకు గొనిరండని మాకాజ్ఞనిచ్చి యున్నారు. దేవరవారు లేచి విజయం చేయగలరు" వినయంగానే మాటాడాడు.

సుధాకర్ లేచి రాజసేవకుని అనుసరించాడు. కొద్దిసేపటిలోనే స్నానపానాదులు ముగించుకొని, ఆత్మీయులిచ్చిన పొడివస్త్రములు ధరించి రాజసేవకుని వెంట పర్ణశాలయందున్న వారిని సమీపించుచుండగనే అందున్న సర్వాధికారి గౌరవపూర్వకముగా ఆహ్వాన మిచ్చాడు. ఉచితాసంబున కూర్చున్న పరదేశి నుద్దేశించి విక్రమార్కుడు చిరునవ్వున "అతిధులకు మా పరివారమువలన సపర్యలందేలోపము జరిగియుండదని తలుస్తున్నాం" అన్నాడు. సుధాకర్ గూడ మందస్మితంతోనే "మంచి మర్యాదలు తెలిసిన వారివలన మరొకరికి లోపము లుండవు గదా!" అని సమాధాన మిచ్చాడు.

మీరు తృప్తిపడటమే మాకానందం.
పరమేశ్వరుడు మిమ్మల్లే కాపాడగలడు.
సంతోషం నూతన పరిచయుల వివరములు తెలిసికొన గోరుచున్నాను.
ఆత్మీయులకు నేనే చెప్ప వేడుకబడుచున్నాను. సుధాకర్ తన కథనంతా పూసగ్రుచ్చినట్లు చెప్పాడు ఆ మాటల నాలకించుచున్నంతనేపు విక్రమార్కుని



విక్రమార్కునికి సుధాకరుడు అన్ని విషయములు చెప్పుట

మనసులో కోపజ్వాలలు పుట్టుక రావడమూ మరల వానంతటవే సమసిపోవడం గూడ గమనించుచున్న రాకుమారుడు తానింక చెప్పదగినది లేదన్నట్లుగా సంభాషణ ముగించాడు.

విక్రమార్కుడు సుధాకరుని కౌగలించుకొని "మిత్రమా! నీవు చేపట్టినది చాలా మంచిపని. నీకీ విషయంలో మా సహకారం లభించుతుంది. నీవీనాడు

రాదగిన చోటునకే వచ్చావు. మేము యిలా నగర పాలకులం. మా తండ్రిగారైన జయసేన మహారాజావారి వలన నీ మొదటి ప్రశ్నకు సమాధానం రానున్నది. అంతఃపురాలలో నివసించి-సరసరాజాన్నము లారగించి- మృదు శయ్యలమీద నిద్రించె మీరీ దుర్లభ కార్యభారం తలదాల్చినందున నిద్రాహారాల మరువ యెంతగానే ప్రొక్కి-యున్నారు. మా ఇంటికి దయచేసి కొద్ది దినములు బడలిక తీర్చుకొనండి. మీకు మేమన్నివిధాల బాంధవులం కాగల"మంటూ ఆప్యాయతను వెల్లడించాడు.

"ఇది పరమేశ్వరుని సంకల్పంగాని యింకొకటి కాదు. ఇంత మంచి మనసుగల మీకన్న నాకాప్తులెవరుందురు? మీ రిచ్చిన యీ యవకాశాన్ని నేను జారవిడచు కొందునా!" అనిన సుధాకర్ మాటల కానందించిన విక్రమార్కుడు వెంటనే అనుచరులను చేరబిలిచి "ఐదురోజుల కార్యక్రమముగా మనం నిర్ణయించుకొనిన వేటను మనకాత్మీయ బంధువులు వచ్చిన కారణంబుగ నేటితోనే ముగించి రేపే నగరికి చేరవలయునుగాన మీరా ప్రయత్నమున నుండవలసిన"దని హెచ్చరిక చేశాడు.

వేటగాండ్రు మొదట క్రూర మృగాలను చంపగనే రాజకుటుంబం మర్యాదలకు దగిన మాంసమును కుపయోగములగు కుందేళ్ళను-నెమళ్ళను మొదలైన జంతువులను వేటాడుకొని వచ్చారు. వారంతా మరునాటి వేకువనే బయలుదేరి నగరికి చేరిన వెంటనే విక్రమార్కుడు సుధాకరునకు రాజభవనమందు విడిది యేర్పాటు చేయించాడు. భోజనాల సమయంలో తన తండ్రిగారికి సుధాకరుని— సుధాకరుని జయసేన మహారాజా గారికి పరిచయం చేశాడు. పరదేశి వచ్చిన కార్యమును గురించి కూడా యిలా పురాధీశ్వరులకు యువరాజావారు తెలియచేయడం జరిగింది.

భోజనానంతరం జయసేన మహారాజు సుధాకరుని తనవెంట నిజభవనానికి తీసుకొనిపోయి సుగంధ ద్రవ్యములతో గూడిన తాంబూలము సేవింప నియమించి కుశల ప్రశ్నలతోనే వాని యూరు పేరుల తెలిసికొనిన పిదప నిరువురులేచి

యుద్యానవనములోనికి పోయి శిలావేదికల మీద కూర్చున్నపుడు జయసేనుడు సుధాకరున కిలా చెప్ప ప్రారంభించాడు.

## మొదటి ప్రశ్నకు సమాధానము

"అయ్యా మొదటి ప్రశ్న యేమందురా! వినండి—

"సర్వము సన్యసించిన పరిశుద్ధ మునీంద్రుని చందంబున నటించి, రాజా దరణము పొంది, పూజారి మరదళకు మచ్చికపడి మహామంత్రి నమాంతంగా సంహరించి, ప్రియురాలితో గూడ సరిహద్దు రాజ్యానికి పారిపోయిన కపటసన్యాసి యెవరు? సరిహద్దు రాజుల వైరము లెట్లున్నవి? ఆ రాజు లెవరు? వారి వేరు లేమి?"—దీనికి యీ యిలా నగరమందే సమాధాన మున్నదని నాకు తెలిసిం" దన్నాడు సుధాకర్.

జయసేన మహారాజంతట "నాయనా! అదే నేను నీకు చెప్పుచున్నాను. మా నగరము నందున్న వేణుగోపాలస్వామి దేవాలయము మా పూర్వీకులనాటి నిర్మాణము. దానికి మేమే ధర్మకర్తలం. మా రాజ పాలనమునందే యున్నది. స్వామికి కావలసిన వైభవము లన్నియు మేమే చేయించుచుందుము. ప్రతి సంవత్సరము గోకులాష్టమి పండుగ దినమున మహానందంగ వుత్సవాలు జరగడం—చూడడానికి చుట్టుప్రక్క గ్రామాలనుండి ప్రజలు తండోప తండాలుగా రావడం-అలా తిరునాల వేడుకలు చూడవచ్చిన జనానికి లేదనకుండా అన్నదానం జేయడం కూడా మాకాచారా లయ్యాయి.

ఒక సంవత్సర మలాగే స్వాములవారికి ఉత్సవా లతివైభవంగా నెరవేరినై. కైంకర్యములు చెల్లించిన తరువాత నేను కుటుంబసమేతంగా దేవాలయం నుండి తిరిగిపోతూ సింహద్వారం దగ్గర లోపలి భాగంలోని కుడివైపునున్న యరుగుమీద కూర్చుని యున్న యొక మునిని చూడడం జరిగింది.

నిజానికైతే మునీంద్రుని ముఖపద్మంలో మహాతేజం కొట్టొచ్చినట్లు

కనబడుతూంది. నేనా యతీంద్రునకు చేతులు మోడ్చి "మహాత్మా! కేవలం పరమ శివమూర్తిలా సాక్షాత్కరించిన మీరు దైవాంశ సంభవులులా కనపడుచున్నారు. కయాచితంగా మీ దర్శన భాగ్యం లభించిన నేడు మా కెంతయినా శుభదినం. దయచేసి మా రాజభవనానికి కొక్కసారి విజయంచేసి మీ పాద ధూళితో మా గృహాలను, మమ్ములను పవిత్రంచేయండి. మీకు దగిన సత్కారాలను సమర్పించు



స్వాములవారి సన్నిధిలో యోగి పురాణ కాలక్షేపం చేయడం

కుంటా"నని సవినయంగా ప్రార్థించాను. ఆ మాటలాలకించిన మునీంద్రుడు నవ్వి "జయసేన మహారాజా! సర్వసంగ పరిత్యాగం చేసిన మేము రాజభవనాలతో అడుగు పెట్టరాదు. నీకంతగా మాయందు భక్తి విశ్వాసంబులున్న యెడల పాలు పండ్లు పంపిన చాలును. భక్తుల కోరిక నిరాకరింపరానిది, కావున స్వీకరించగలం-ఆ ఫలితం నీకు కలిగింపగల" మన్నారు.

ఆ మాటలు అక్షరాల నిజములే ననుకున్నాను.

స్వాములవారికి దేవాలయ ప్రాంగణంలోనే ఒక పర్ణశాల నిర్మించారు. సన్యాసికి యే లోపము లేకుండ పరివారాన్ని గూడ నియమించాను. ప్రతిదినం సాయంకాలలందు మునీంద్రులు జ్ఞానబోధలు చేయడం ప్రారంభించాడు. గోపాలస్వామి సన్నిధానంలో యిలా వేదాంతగోష్ఠి జరగడం కూడా చాలా మంచిదనుకున్నాం. పురాణ కాలక్షేపం వింటానికి వచ్చిన ప్రజలనుండి సన్యాసికి గురు కానుకల రూపంలో ధన కనక వస్తు సముదాయం బాగుగనే లభించుచూ వచ్చింది. కాలక్రమంగా స్వాములవారు స్త్రీల కుపదేశాలీయడ మధికమయింది. ఆ సమయాలలో పురుషులుండరాదనే కట్టుబాట్లు రూపొందినై. గురుస్వాముల వారికి ఏకాంత సేవ లెక్కువయ్యాయి.

ఆలయ పూజారిగారి మరదలు తిరువేంగళాంబాదేవి గూడ యింతకు ముందునుండి పూజలు చేయడం-పురాణాలు చెప్పడము నుండేది. ఆమెకు కూడ ఒకరిద్దరు శిష్యురాండ్రుండెడివారు. పండితగోష్ఠియనే పేరుతో యీ తిరువేంగళాంబాదేవి, గురువుగారల కలయిక లెక్కువయ్యాయి. తొందరలోనే వారిద్దరి మధ్యా ప్రేమకలాపం ప్రారంభమయింది. అది గమనించిన పూజారి స్వాములవారిని చాలాసార్లు మందలించాడు. చివరిసారిగా పూజారి వానితో మీరింతట మా నగరం నుండి వెళ్ళిపోవడం మంచిదని కూడా హెచ్చరిక చేశాడు. కాని, సన్యాసిలో చీమకుట్టిన మాత్రమయినా చలనం రాలేదు.

చివరికది మా విచారణకు వచ్చింది. నేను నలువురు రాజసేవకుల నిచ్చి మునిని బంధించుకొని రమ్మనమంటూ మహామంత్రుల వారిని నియమించాను. మహామంత్రి రాజసేవకులను వెంటబెట్టుకొని పోయి వాని పర్ణశాలలో ప్రవేశించి నంతనే విషవాయు ప్రయోగం చేశాడు. రాజసేవకు లందరూ స్పృహదప్పి పడి పోయిన సమయంలో తిరువేంగళాంబాదేవితో కూడా వెళ్ళిపోవుచుండ మహామాత్యులవారు వాని నడ్డగించుటయు జరిగింది. కపట సన్యాసి తన దగ్గర దాచి యుంచిన కరవాలంతో మంత్రి నమాంతంగా హత్యచేసి పారిపోయాడు.

తరువాత రాజసేవకుల నియమించి యెంతదూరం వెతికించినా యతీం ద్రుని జాడ కనపడక పోయింది. తిరువేంగళాంబాదేవియు కనపడుటలేదు.

సరిహద్దు రాజ్యమయిన అవంతీపుర పాలకులకు మాకంతకుపూర్వం బద్ధవైరముండెడిది. వారు మమ్మెదిరింప దగినంత బలవంతులుగాక దూరంగా తొలగియుండేవారు. గజపతిసింహ నరేంద్రునకు కూడా మమ్మెదిరించి దాగల ధైర్యసాహసాలు ఏమాత్రమునూ లేవు. కాని ఉన్నట్టుండి యొకనాడనుకొనకుండ గజపతిసింహుడు మా మీదకు దండెత్తి రావడం జరిగింది. నిజానికి ముందు మేమామాట నమ్మలేకపోయాం. వీనికింత ధైర్యమెక్కడిదా యనుకున్నాం. ఎలాగయినా యుద్ధం తప్పనిదయింది. మా సైనికులు పట్టుదలతో పోరాడారు. మాకు విజయం లభించింది. మా సైన్యాధిపతియైన రిపుభయంకరుడు సాహసించి గజపతిసింహుని బంధించుకొని వచ్చి మా ముందుంచాడు.

యెంత పగవానినైనా చేతికిచిక్కినపుడు చంపుట మా సాంప్రదాయము కాదు. శరణుజొచ్చినవానిని నిందింపము కూడా. నిండుసభలో నేనాతనిని చూచి "గజపతిసింహా! ఇపుడెందులకీ యుద్ధం చేశావు? జన నష్టమున నీకు వచ్చిన లాభమేమి?" యని నేనడుగగా నాతండు లజ్జావదనంబున "జయసేన మహారాజా! నేనిపుడు వెనుకటి గజపతినిగాను. నీకు శరణార్థిని. నన్ను బంధవిముక్తుని గావింపుము. జరిగినదంతా వివరిస్తా"నన్నాడు.

నా యానతి ప్రకారముగా వాని బంధములు తొలగించారు మా సైనికులు.

ఉచితాసనము మీద వానిని సుఖాసీనుని గావించాం.

అంతట నా గజపతి సభలోని వారందరిముందిలా చెప్పాడు.

## జయసేన మహారాజ చరిత్ర

జయసేన మహారాజా! నేను కొలువుదీరియున్న సమయం. ఎక్కడినుండియో యొక యోగీంద్రులు వచ్చాడు. మేమాతనిని గౌరవించి కూర్చుండ

నియమించాం. ఆ వచ్చిన సన్యాసి "నా వంకచూచి గజపతిసింహా! తొందరలో నీకు చక్రవర్తియోగం సిద్ధింపబోతూంది" అన్నాడు. గొప్పదశరానున్నదన్నప్పు డెవరికైనా భ్రాంతియేగద! నేను నిజంగానా మహర్షీ!" అన్నాను. మేము మునీంద్రులం. మా నోటిమాట బూటకం కారాదు. మీకు శత్రువులైన యిలాపురం రాజుల నోడించే యుపాయం నాకు తెలియును. నీకు చెప్పడానికే వచ్చా" నన్నాడు.

ఆ మాటలు నాకప్పుడు రుచించినై.

సాధువులకు రహస్య మందిరంలో ప్రవేశం కల్పించాను.

"రాజా! నేను కపటసన్యాసి రూపంలో యిలాపురం ప్రవేశించి అచటి ప్రభువులను నమ్మించగలను. నాకు నీవిద్దరు ముగ్గురు వేగులవారిద్రను సేవకులుగా నియమించితే చాలు.వారక్కడ నా భక్తులుగ నటించి కోటలోని గుట్టుమట్టు రాబట్టుకొనే సముపాయం నేను చేస్తాను. సమయం చూచి నీవు కొలది సైన్యముతోనైనను వచ్చి జయసేన మహారాజును సులభంగా పట్టుకొనవచ్చునని చెప్పాడు. జ్ఞానములేని వాడనగుట నేనందులకు లొంగిపోయిన నా యపరాధాన్ని మీరిపుడు మన్నించాలి.

నేను వానికి కావలసిన ధనమిచ్చాను. తరువాత నా కపటముని మీ రాజ్యానికి వచ్చి యిక్కడ మహా యోగిలాగా నాటకమాడాడు. సాధువుల వేషాలలో వేగులవాంద్రు నా కెప్పటికెప్పుడు మీ విషయాలు చేరవేశారు. కొంతకాల మీ దుర్మార్గు డిక్కడ మీకందరుకు దేవుడయ్యాడు. చివరకాతని పాపంపండింది. పూజారి మరదలుతోగూడ సరాసరి నా దగ్గరకు వచ్చి చేరుకున్నాడు. నాకప్పటికైనను బుద్ధిరాని కారణమున వారికాశ్రయ మిచ్చాను. అతడు చెప్పిన ప్రకారముగా మీ కోటను పట్టుకొని విజయం సాధించాలనే పేరాశతో మీమీద దండెత్తి వచ్చాను.

కాని ధర్మం జయించింది. ఇంత చేసినా నన్ను మన్నించిన మీ న్యాయ బుద్ధికి నేను క్షమాపణ చెప్పుకుంటున్నాను. ఇంత యోగ్యులైన మీతో వైరం

బెట్టుకొనడం నాదే పొరపాటని నేనిపుడు నిజం తెలుసుకున్నాను. నేను చేసిన దానికి పశ్చాత్తాప పడుతున్నాను. జయసేన ప్రభూ! మీరనుగ్రహించితే నేనుమీలో నొకనిగా కావాలని కూడా తలంచుచున్నాను. "ఈ విషయమునుబట్టి నా యీ మాటలు మీరు నమ్మలేక పోవచ్చును. అందులకొక మార్గం చెప్పుచున్నాను. నాకున్న యేకైక కుమారి పద్మావతీదేవిని మీ కుమారుడు విక్రమార్కునకిచ్చి



గజపతిసింహునితో వియ్యమందుకోమని.
అలాగైతేనే భోజనం చేస్తానని రాజు కోరటం

వివాహం చేయ నిశ్చయించుకొన్నాను. అప్పుడు నా కుమారి మీయింటి కోడలవుతుంది. ఆ తరువాత మీకెన్ను కలిగించితే నాబిడ్డ కపచారం చేసిన వాడనగుదును గదా! రాజా! దీనిని మీరు కాదనవలదని దీనాతి దీనంగా ప్రార్థించాడు.

ఆ మాటలకు నా మనసు కరిగిపోయింది.

గజపతిసింహ మహారాజా! గతించిన దానికై చింతించకండి. మన

ముభయుల వియ్యమును గురించి తరువాత నాలోచింప దగినది. కాని నీవు శత్రువుగా నున్నంతకాలము నిన్ను మన్నించినాము. యిపుడు కూడా మిత్రుడవుగా కోరుచున్న నిన్ను ద్వేషింపను. సాటి రాజబంధువుగా నిన్ను గౌరవించుచున్నాను. లేచి స్నానాదులు చేయండి. భోజనముచేసి విశ్రాంతి తీసుకొనిన తరువాత మిగతా విషయములు మాటాడవచ్చునన్నాను.

కాని గజపతి మొగం చెల్లలేదు. "అలాకాదు మీరు నాతో వియ్యమందుకుంటానని మాట యిస్తేనే నేను మీ సహపంక్తి భోజనం చేయగల"నని పట్టుబట్టాడు. నా కుమారుడు విక్రమార్కుడు వాని కుమార్తె పద్మావతినివివాహమాడ నంగీకరించడం జరిగింది. ఇది ఇలా జరుగుతుండగా సైన్యాధిపతి కొందరు యోధులతో సరిహద్దు రాజ్యానికిపోయి కపట సన్యాసికై కోటనంతా గాలించాడు. అతడు కనపడలేదు సరికదా తను నమ్ముకొని వెంటబోయిన తిరువేంగళాంబను హత్యచేసి పారిపోయినట్లు తెలిసింది.

ఇప్పటికయినను వానినిపట్టి ముక్కలు ముక్కలుగా నరికి వేయడానికే గాలించుచున్నారు. నీవలన మాకా కిరాతకుని యునికి తెలిసింది. సుధాకర్! నీవు మాకాత్మీయుండవు. మరుద్వీతి నగరానికి మార్గంచెప్పు. మేమిపుడే వెళ్ళి... అని యింకా యేమేమియో అనబోవుచుండగా సుధాకర్ అందుకొని "జయసేన మహారాజా! తమరిప్పటికి శాంతించండి. నేను మిగిలిన రెండు ప్రశ్నలకు గూడ సమాధానం తెలుసుకున్నాక మీకు వార్త పంపగలను. మనమందరం కలసిపోయి వానికిం దగినశాస్తి చేయుద"మని శాంతపరిచాడు.

తరువాత లేచి అందరూ భోజనాలుచేసి శయనించారు.

మరుసటి యుదయాన కాలకృత్యములు తీరిన తరువాత రాజభవనంలో సమావేశం జరిగింది. జయసేన మహారాజావారికి కాత్మీయ బాంధవుడయ్యాడు. "మహారాజా! మీ యాదరాభిమానాం వలన నా మొదటి ప్రశ్నకు సమాధానం లభించింది. ఇక మిగిలినవానిని గూడ సాధించుటకు బయలుదేరుచున్నాను. నన్ను మీరాశీర్వదించి పంపండి" అన్నాడు సుధాకర్ వినయముట్టిపడేలాగా.

జయసేన మహారాజావారి కాయనమీద యెక్కడలేని యభిమానం పుట్టుకొచ్చింది. నేను నిన్ను గురించే యోచించుచున్నానను చుండగనే కొందరు వర్తకులు వచ్చి నమస్కరించి "ప్రభూ! తమ రెందులకొ మమ్ములను రావలసినదిగా యాజ్ఞాపించినందున వచ్చినాము. మమ్ము రావించిన పని ఏమిటో సెలవీయండి" అని చేతులు జోడించుకొని నిలబడియుండగ జయసేనుడు వారల గూర్చుండ నియమించి "అయ్యా! ఈ చిరంజీవి మాకు నూతన పరిచయుడైనను ప్రియబంధువు. ఇప్పుడీతండొక ప్రముఖ కార్యార్థియై కాంశ్యనగరానికి పోవలసిన యవసర మేర్పడింది. మీరిదివరలో కొన్ని పర్యాయము లచ్చటకు వ్యాపారార్థం పోయివచ్చిన వారు కావున కాంశ్యనగర మిక్కడి కెంతదూరమున నున్నది? ప్రయాణము చేయుటెట్లు? మొదలయిన వివరంబుల నడిగి తెలుసుకొనుటకే మిమ్ము పిలిపించా" నన్నాడు.

ఆ మాట లాలకించిన వర్తకులు "ప్రభూ! కాంశ్య నగరం మాకు పరిచయం కలదే. కాని ప్రయాణం చాల ప్రమాదకరం. అక్కడకు వెళ్ళినవారు తిరిగి వచ్చిందాకా నమ్మకంలేదు. కనుక ప్రాణాల మీదాశ లొదులుకొనిన వారు గాని అటు ప్రయాణం చేయరు. అది హాటక మణిద్వీపంలో మధ్యగా నున్న నగరం. ద్వీపానికి చుట్టూ తీరంలో విలువయిన రత్నజాతులు విచ్చలవిడిగా నేలమీద దొరకగలవు. అచట సంచరించే గండభేరుండ పక్షులు చాలా భయంకరము లయినవి. ఒక్కొక్క గండభేరుండ పక్షి ఆకాశంలో తిరిగేటప్పుడు పెద్ద కారుమబ్బు పడినట్లు నేలమీద చీకటి నిండుతుంది. అవి భూమిమీద సంచరించే గేదెలు, దున్నలు మొదలయిన జంతువులను అవలీలగా తన్నుకొని పోయినపుడు యెక్కడికి పోయినది గూడ తెలిసికొనిన వారింతవరకు లేరు.

అసలు హాటక ద్వీపం చేరిందాకను నమ్మక ముండదు. ఆ ద్వీపంచుట్టు సముద్రంలో యోజనం దూరాన చాల లోతయిన సుడిగుండము లున్నవి. దారిదప్పి సుడిగుండమును సమీపించినపుడింక యోడ జాడయినా కానరాదు. ఆ సుడిగుండములు తప్పితే నీటిలో మునిగి యున్న యెత్తయిన కొండలకు ఢీకొన్నచో యోడ ముక్కలు ముక్కలుగా పగలిపోతుంది. మంచి యనుభవం గల నావికులు జాగ్ర

త్రగా యోడ నడిపినప్పటికిని గొప్పగొప్ప తిమింగలంబుల బారినుండి తప్పించు కొనుటయు కష్టం కనుక వీలయితే తమరా ప్రయాణం విరమించుకొనడం చాల మంచి"దని హితోపదేశం చేశారు.

"ప్రాణం పోయిన తరువాత మాట నేను చెప్పలేను కాని ప్రాణ మున్నంతవరకు విరమించే పని యుండదు. దైవ నిర్ణయాని కంతరాయముండదు. దయయుంచి నే నక్కడకు వెళ్ళే మార్గం చూపండి" అన్నాడు సుధాకర్.

మహారాజా వారంతట "వర్తకులారా! మీ మాటలను బట్టిచూడ మా చిరంజీవి నొంటరిగా పంపుటకు మనసొప్పకున్నది. మీ రిదివరలో పోయివచ్చిన వారు. ఎటులయినను మీరు కొన్ని యనుభవముల సంపాదించియుంటారు. మానవ ప్రయత్నానికి లోపం లేకుండా మీ ప్రాణరక్షణకు కావలసిన సదుపాయాలన్నిం టిని నేను చేయిస్తాను. మీ కేయే సామగ్రి కావలయునంటే దానినంతా సమకూరు స్తాను. మీరు మా సుధాకరుని కాంశ్యనగరం తీసుకొనిపోయి విడిచిపెట్టి రండి. మీ రడిగినంత ధన మిస్తా" నన్నాడు.

వర్తకులు కాదనలేక "ప్రభూ! మీ యాజ్ఞ మీరరానిది కనుక ఎల్లుండే ప్రయాణం" అని చెప్పి వెళ్ళిపోయారు.

## దారితప్పిన ప్రయాణము

ఓడ బయలుదేరింది. జయసేన మహారాజు ఓడ నిండా ప్రయాణికులకు కావలసిన ఆహార పదార్థాల నన్నింటిని సమకూర్చాడు. తిమింగలాలు వస్తే వానిని చంపడానికి వీలయిన ఆయుధాలతో సేవకులను నియమించాడు. క్రొత్తదేశంలో రాకుమారుని కవసరమంటూ కావలసినంత ధనమందించాడు. మహారాజుతో బాటు యువరాజు, మంత్రి మొదలయిన వారందరూ ఓడలో యెక్కిన సుధాకరునకు వీడ్కోలుచెప్పి తిరిగిపోయారు.

సముద్ర ప్రయాణంలో అనుభవంగల నావికులు జాగ్రత్తగా ఓడ నడుపుచుండగ వ్యాపారులు కాంశ్య నగర విశేషాలు రాజబంధువునకు వివరించి చెబుతున్నారు.

సముద్రంలో ఓడ వారం రోజులు నడిచింది. ఆకాశంలో ఎగురుతూన్న పక్షులను చూచి మనం మణిద్వీప తీరం చేరుకుంటున్నా మని ప్రయాణీకులను కొనసాగారు. భగవానుని దయవలన ప్రమాదం పాలు కాకుండా అనుకున్న చోటును చేరుకుంటున్నందుకు ఓడలోని వారందరు సంతోషించుచుండగ చీకటి పడింది. నావలో దీపాలు వెలిగించారు. అంతలోనే గాలిలో మార్పు కనిపించింది వాన సూచన నిచ్చే గాలి కందరూ అనుమానాలు వెలిబుచ్చారు.


క్రమంగా వాన ప్రారంభమయింది. గాలి హెచ్చి తుఫానుగ పరిణ మించింది. నావికులు సముద్రంలోనికి లంగరులు జారవిడిచారు. ఉవ్వెత్తున లేచి వచ్చే కెరటాల తాకిడి నావ కెక్కువయింది. అలలతోబాటు పరుగెత్తుగ వచ్చిన తిమింగలాలు గూడ యోడను తాకుచున్నవి. మొత్తంమీద భీభత్సం కల్పించుచు న్నందున ప్రయాణికులు బ్రతుకుల మీదాశ లొదులుకొని యెవరెవరి యిష్టదైవంబు లను వారు తలచుకొంటూండగ సుధాకర్ గూడ "జై మృత్యుంజయ మహామునే నమః" అని స్మరించుకున్నాడు. తెల్లవారుజాముకు తుఫాను తగ్గిపోయి ప్రశాంత వాతావరణ మేర్పడింది.

లంగరులు దీయించి మరల ప్రయాణం సాగించారు. మనసు వికలమయిన నావికులు పొరపాటున దారి తప్పించిన కారణంగా హాటక ద్వీపం చేరవలసిన నావ కీచక ద్వీపం చేరింది.

ఓడ ద్వీపతీర ప్రాంతాలకు చేరగానే నావికులు, వ్యాపారులు యిది హాటకద్వీపం కాదని దారితప్పి మరొక ద్వీపానికి చేరుకున్నామని తెలిసికొన్నారు. ఓడ రేవు చేరింది. తీరవాసులైన కీచకులు నావలో ప్రవేశించారు. అక్కడి వారంతా అడవి కీచక జాతికి చెందిన మొరటివాండ్రు. నల్లగ మన్ను పేరుకొనిన శరీరాలు గొర్రె బొచ్చులాంటి తల వెంట్రుకలు, ఎఱ్ఱగ బయటికి త్రోసుకొని వచ్చిన కను గ్రుడ్లు, ఎగుడు దిగుడుగానున్న పొడవైన దంతాలు ఎవరికి అర్థంకాని భాషచూచి మనం పురాణాలలో వింటూండే రాక్షసులంటే యిలాంటి మనుషులేమోనని యను కొని భయపడి పోయారు.

కీచకులను చూచిన ప్రయాణికులు యీ గుంపు అడవిజాతి మనుషులలో

గూడ చాలా వెనుకబడిన మొరటు రకమని గ్రహించారు. నాగరికత బొత్తిగా తెలియని రెండుకాళ్ళ పశువుల బాపతు— మన వేషం లేదు. మన భాషరాదు. మాటలతో ప్రయోజనం లేదనుకొని రాజసేవకులు కరవాలాలను దూసి ముందు నలువురిని ముక్కలు ముక్కలుగా నరికివేశారు. ఓడంతా రక్తమయ మయింది. కీచకులు వారి శత్రువుల మీదకు దాడిమీరితే మోటు కర్రలనో, రాలనో యుపయోగించి



దారితప్పి హాటక ద్వీపం కాక కీచక ద్వీపం చేరుట

చితుకగొట్టి చంపడందప్ప యీ కత్తులు, కఠారులు చూచియుండలేదు. వారిలో మెరికలలాంటి నాయకులు నలువురు రూపాలు లేకుండా తెగిపోవడం చూచినంతనే వారికిగూడ. అదేగతి పట్టుతుందనే భయంతో యెటువారటు పారిపోయారు.

ప్రయాణీకులంతా ఓడదిగి నిర్భయంగా తీరప్రాంతాలలో తిరిగిచూచారు. కీచకులు మళ్ళీ వారిదగ్గరకు వచ్చే సూచనలు కనపడనందున నవ్వుకొని అడవి

నంతా గాలించారు. లేళ్ళను, దుప్పులను వేటాడి చంపుకొని తిన్నారు. మంచి పగడాలు, జవ్వాజిపునుగు యాలకులు, లవంగాలు, జాజికాయ, జాపత్రి మొదలయిన సుగంధ ద్రవ్యాలను కొల్లలుగా సమకూర్చుకొని వచ్చి నౌకలో కూర్చున్నారు. కీచకద్వీపం నుండి బయలుదేరిన నావ యే ప్రమాదము లేకుండా మరునాటికి హాటకద్వీపం చేరింది.

హాటక ద్వీపానికి రాజనగరమయిన కాంశ్యనగరం పాలించే విజయశేఖరవర్మ విదేశీయులకు గౌరవపూర్వక ఆహ్వానము లిచ్చాడు. రాజాదరణ పొందిన ప్రయాణికులందరకూ స్నానపానసరులు-భోజన సౌకర్యాలు లభించినై. ఆనాటి సాయంకాలం వ్యాపారులు సుధాకరుని విజయశేఖరవర్మ భూపాలునకు పరిచయంచేస్తూ "మహారాజా! వీరు మణిద్వీపము నందున్న వజ్రాపురాధీశ్వర చంద్రవర్మ భూపాలుని కుమారులు సుధాకర యువరాజావారు. మొనమొన్ననే మా జయసేనమహారాజావారి కాత్మీయ బాంధవులయ్యారు. వారే వీరిని స్వయంగా మీ యొద్దకు పంపియున్నారు. తమరు వీరితో మాటాడగలరని" చెప్పి రాజసన్మానాలు పొంది, కీచక ద్వీపంనుండి తెచ్చిన సుగంధ ద్రవ్యముల నమ్ముకొని అచట విలువయిన రత్నములను కొనుగోలు చేసుకొనిన తరువాత నావనెక్కి తిరుగు ప్రయాణంలో ఇండ్లకు చేరుకున్నారు.

విజయశేఖరవర్మ తన చెంతకు వచ్చిన రాకుమారుని యోగక్షేమములు విచారించి జయసేన మహారాజా వారియందు మా కభిమాన గౌరవములున్నవి. వారి కాత్మీయులైనందున మీరు మాకు నాత్మీయులే. మీకిచట ఎటువంటి లోపము కలుగదు. మమ్ములను గూడ మీరు మీ ప్రియబాంధవులట్లు భావించి మా సపర్యల స్వీకరింప మా యభిమతము. భోజనాలనంతరమున విశ్రాంతిగ తమరు విచ్చేసిన కార్య మేదియో తెలిసికొని నా కవకాశ మున్నంతవరకు తప్పక తోడ్పడగల ననినంత సుధాకర్ వినయ పూర్వకముగ నమస్కరించి "తమరు చేయనున్న యుపకారం నా కొక్కనికి పరిమితము గాదు. మన దేశానికే యుపకారం కాగల"దన్నాడు.

## కేదారగుప్త మహారాజు కథ

సుధాకరా! నిషాదపుర మేలు కేదారగుప్తకు మాకు పూర్వవైరము లుండెడివి. కేదారగుప్తుని నలుగురు మంత్రులు దుష్టచతుష్టయము వంటివారు. రాజొకప్పుడు సంధి కంగీకరించినా మంత్రులు కుట్రలుపన్ని యుద్ధాలు చేయించడం రక్తపాతం వలన జననాశనం కావడమూ మాకు మామూలయింది. అంతే కాకుండా కేదారునికి తెలియకుండానే యీ మంత్రులు మా రాజ్యానికి చెందిన గ్రామాలమీదపడి దోచుకున్న రోజులుగూడ లేకపోలేదు. ఆడపిల్లలను బలవంతంగా యెత్తికొనిపోయి వేశ్యా గృహాలలో అమ్ముకొన్నారుకూడాను.

రోజురోజుకు మితిమించిపోతూన్న వారి దుండగాలనింక సహించ లేక పోయాం.

సరిహద్దు రాజ్యాలవార మైనందున మనలో మనకు పోరాటాలుమంచివి కావని మేము పంపిన రాయబారాలను వారు వినకపోవడమే గాక పోయినవారిని అవమానించి పంపించారు. రాజ్యాంగ ధర్మం ననుసరించి యిక మాకు యుద్ధం చేయక తప్పలేదు. మంది మార్బలాన్ని కూడగట్టుకొని నిషాదపురం ముట్టడించడానికి బయలుదేరిన మేము దారిలో యీ యడవిలో యిచటనే మజిలీ చేశాం. పనివాండ్రు వంటలుచేసిన తరువాత అందరమూ భోజనాలు చేసి కూర్చున్న సమయం. అదే తరుణంలో జడలు ధరించి, విభూదిరేఖలు దిద్ది, రుద్రాక్షమాలలు దాల్చి, కాషాయబట్టలు కట్టిన యొక సన్యాసి మా దగ్గరకు రాగా మేమాయనకు మర్యాదలుచేసి యుచితాసనంమీద కూర్చుండ నియమించాం.

ఆ వచ్చిన సన్యాసి నా ముఖంలోనికి సూటిగ చూస్తూ "నిన్ను విజయ లక్ష్మి వరించబోతూంది రాజా!" అన్నాడు. మంచిమాటలు విన్నప్పుడెవరికైనను సంతోషం పుట్టుకొస్తుందిగదా! "మునీంద్రా మీనోటి చలువన మాకు విజయం కలిగితే మీరు కోరింది యిస్తా"నన్నాను. ఐతే ఈ రక్షరేకు నీ దగ్గరుంచుకొమ్మంటూ ఒక తాయెత్తు నాచేతికిచ్చా డాయన. నేను తృప్తిగ దాని నందుకొని

కన్నుల కద్దుకొని కట్టుకొనబోగా సన్యాసియే స్వయముగ దాని నందుకొని నా కుడి ముంజేతికి కట్టి దీవించాడు.

"దీని విశేషమేమిటి?" అన్నట్లుగా నేనాయనంక చూచాను.

ఆయన చిరునవ్వు నవ్వుతూ "విజయశేఖర మహారాజా! నేనుమహిషాసురమర్ధనీదేవి మంత్రోపాసకుడను. నా పేరు హఠయోగీంద్రస్వామి. ఈ



విజయశేఖర మహారాజుకు తావీదు గురించి యోగి చెప్పుట

తాయెత్తు దేవీ పీఠము నందుంచి రోజొక్కంటికి లక్ష మంత్రం చొప్పున జపం చేసి పూర్తిగావించిన మహా మహిమగల యంత్రం గలది. దీనిని ధరించినవానికి యుద్ధంలో అపజయ ముండదు. అకాల మరణ ముండదు. దారిద్ర్య ముండదు. కొన్ని యద్భుత శక్తు లిందున్నవి. ఒకనాటి రేయి దేవి నా స్వప్నంలో కనబడి "హఠయోగీ! నీ శక్తినంతా ధారపోసి నిర్మించిన ఈ తాయిత్తు నీ దగ్గరుండరాదు

నీవు సన్యాసివి. లోకకళ్యాణం కోరదగిన నీవీ యంత్రమును ధర్మపరుడయిన యే మహారాజు కయినా యిచ్చిన యెడల ప్రజలు క్షేమంగా వుంటారు. రాజా దరణలో నీవుండి రాజు క్షేమం ప్రజాక్షేమం కోరడం ధర్మ"మని చెప్పింది.

ఆ మాటలు సమంజసమూలే నని నా కనిపించింది.

ఎవరి కీయ దగునని నేను విచారింపగా కాంశ్య నగరాధీశ్వరులైన విజయశేఖర మహారాజా వారే దీనిని ధరింపదగిన వారని పలువురినోట విన్నాను. ఆ ప్రయత్నమునందే మంచిరోజు నిర్ణయించుకొని, దేవికి నమస్కరించుకొని శకునం చూచుకొని బయలుదేరి వస్తూండగ వెతుకబోయిన తీగె కాలికి తగిలిన ద్నట్లు మీ పరివారములోని వారు కొందరు నాకు కనపడ్డారు. విజయశేఖర మహారాజా! వారిపుడు కాంశ్య నగరమునందున్నారా యని నేను వారి నడిగి తెలిసికొని నందున మీ దర్శనం దారిలోనే లభించింది. నేను వచ్చిన పనయింది. సంతోషం" అన్నాడు.

ఇపుడా దేవీ పీఠ మెక్కడున్నదని నే నడిగాను.

యోగీంద్రులు తిరిగి "ఇబ్బందిలేదు. నేను తిరిగి వెళ్ళేవరకు దేవికి జరగవలసిన నిత్య నైవేద్యాది సేవలు చేయడానికి యేర్పాటులు చేసే వచ్చాను. మీరీ యుద్ధంలో విజయం పొందివచ్చిన తరువాత నేనెక్కడ నుంటే అక్కడనే నా పీఠంగూడ యుంటుందన్నాడు ముక్తసరిగా! ఆయనగారి సంకల్పం గ్రహించిన నేను "అలాగే కానీయండి" అన్నాను.

సన్యాసి కక్కడనే తాత్కాలిక నివాస మేర్పరచి—కొందరు సేవకుల నియమించి—నేను తిరిగి వచ్చేటప్పుడు మిమ్ములను మావెంట బెట్టుకుని నగరికి తీసుకొని పోతానని చెప్పి యుద్ధానికిపోయి నిషాదపురి కోట ముట్టడించాను.

యుద్ధం చాలా భయంకరంగా జరిగింది. రెండు పక్షాలలోను జనం విపరీతంగా చనిపోయినందున రణరంగ మంతా రక్తమయ మయింది. అయి నప్పటికి కేదారగుప్తలో పరివర్తన కలుగకపోగా దుర్మార్గాలోచన పెరిగింది. మంత్రులు నలువురు తమ ముసుగులు ధరించి అర్ధరాత్రివేళ మా ధనాగారాన్ని-ఆయుధాగారాన్ని దోచుకునే తలంపుతో మా సైనిక శిబిరాలలో ప్రవేశించికావున్న

వారలను నోరునొక్కి చంపారు. అదే సమయంలో మెలకువగ నున్న మా దళాధిపతులు కొందరు చడి విని లేచిచూచి యుక్తి సాహసాలతో ఆ వచ్చిన యైదుగురను బంధించడం జరిగిపోయింది.

తెలతెలవారుచుండగనే కేదారగుప్త మంత్రులతో సహా బంధీలైన వార్త నిషాదపురం నలుమూలలా వ్యాపించింది. మా పరివారం వెంటనే రాజ కోటలో ప్రవేశించి రాజాంతఃపుర స్త్రీలను మహారాణినిగ్గూడ బంధించుకొని వచ్చారు. నిషాదపురాధీశ్వరుడు నన్ను చూచి సిగ్గుపడి తలవంచుకున్నాడు. నేనే వానిని పలుకరించి "మహారాజా! ఇంత పొరపాటుపని నీ వెందుకు చేశావు? నీవంటి వాడిటువంటిపని చేయవచ్చునా! ధర్మం పాలించే దైవ మింకొకడున్నా డనే యాలోచనయినా లేకపోయినదా?" అని మందలించుచుండగ కేదారగుప్త "ప్రభూ! నేను చేసింది పొరపాటు. నన్ను మన్నించమని నిన్నడుగలేక పోతు న్నాను. చచ్చినపాము నింకా చంపడమెందు" కన్నాడు. నా గుండె జాలితో కరిగిపోయింది.

అలాగానని వానినట్టే విడిచివేయడంకూడా మంచిపనికాదు.

కొంచెంసేపు ఆలోచించిన తరువాత "సరేరాజా! జరిగిపోయినదానిని గురించి చర్చించేది లేదు. దారిలో మా గురుదేవులు హఠయోగీంద్రులున్నారు. వారిని కలుపుకొని కాంశ్యనగరానికి పోదాం. తరువాత ప్రశాంతంగా సంప్రదించు కొని ఒక నిర్ణయానికి రావడం మంచిదికాని యిప్పటి కిప్పుడు నేనేమి నిర్ణ యించలేకున్నా" నంటూ నేను బందీలతో బయలుదేరి దారిలోనున్న యోగిని కలుపుకొని కాంశ్యనగరం చేరుకున్నాను.

మా విజయశేఖర మహారాజు కేదారగుప్తను వారిమంత్రులను బంధించు కొని విజయంతో వచ్చినారనే వార్త మా కాంశ్యనగరంలోను ప్రాకిపోయినందున ప్రజలు చూడడానికి గుంపులు గుంపులుగా వచ్చారు. నేను వారందర కేవో సమా ధానం చెప్పి తిరిగి పంపించాను. తరువాత మా ప్రధమ సేనాధీపతిని పిలిచి కేదారగుప్తుని తన మంత్రులతోగూడ మనం రాజ్యాంగ విషయాల గురించి సమా

లోచనలు జరుపుకొనే భవనంలోకి తీసుకొనిరండి. ఎటులైనను వారు మనకు శత్రువులు-మోసగాండ్రు నైనందున నమ్మరాదు. ఒక్కొక్కరిని గమనించి యుండి వారివలన పొరపాటు జరుగు పక్షమున వెంటనే చంపడానికి తగిన ఆయుధములుగల మన రాజభటులను గూడా యేర్పాటు చేయవలసినదిగా నియమించాను.

అదేవిధంగా సమావేశం జరిగింది.

ఆ సమావేశానికి సన్యాసినే పెద్దగా యెన్నుకొన్నాం.

"యోగీంద్రా! కేదారగుప్తాదులు మనకు శత్రువులే యగుగాక! వారిపుడు పట్టుబడినారు. చేజిక్కిన వానిని చంపటానికి నా మనసంగీకరించదు. అటులని నమ్మి విడిచిపెట్టుట కవకాశమూలేదు. ఈ సమయంలో యేం చేయవలయునో నాకు తోచుటలేదు. మీరే ధర్మమయినట్లు చేయండి" అంటూ వానికే బరువు భారమూ ఒప్పగించి కావలసిన ధనము—పనివారినీ సమకూర్చాను.

స్వాములవారే వారి నివాసమునకొక ఆశ్రమం నిర్మించుకున్నారు. ఆ యాశ్రమంతోనే మహిషాసుర మర్దని పీఠంకూడ నిలుపుకున్నాడు. ఆశ్రమము చుట్టూ ప్రాకారం నిర్మింపబడింది. ప్రాకారానికి అవతల చుటూనూ కొన్ని భవనాలు. ప్రాకారాలనుండి భవనాలకు పోవడానికి ద్వారాలు, ప్రతి ద్వారం దగ్గర ఆయుధాలు ధరించిన రాజభటుల కాపలా. ఆ భవనాలకావల యింకొక యెత్తయిన ప్రాకారం. దానినెవరూ దాటలేరు. ఆశ్రమానికి వెనుకగనున్న భవనంలో కేదారగుప్తుడు భార్యా బిడ్డలతో కాపురం. ప్రక్కలనున్న భవనాలలో మంత్రుల నివాసం. వారివారి మందిరాలలో అందరూ స్వతంత్రులే. కాని వారా యాచోట్లు దాటి యెచటకు పోరాదు. మంత్రులుగాని రాజుగాని ఒకరొకరికి కనపడరాదు. మాటాడుకొనసురాదు. వారిచుట్టూ రాజభటుల కాపలా వుంటుంది. యోగిమాత్ర మందిర దగ్గరకూ పోయి మాటాడటానికి అవకాశాలుండేలా యేర్పాటులు చేయించారు.

ఈ కట్టుబాట్లు చూచి నేను సంతోషించాను. యోగీంద్రులు నన్నుచూచి "రాజా! వీరికింకా అహంకారం చావలేదు. కొంతకాలం జరగాలి. నేను వీరికి జ్ఞానబోధలుచేసి మంచి మనసులు గలవారినిగా తీర్చిదిద్దుతాను. మనం తలచినట్లు వీరు ముందు ముందు మంచిదారికి వస్తే వీరికి వీరి రాజ్యమిచ్చి సామంత పాలకునిగా నియమించుకొనవచ్చు. లేదా, ఇక్కడి వారిక్కడనే అంతరించిపోతారు. అంతవరకు నీవే నిషాదపురాన్ని పాలిస్తుండు"మని చెప్పాడు.

అలాగా ఆరుమాసాలు జరిగినై.

అంతా ప్రశాంతంగనే గడిచిపోతూంది.

ఒకనాటి యుదయాన తెలవారకముందే హఠయోగి మునీంద్రుడు, కేదారగుప్తరాజు, రాణి ముగ్గురు పారిపోయిన వార్త రాజాంతఃపురం దాకా ప్రాకింది. మేమంతా పోయి చూచాం. ఆశ్రమంలో పీఠమున్నది. రాజదంపతులున్న మందిరం వాకిలి తెరచియుంది. ఆశ్రమంలోను, ప్రాకారాలలోను, మందిరాలలోను కాపలాలులుగాయుచున్న సేవకులంతా మత్తులోపడిపోయారు. మంత్రులు నలువురు యిక్కడనే యున్నారుకాని వారికేమి తెలియడంటున్నారు. అంతా అయోమయంగా మారిపోయింది.

## పతాకసేన మహారాజు కథ

మహర్షి గొప్ప మహిమగలవాడనే వదంతి రాజ్య మంతటా ప్రాకింది. ప్రజలు గుంపులు గుంపులుగా వచ్చి స్వామిని సేవిస్తున్నారు. వారిచ్చే తీర్థప్రసాదాలు పుచ్చుకొంటున్నారు. కొందరు వేదాంత చర్చలు చేయుచున్నారు. యోగీంద్రులు చేతులు చూచి చెప్పడం పురాణోపన్యాలు చేయడంతో జనవశీకరణ సంపాదించాడు. భక్తాదులు కానుక లర్పిస్తున్నారు. ఆ తతంగ మంతాచూచి నా మటుకు నేనూ పొంగిపోయాను. వచ్చిపోయే యాత్రికుల సౌకర్యార్థం నేనూ కొన్ని యొసరులు కల్పించాను. కాని సన్యాసి తన చెంతకు వచ్చిన వారెవరూ రాత్రికాలంలో అక్కడుండరాదని శాసించాడు. అదే పద్ధతి జరుగుతూ వచ్చింది.


గురుదేవుడు కేదారగుప్తునికి జ్ఞానబోధలు చేయుట కనే నెపంతో రాక పోక లెక్కువ చేశాడు. వారు ప్రయోగించే సమయాలలో యెవరూ దగ్గరుండరా దనే నిర్ణయం కూడా యేర్పడింది. కేదారగుప్త కూడా సన్యాసి సాగత్యంకోసం ముందుకొస్తున్నాడు. ఐతే మంత్రులుకొందరు మాత్రమెలాగో పసిగట్టి వారి సహాస్యాలోచనల నవగతం చేసుకుంటున్నారు కాని బందీలై యున్న కారణాన యేమి చేయలేక పోతున్నారు. ఇంత జరుగుతున్నా నా కనుమానం కలుగలేదు.

ఏకాంతంగా కేదారగుప్తను కలిసిన సన్యాసి, "రాజా! నీకొక వినదగిన కథ చెబుతున్నాను. నూరు సంవత్సరాలకు పైనాటి మాట. అప్పటికి నేను నీవు యీ విజయశేఖరుడు పుట్టనేలేదు. మొదట యీ హాటక ద్వీప మేలిన పతాకసేన మహారాజు వంశానికి చెందినవాడను నేను. ఆ కాలంలో దీనిని పాలించిన వారు నా పూర్వీకులు. ఈ విజయశేఖరుని వంశానికి చెందిన మణిశేఖరుడనువాడు వచ్చి పతాకసేనుని యొద్ద అంతఃపుర పరిచారికుడుగా ప్రవేశించాడు. కొంతకాలానికి కతడు కపట వినయం నటించుతూ రాజాధరణ పొంది కుటుంబ సభ్యులలో నొక డుగ ప్రభువులవారి కొంతరంగికుడుగా మారిపోయాడు.

ఒకానొక సమయాన కుటుంబ సమేతంగా తీర్థయాత్రలు సేవింపబయలు దేరిన పతాకసేన మహారాజు నమ్మకం కలవానిగా నున్న యీ మణిశేఖరునికే రాజ్యపాలనా భారం ఒప్పగించడం జరిగింది. ప్రధానవ్యక్తులను తన వశం చేసుకున్నాడు. సింహాసన మపహరించడానికి కుట్ర పన్నాడు. కొన్ని నిర్ణయాలు గూడ జరిగినై. యాత్రలు సేవించిన పతాకసేన మహారాజు తిరిగి కుటుంబముతో గూడ యింటికి వచ్చాక పెద్దయెత్తున అన్నసమారాధనలు చేసి దానధర్మాలుగూడ గావించి తృప్తిపడ్డాడు.

కాంశ్యనగర పాలనాధికారం కొంతవరకు గుప్పిట బట్టుకొన్న మణిశేఖరుడు తనకు కొందరు అనుచరులను సమకూర్చుకున్నాడు. దేవుని ప్రసాదంలో విషం కలిపి రాజమందిరానికి పంపించాడు. విషప్రయోగం చేయబడిన పతాకసేన మహారాజు భార్యాబిడ్డలు మరణించుచుండగనే మరికొందరు సేవకుల

నియమించి రాజకుటుంబానికి కంతకాకమనిన సహింపని ప్రధానోద్యోగు లందరను బంధించి కారాగారమున చేర్పించాడు. పురప్రజల నందరను రావించి వారిముందా మణిశేఖరుడు రాజకుటుంబము మీద తనకెంతో భక్తిగౌరవము లున్నటులను... జరిగిన ఈ ఘోరములో తన కెటువంటి ప్రమేయము లేనటులును తియ్యని మాటలతో "మహాజనులారా! మనలను కన్నతండ్రిలా పరిపాలించిన మన పతాకసేన



పతాకసేనుని రాజ్యం కుట్రతో మణిశేఖరు డపహరించుట

మహారాజావారు కుటుంబసమేతంగా చనిపోయినందున నేనెంతగానో చింతించుచున్నాను. దైవనిర్ణయాన్ని తప్పించడానికి మనమెంతవారం? ఇపుడెంత దుఃఖించినమాత్రం మరణించిన మహారాజావారిని తిరిగి బ్రతికించుకొనగలమా? పోయినవారితో పోలేము కనుక ముందు పనినిగురించి యాలోచించడం మనధర్మం.

ప్రస్తుతం కాంశ్యనగర సింహాసనం ప్రభువు లేనిదయినది. పతాకసేను

నికి వారసు లెవరో నాకు తెలియదు. నాకు తెలిసినంతవరకు లేరనుకుంటాను. దాని కాలోచనేముంది? ఎవరీ రాజ్యానికి పాలకులయితే వారే ప్రభువుకు దత్తు కుమారులవుతారు. కనుక యిపుడీ సింహాసనం మీద యెవరిని కూర్చుండబెట్టు దమో మీరే చెప్పండి. ప్రజాభిప్రాయం ననుసరించే ఇక్కడి పనులు నెరవేరుస్తా" అన్నాడు.

ఆ మాట లాలకించిన ప్రజలంతా మెచ్చుకున్నారు.

మణిశేఖరుని యాంతరంగిక మిత్రు లంతకుముందే యనుకొని వచ్చిన వారయినందున వెంటనే "ఇంకా ఎవరో యెందుకు! మీరే మాకు ప్రభువులు కావాలి" అని యెలుగెత్తి చెప్పారు అసలు మర్మం తెలియని ప్రజలా మాటనే బలపరిచారు. అంతలోనే "మణిశేఖర మహారాజుగారికి జై-మణిశేఖర మహారాజు గారికి జై" అనే నినాదాలు మారుమ్రోగినై. మణిశేఖరుని కుట్ర యెవరికి తెలియ కుండగనే కాంశ్య నగరానికి ప్రభువయ్యాడు. నేటి ఈ విజయశేఖరున కీ రాజ్య మిలాగా సంక్రమించింది.

పతాకసేనుని వంశం వారంతా రాజ్యం విడిచిపోయి కొండ కోనల పాలయ్యారు. వారు నా తాతతండ్రులు. ఒకనాడు మహారాజ కుటుంబానికి చెందిన మా పెద్ద లీనాటికిట్లు తిన తిండి, కట్టబట్ట, తలదాచుకొను నీడలేని కష్టాలపాలయి నదీ మణిశేఖరుని వలననేగదా అని వాపోయేవారు. రాజవంశానికి చెందిన నేను గూడ కొండలలో, కోనలలో బ్రతుకవలసి వచ్చింది. గత చరిత్ర నాలకించి నపు డల్లా యీ మణిశేఖరుని వంశీయులను సర్వనాశంచేసి తిరిగి కోల్పోయిన రాజ్యాన్ని సంపాదించుకోవాలనే తలంపు, పట్టుదల నాలో బలపడ్డాయి. కాని నా కెటుచూచినా బలం లేకపోయింది. కాని అన్ని హంగులున్న విజయశేఖరుని జయించే దారి దొరికక చాలాకాలం నాలో నేను కుమిలిపోయాను.

నా కొక నాడొక యాలోచన కలిగింది.

విరోధంతో చేయలేని పనులు మంచితనంతో చేయగలమనే నిర్ణయాని కొచ్చాను. అందుల కిదే యుపాయం. జడధారినిగా మారిపోయాను. సిద్ధుల కుండ

దగిన కొన్ని లక్షణాలను సంపాదించుకున్నాను. మూల కీలకాలు తెలుసుకొని అనుభవశాలి నయ్యాను. చివర కీ రూపంలో విజయశేఖరుని నమ్మించి యిక్కడ తిష్టవేశాను. నా ధ్యేయం ప్రాత పగ దీర్చుకొనడానికి కాని మేలు చేయడం కాదు. ఐనా నేను జడధారినిగా కొంతకాలం తపసు చేశాను కనుక భగవంతుడు నాకొక దారిగా నిన్ను చూపాడు. నీవు "ఊం" అంటే చాలు-ఈ కాంశ్య నగరమే కాదు-హాటక ద్వీపమంతా నీకు కైవసమయ్యేలాగా చేయగల" నన్నాడు.

కేదారగుప్తుని మనసులో ఆశాజ్యోతి వెలిగింది.

ఈ మాటలు నేను నమ్మవచ్చునా అన్నాడు సందేహించుచూనే—

"నమ్మితినే మన యిద్దరికీ మేలు జరుగుతుం"దన్నాడు యోగి.

ఇపుడు నన్నేం చేయమంటున్నారు?

ఇక్కడనుండి పారిపొమ్మంటున్నాను.

## తప్పించుకొనిపోయిన దొంగలు

రాజా! అందుకు కావలసిన ఏర్పాటు లన్నీ నా చేతిలో వున్నవి. నా కిక్కడ కొంత శిష్యగణ మున్నదని నీకు తెలిసి యుండవచ్చును. వారిలో నా కాంతరంగికు లున్నారు. నేను చేయుమనిన దానిని వారు కండ్లు మూసుకొని చేయడమేకాని యెదురు చెప్పడం జరుగదు. నీవు కూడ నా మాటకు సరేనంటే పిలిచినప్పుడు నా వెంట రావడమే నీవు చేయదగిన మొదటిపని.

అంతటితో కేదారగుప్త మనసు పూర్తిగ మారింది. కాని పరోకయను మానం కలిగింది!

"యతీంద్రా! మీ సాయంతో నేనైతే తప్పించుకొని పోగలను కాని, నా భార్య యిక్కడనే చిక్కుబడిపోతుంది. రాజకింకరు లామెను నిర్బంధించి "నీ పెనిమిటి నీకు తెలియకుండ యెక్కడికి పోయాడు? ఎప్పుడు పోయాడు? ఎలాగ తప్పించుక పోయా"డని అడగకుండ — వేధించకుండా విడిచిపెట్టరుగదా?" అని సందేహాన్ని వెలిబుచ్చాడు.

ఆమాత్ర మాలోచించకుండానే యింతవరకు వచ్చానా కేదారగుప్తా! ఆమె నిక్కడుంచరాదు - ఉండకూడదు కూడాను. దానికో పెద్దరహస్యమున్నది.

ఏమిటది?

ఇపుడు చెప్పరాదు.

నా క్షేమం కోరినవారు నా కుటుంబ రహస్యం నాకు చెప్పరాదా!

మొగమాట పెట్టుచున్నావు రాజా! చెప్పరాని దైనను చెప్పక తప్ప నందున చెప్పుచున్నాను. తొందరపడి పెడదారి బట్టొద్దు.

చెప్పండి అన్నట్లుగా కేదారగుప్త సన్యాసి మొగంవేపు చూచాడు.

నీవేకాదు-నిజాన్ని యెవరూ నమ్మలేరు. అబద్దంలో నున్న రుచి నిజంలో లేదుగామరి. విజయశేఖరు డిపుడొక వింతనాటక మాడుతున్నాడు. ప్రజ లలో తానొక ధర్మావతారమూర్తి ననిపించుకొని జన వశీకరణం సంపాదించడానికే యీ యెత్తువేశాడు. పగవాడైన కేదారగుప్తుని కపకారం చేయని పెద్దమనిషిలాగా పదిమందిలో కనిపిస్తున్నాడు. ఇందువలన వానికి రాగల నష్టమేమీలేదు-మీకింత తిండి బెట్టుతున్నాడు-మీ రాజ్యం పాలించుకుంటున్నాడు. రేపు నీమీద ఏదో యొక మహానేరం కల్పించి-అందరిచేత నిన్ను "ఛీ ఛీ" అనిపించి - నీకు మరణ దండన విధిస్తాడు. నీవపుడు "నేనే పాప మెరుగను దేవుడా" అని నెత్తిన నోరు కొట్టుకొని వాపోయినప్పటికి నీ మొరాలకించే వారుండరు. ఇది వాని రాజ్యం-వాని పరివారం-వాని ప్రజలు - వాని పెత్తనం. ఇంతకు ముందే తానొక న్యాయ మూర్తిగా పేరు సంపాదించుకొని వున్నాడు. నీ మాట నమ్మరు సరికదా నిన్ను ఉరికంబం యెక్కించవలసిందే"నని తీర్మానిస్తారు కూడ.

అపుడు నీ భార్య కెటుచూచినా ఆధార ముండదు. పెనిమిటిని గూడ కోల్పోయిన తరువాత యితరులకు సులభంగా లొంగిపోక తప్పదని విజయశేఖ రుని కపటాలోచన. దిక్కుబోవలు లేని పరిస్థితిలో యబల కేమి చేయలేక ఏ పని కయినా ప్రాల్పాడగలరని ఆ రూపంగ నీ భార్య నాతడు పొందవలయునను కోరిక తోనే మిమ్మేమీ కష్టాలపాలు చేయకుండ యింత మర్యాదగా చూస్తున్నాడని నీ

నిప్పటికయినా తెలిసికొని రానున్న యుపద్రవంనుంచి తప్పించుకొనవలె [illegible]. ఇందులో నాకుగూడ స్వార్థమున్నది. అది విజయుని [illegible] డమేనని యింతకు ముందు చెప్పాను" అని పూర్తిగా నమ్మించాడు.

యోగి మాటలు కేదారగుప్త తల కెక్కినై.

వెంట పోవడానికి సిద్ధమయ్యాడు. వాటికి కొన్ని [illegible] వచ్చినై. యోగీంద్రునితో "స్వామీ! మన మిక్కడ నుంచి తప్పించుకొ[illegible] దెలాగా? ఎక్కడుండగలం? ఆ తరువాత నేం చేయగలం?" అంటూ [illegible] కురిపించాడు. మునీంద్రులు జంకుగొంకులు లేకుండ "రాజా! దాని కన్ని [illegible] టులు చేసే యుంచాను. ముందు నీవిక్కడ నుండి నీ భార్యతో [illegible] నా వెంట రాకలిగితే..." అని ఆగిపోయాడు.

కేదారగుప్తుడు పూర్తిగా సన్యాసికి వశమైపోయాడు.


ఒకనాటి యర్ధమరేయి సన్యాసి యనుచరులు మత్తు పదార్థాలను [illegible] గించి ప్రాకారాలలో కాపలాలు గాయు వారందరనూ మైకంలో పడవేసి. యోగీంద్రుడు కేదారగుప్త యున్న భవనం తలుపులు తెరచి రాజ దంపతులతో గూడ మరి యిద్దరు సేవకులను వెంటబెట్టుకొని నగరం విడిచి పారిపోయాడు. ఆ వార్త నాకందిన వెంటనే మే మచటికి పోయి చూచి విస్తుపోయాం.

పారిపోయిన వారిని పట్టుకొనుటకై పరివారాన్ని నియోగించాను.

ప్రయోజనం లేకపోయింది.

కారాగారం నుండి తప్పించుకొనిపోయిన [illegible] ములు ప్రొద్దెక్కినప్పటికి ఒక కీకారణ్యం మధ్యచేరి మర్రిచెట్టు క్రింద [illegible] న్నారు. ఏ యవాంతరమూ లేకుండా రాజానగరం నుండి ఇంత [illegible] మనకిక ప్రమాదమేదీ యుండదులెమ్మని రాజ దంపతులు పొంగిపోయారు. [illegible] కెన్నడూ నడిచి యెరుంగని రాణి రత్నప్రభ మాత్రం బాగుగ [illegible] హఠయోగి కేదారగుప్తతో "రాజా! మహారాణిగారు బాగుగ బడలిక [illegible] న్నారు. ఆమెను చూచిన నాకే జాలి యగుచున్నది. మన [illegible]

భోజనములు చేసికొనిన తరువాత ప్రయాణము సాగించుట మంచిది. భోజనమునకు సామగ్రి కావలయును గదా! ఇదిగో నేనిచ్చిన యీ పది వరహాలు పట్టుకెళ్ళి సమీప గ్రామంలో పప్పు బియ్యములు, వంట చేసుకొను పాత్రలు కొని ఈ సేవకునిచేత మోయించుకొని రమ్ము. రెండవ సేవకుడు రాణిగారి చెంత కాచుకొని వుంటాడు. రాణిగా రించుక విశ్రమించి లేచేలోపల నేను ప్రక్కనున్న సెలయేటికి పోయి స్నానం సంధ్యావందనం ముగించుకొని వస్తా"నంటూ సంచిలోనుండి పది వరహాలు తీసి రాజు చేతిలో వుంచాడు.



సన్యాసి యిచ్చిన వరహాలు చేతపుచ్చుకున్న కేదారగుప్త మాటాడలేదు.

"మౌనంగా వున్నావేం రాజా! మహారాజునైన నేను యీనాటికొక సన్యాసి చేతినుండి పది వరహాలు తీసుకొనవలసి వచ్చిందే యని విచారపడుతున్నావా! అదంతా మరచిపో. అది కాల ప్రభావం. పరిస్థితులు బాగుండనపుడు

నీవేమి చేయగలవు? తొందరలోనే నీకు మహా చక్రవర్తి యోగం పట్టనున్నది. దానికేంగాని, ముందు భోజనాల కకాల మగుచున్నది. ముందు నీవీ ప్రక్కనున్న గ్రామంలోనికి పోయి కావలసిన వానిని తీసికొనిరా" అంటూ తొందర చేశాడు యోగి.

రాజు లేచి దారిబట్టాడు. సేవకు డాయన ననుసరించాడు.

రాణి కొంతసేపు మేను వాల్చింది. రెండవ సేవకునికి జాగ్రత్తచెప్పి యోగి ప్రక్కనున్న సెలయేటికి పోయాడు. ప్రొద్దు పడమరకు వాలుతుండగా రాణి నిద్రపోయి లేచింది. స్నాన సంధ్యాదులు ముగించుకొని వచ్చిన యోగి కూర్చుని రాణి కేవేవో మంచి మాటలు చెబుతున్నాడు. ముని మాట లాలకించు చునే మధ్యమధ్య పెనిమిటి రాకకై దారివెంట యెదురు చూస్తూంది రత్నప్రభ. అది గమనించిన యోగికూడ తన ప్రసగం నిలిపి "కేదారగుప్త యింకారాలేదే" అని మరల తన ప్రసంగం చెప్పడం సాగిస్తున్నాడు. చివరకు సూర్యాస్తమయ సమయ మయింది.

రాజుగారి వెంటపోయిన సేవకుడు తిరిగివచ్చి మేము గ్రామం చేరడా నికి పోవు దారిలో పొదలచాటున పొంచియున్న పెద్దపులి అమాంతంగా వచ్చి కేదారగుప్త మహారాజావారిమీద కలియబడింది. ఆయనగారు చాలా సేపు దానితో పోరాడి గాయపడ్డారు. వారిని నేనే ప్రక్క గ్రామంలోనికి భుజంమీద మోసికొని పోయాను. గ్రామంలోని వారు మంచివారై నందున ఆదరాభిమానాలతో రాజావారి నొకయింట మంచంమీద పరుండబెట్టి యుపచర్యలు సేయుచున్నారు. వారికి ప్రాణ భయం లేదుకాని కొంచెం చికిత్స పొందవలసుంటుంది. అమ్మగారిని చూడటానికి తహతహ లాడుతున్నారు. అక్కడున్న వారంతా మిమ్ములను తీసుకొని రమ్మని నన్ను పంపించా"రని చెప్పాడు.

ఆ మాటలు వింటూనే మహారాణి మూర్చపడిపోయింది.

సేవకులు తెచ్చి యిచ్చిన నీరు రాణి ముఖాన చల్లి మూర్ఛనుండి తేరు కొనేలాగా యుపచారాలుచేశాడు యోగి. "మహారాణీ! దురదృష్టదేవత మిమ్మింకా

విడిచిపోలేదు. అయినా భయంలేదు. నేనున్నాను. వనమూలికా వైద్యంచేసి నీ పెనిమిటి గాయాల నేను బాగుచేయగలను. పాపం నీకై ఎంత తపించుచున్నాడో ఏమో. తొందరగా పోవుదములె"మ్మని బయలుదేరాడు. సేవకుల వెంట రాణీ, రాణీ వెంట యోగి లేచి నడక సాగించారు. మసకచీకటి పడింది. కాని గ్రామం రాలేదు. వారొక కొండ ప్రదేశానికి చేరుకున్నారు.

యోగి సేవకుని చూచి "గ్రామ మెక్కడరా?" అని గద్దించాడు.

సేవకుడు భయపడుతున్నట్లు నటించి "గ్రామం దారి తప్పిపోయింది గురువుగారూ, నేను మరచిపోయాను. ఇపుడు చీకటి పడింది కనుక నేను దారి తెలుసుకొనలేను. రేపు ప్రొద్దున వెలుగులో తిరిగి దారి పట్టుకోగలను. మన్నించండి" అన్నాడు.

యోగి తన సేవకుని నాలుగు చివాట్లు వేసిన తరువాత "మహారాణీ! మన మింక చేయదగినది లేదు. ఈ కొండలో నేదైన లోయచూచుకొని తెలవారిందాకా కాలం గడపక తప్పదు. రేపటి యుదయం రాజావారి చెంతకు పోవుదం. ఇక్కడన్ని వసరులు నా సేవకులు చేస్తారు. నేను సాయం సధ్యా సందనం చేసుకుని వస్తా"నని చెప్పి దూరంగా పోయాడు.

## రత్నప్రభ కేదారగుప్తుల కలయిక

సేవకులు చిదుగుపుల్లలు సేకరించి మంట వెలిగించారు. ఆ మంట వెలుగుతోనే కొండలోయలో చిమ్మి బాగుచేశారు. ఆకులు తెచ్చి ప్రక్క నమరించారు. రాణి యా యాకులమీద కూర్చుండి యుండగా వారు కొన్ని పండ్లుతెచ్చి ఆమె ముందుంచి తినమన్నారు. కాని విచారంలో మునిగిపోయిన రాణి ఏమీ తిన కుండా ఉగ్గపట్టి కూర్చుంది.

"అమ్మా! పరిస్థితి పూర్తిగా విషమించి పోయింది." అన్నారు సేవకులు.

ఆమె గుండె దడదడ లాడింది. కన్నుల నిండా నీరు తిరిగింది. "ఏమిటి మీ రంటున్నది?" రాన్నది వణుకుతూన్న పెదిమలతో మహారాణి.

మహారాణీ! నీ విపుడు పులివాత బడిన మేకపిల్ల లాగా దుర్మార్గుడైన వీని బారిలోపడ్డావు. ఈ యోగి నిజమయిన మునికాడు. పచ్చి మోసగాడు. ఈ ప్రదేశమే యితని నివాసం. ఇక్కడున్న వారంతా యితనికి సంబంధించినవారే. నీ మీద మోహంతో యింత కపటనాటక మాడాడు. నీ పెనిమిటిని నమ్మించి ఈ రూపంగా నిన్ను తనచేత చిక్కించుకున్నాడు. కేదారగు ప్త పులి నెదిరించిన మాట అబద్ధం. మహారాజావారు సుఖంగానే యున్నా యింకొక రూపముగ చిక్కులలో పట్టుపడ్డారు. అక్కడనుండి ఆయన బ్రతికి బయటపడి వచ్చిందాక నమ్మకంలేదు. అదికూడా ఈ జడదారి కల్పించినదే. నిజం చెప్పాలంటే మేముకూడ యితని కుట్రలో చేరిన వారమే. నీ కేవిధమయిన యుపకారం చేయగల అవకాశాలు మాకు లేవని యింకా చెప్పబోవు నంతలో భయంకర వికటాట్టహాసం వినబడింది.

ఆ నవ్వు వింటూనే సేవకు లిద్దరూ "అడుగో సన్యాసి వసున్నాడు. ఇక మనమిక్కడ నుండగూడదు. పోదాంపద" అని అనుకుంటూ లేచిపోయారు.

మహారాణి కంతా అయోమయమయి పోయింది. విజయసేన మహారాజా వారి నిర్బంధంలో నుండగ మాకే చీకూ చింతా కలుగనేలేదు. మాయదారి జడదారి మాటలు నమ్మి ఆపదల పాలయ్యాం. నేనీవిషవలయంనుండి బయటపడేయుపాయ మేమిటి? నా పెనిమిటి యెక్కడున్నాడు? వారిని కలిసికొనే యదృష్టం నాకున్నదా అని యోచించుచుండగా యింతకుముందు వినిపించిన నవ్వే ఈసారి తనముందు వినిపించింది.

రత్నప్రభ తలెత్తి చూచింది.

వెకిలినవ్వులు నవ్వుతూ గడ్డం సవరించుకుంటూ తనముందు నిలబడ్డ వాడు యోగీంద్రుడే కాని- వెనుకటి కాషాయపుట్టాలకు బదులు పట్టు వస్త్రాలు, రుద్రాక్షమాలలకు బదులు బంగారాభరణాలు- విభూతిబొట్టుకు బదులు కస్తూరి

తిలకంబొట్టు, యోగి రూపానికి బదులు భోగి రూపం ప్రత్యక్షమయింది. అది చూచిన రాణి రత్నప్రభ మాటాడలేక మూగబొమ్మలా గ్రుడ్లప్పగించిచూస్తూంది. యోగి కొంచెం దగ్గరకు సమీపించి నవ్వుతూ "ఏమిటి అలా చూస్తున్నారు! క్రొత్తగా నేనే హఠయోగిని" అన్నాడు.

"యోగీంద్రు లింత శృంగార పురుషులా అని చూస్తున్నాను. నేను కలగనడంలేదు గదా" అంది రత్నప్రభ.

"లేదు లేదు. నీవు కలగనడంలేదు, చూస్తూన్నది అనుభవించ బోయేది అంతా నిజమేకాని కల యెంత మాత్రమూ కాద"న్నాడు యోగి యానంద పరవశంలో ఊగిసలాడుతూ.

ఐతే నా జీవితంలో క్రొత్త దాంపత్యం జరుగబోతుందా?

అందుకేగదా ఇదంతాను మరి నీకు—

అంగీకార మెందుకుకాదు? ఎవరయినా ఎప్పుడయినా పండువెన్నెలలను కాదని కటిక చీకటిని ప్రేమిస్తారా? ఒక రకంగాచూస్తే రాజభవనంకన్న మునాశ్రమమే మంచిదనిపిస్తూంది రాజరికంలో శత్రుభయముంటుంది. ఎన్నో ప్రమాదాలు వెంటాడుతుంటాయి. కేదారగుప్త యుద్ధంలో ఓడిపోవడము నాకిన్ని యగచాట్లు రావడముకూడ దానివలననేగదా! ఇక మునీంద్రులను రాజులందరూ గౌరవిస్తారు-పూజిస్తారు. సన్యాసి మఠంమీద దండెత్తే రాజులేలేరు. రాజపూజితంగల గురువుగారి భార్యమీద ఈగకూడా వ్రాలదు. కనుక నాకిదే యానందమనుకుంటున్నానన్నది రాణి.

ఐతే ఆలస్యమెందుకు? రా! అంటూ సమీపించబోయాడు యోగి.

వెంటనే రత్నప్రభ కొంచెం ప్రక్కకు తప్పుకుంటూ "ఎపుడెపుడాయని నేనూ యెదురుచూస్తూనే యున్నాను మహామునీ! ఈ దినమంతా నేను స్నానం చేయలేదు- భోజనం చేయలేదు. శరీరం చమటవాసన వేస్తూంది-క్రొత్తకాపురంలో కాలుపెట్టడ మిలాగునేనా! ఉత్తమురాలయిన ఏ యిల్లాలయిన తలంటు స్నానం

చేయాలి. మంగళగౌరిని పూజించాలి. పతి పాదాల నర్చించాలి. అప్పుడుగాని ఆలింగనా సుఖ మనుభవింపదు. అది భారతీయుల సాంప్రదాయం. పది కాలలపాటు పదిలంగా బ్రతకాలనుకుంటే నేను చెప్పినట్లు చేయండి. లేక నన్నొక కులటనుచేసి చవిచూచి విడిచిపెట్టా లనుకొంటే మీ యిష్టమొచ్చినట్లు చేయండి" అన్నది ప్రభ—



యోగిని రత్నప్రభ మాయమాటలతో మోసగించుట

కొంచెం యోచించిన యోగి "నేనీ మాటలు నమ్మవచ్చునా" అన్నాడు.

ఆలోచనగల మగవాడవయితే నా మాట నమ్మకుండుడు. నేనీ సమయంలో యింతన్న చేయగలిగిన దేమున్నది? అండలేనిచోటు, అర్ధరాత్రి వేళ, మనసు మార్చుకొనిన మగువ మరణం పొలపడమే గదా? పరిస్థితులన్నీ మారి

పోయి పంజరంలో చిలుకలాగా పట్టుబడ్డ పడతి యెక్కడికి పారిపోతుందని మీ యనుమాన మన్నది ప్రభ.

ఆనంద పరవశంలో ఉక్కిరి బిక్కిరయ్యాడు కపటసన్యాసి. నీవు చెప్పింది నిజం. నీ మాటలు నేను నమ్ముతున్నాను. నమ్మినా నా శిష్యులు నిన్నొక కంట కనిపెట్టే యుంటారు. నీవాగౌరీపూజ లన్నిటిని నిరాటంకంగా నెరవేర్చుకో. మంచి రోజులలోనే మనం మంగళ స్నానాలుచేసి మహానందంగా దంపతులమయి పోదాం. తెల్లవారేటప్పటికి నా సేవకులు వస్తారు. నీకిక్కడ కాపలా యుంటూనే నీకు కావలసిన యుపచర్యలు చేస్తూంటారని చెప్పి తిరుగుమొగం పట్టాడు.

"సరే. మీకు వీడ్కోలు చెప్తాను పదండి" అన్నది.

ఆఁ నాకు స్వాగతం చెప్పడమా, వీడ్కోలు చెప్పడమా! అన్నాడు యోగి.

స్వాగతం చెప్పే సమయం ముందుంది గదా! ఇప్పుడు చెప్పేది వీడ్కోలే, అన్నది ప్రభ.

ఓహో! మాటలలోగూడ మంచి జాణవే నన్నమాట. సరే పోతున్నానని దారిబట్టిన సన్యాసి వెంట నవ్వుతూనే గుహ వెలుపలిదాకా వచ్చింది రత్నప్రభ. సన్యాసి నవ్వుతూ "చాలాదూరం నన్ను పంపడానికి వచ్చావుకాని, ఇకపో" అని ముందుకు సాగాడు. ఆతనివంక చూస్తూనే నిలబడిన రత్నప్రభ కంటికి యోగి కనపడకుండా పోయిన తరువాత ఒక్కసారి గట్టిగా గాలిపీల్చుకొని బయటనుంచే గుహవంక చూడకుండ ప్రక్కదారిపట్టి పోసాగింది. పరువుకోసం ప్రాణాలను తెగించిన మహారాణి ఆ నాల్గవజాము రాత్రివేళ యడవిలో యెటుపోతున్నదో యెవకిరి తెలియదు. కొంతసేపటికి తెల్లవారింది. జాము ప్రొద్దెక్కింది. గడచిన దినమంతా తిండిలేక, నిద్రలేక, స్థిమితంలేక సొక్కి యున్నందున ప్రొద్దు పొడుపువేళ యెండ తీవ్రానికి భరింపలేక దారిలో పడిపోయింది. ఆమెకుస్మారకం లేదు.

సాయంత్రం సూర్యాస్తమయ సమయం.

మహారాణికి స్పృహ కలిగింది.

అపరిచితు లెవరో అందించిన మంచినీరు గటగట త్రావిన మహారాణి కళ్ళు తెరచిచూచింది. "ప్రభా" అనే పిలుపు చెవుల బడినంతనే లేచికూర్చుంది. మధురమైన ఆ పిలుపులోని ఆప్యాయత మహారాణికి కొంత పూర్వస్మృతిని కలిగించి లేనిబలాన్ని యిచ్చి నందున లేచి కూర్చున్నది. కాని తన కళ్ళను తాను నమ్మలేక పోయింది. "ప్రభూ" అనినతోడనే "ఆ నేనే" నన్నాడు. కేదారగుప్త "నేనిపుడెక్కడున్నా" నన్న రాణిగారి మాటకు బదులుగా రాజుగారు "నా చెంతనే యున్నావు. భయంలేదు. ముందు నీవులేచి స్నానంచేసి భోజనంచేయి. ఆ తరువాత అన్ని విషయాలు మాటాడుకొందాం" అన్నాడు. అంతలో కొందరు స్త్రీలు వచ్చి రత్నప్రభ రెక్కలు పట్టుకొని "రండమ్మగారూ" అంటూ లేవదీసి లోపలకు తీసికొనిపోయారు.

రత్నప్రభగారికి రాజోపచారాలు జరిగినై.

రాజుగారు గూడ వారి పనులు పూర్తిచేసుకున్నారు.

ఒకచిన్న వేదికమీద కూర్చున్న కేదారగుప్త రత్నప్రభను దగ్గరకు పిలిపించుకుని కూర్చుండబెట్టిన తరువాత ఆమె చెప్పిన కథంతా విని సన్యాసిమీద యుగ్రకోపంతో యుడికిపోయాడు. కాని దేనికయినా సమయం కానందున తమాయించుకొని "ప్రభా! ఇక నావిషయం చెప్తావిను. యోగిచే నావెంట బంపబడిన సేవకుడు నన్ను దారి తప్పించి గ్రామానికి పోనీయకుండ యీ గూడానికి తీసుకొచ్చేడు. ఈ గూడానికి పులికేతిగాడు రాజు. పులికేతిగాడును మాయసన్యాసి యనుచరుడే. వాడే వీనినిచ్చట సర్వాధికారిగ నియమించాడు. సేవకుడు వానితో నేదియో రహస్యములు మాటాడిన తరువాత తిరిగి దారిపట్టటంచూచి నేనాతనిని నను సరించాను. కాని పులికేతిగాడు నా కడ్డువచ్చి వికటాట్టహాసం చేస్తూ "ఆగు, నీవెక్కడికి పోతావ్? నిన్నింక కదలనీయను. బతికినంత కాలం యిక్కడుండి పోవలసినవాడవే"నని గద్దించాడు.

నేనెంత మర్యాదగ చెప్పిచూచినా వాడు దారి తప్పుకొనలేదు.

నాకంతట కోపం వచ్చి కరవాలం దూసి వాని తల నరికివేశాను.

అది చూచినంతనే గూడెంలో పెద్దపెట్టున కలవరం బయలుదేరింది. గూడెంలో నున్న జనమంతా కట్టగట్టుకుని వచ్చి నాచుట్టు మూగారు. వీరందరిని చంపి నేనిపుడు నా ప్రాణాలను కాపాడుకోవలయు కాబోలునని తలంచుచుండగా వారంద రొకసారి చేతులెత్తి దండాలు పెట్టారు. వారిముఖాలలో ఆనందముతప్ప ఆవేశం కనపడలేదు. వారి చర్య నాకు కొంత వింత కలిగించింది. దగ్గరకు పిలిచాను. వారిలో యిద్దరు ముగ్గురు ముందుకు వచ్చి "దొరా! నువ్వెవరివో మాకు తెలవదు కాని దేముడులాగా వచ్చి మమ్మ కాపాడినావు, ఇంకమీద నువ్వే యేలికవు. ఈ సచ్చినోడు పరమ దుర్మార్గుడు...

"మీరనేదేమిటో నాకు బోధపడటంలేదు. వివరంగా చెప్పండి" అన్నాను.

అంతా కూర్చున్నాం—ఏమిటని యడిగాడు.

దొరా! హఠయోగి యనే వాడొక కిరాతకుడు. ఈ యడవి పెదేశానికంతా వాడు పెద్ద. పెద్ద మోసగాడు. ఆడు దొంగేసాలు వన్నుకొని గొప్పగొప్ప నగరాలకు పోయి మహారాజులనే సిత్తు సేత్తుంటాడు. అప్పుడప్పుడూ వచ్చి మా గూడెంలో వోరిని పెట్టేబాధలు బాధలుగావు, ఆయోగిగాడేడకోపోతూ యీ పులి కేతిగాడిని యీడ మామీద పెద్దగా నియమించిండు. ఈడంతకంటె పచ్చినెత్తురు తాగే దుర్మార్గుడు కొంతమందయితే యీడు పెట్టే చెరలు పడలేక పానాలుగూడ తీసుకున్నారంటె నమ్మండి, మాలో ఓరికిగూడ యీడిని యెదిరించే దమ్ములులేక సావుబతుకుల్లో సిక్కుకున్నాం. ఆడిని సంపి మా పానాలకు హాయి కలిగించారు. మీపాదాలు కొలుత్తాం. నువ్విడనే యుండి మమ్ము కాపాడా"లంటూ నాకాళ్ళమీద పడిపోయారు.

కీడులో మేలన్నట్లుగా యిది కొంత మంచిదనిపించింది. మొదటిపనిగా నిన్ను కలుసుకునే యుపాయ మాలోచించుచున్నాను. అనుకొనకుండ యీయడవివారికి నీవు పడిపోయి యుండగా కనపడక-వారు నిన్ను తీసుకొని రావడం,

మవ మీవిధంగా కలుసుకొన గలగడమంతా దైవానుగ్రహ మనక తప్పదు. ఇక మనం చేయవలసిన దానిని గురించి యోచిద్దామని సరిపెట్టేడు.

## తిరిగివచ్చిన రాజదంపతులు

సుధాకరా! ఇచట చెరశాలలో బంధింపబడినవారు పారిపోయినందున నా మంచితన మెంత చెడుచేయుచున్నదా అని బాధపడ్డాను. ఇంతకుముందు నాచే యాదరింపబడిన కేదారగుప్తుడు యీసారి చేతికి దొరికినదే తడవుగా ముక్కలు ముక్కలుగా నరికి వేయాలనుకొన్నాను. హఠయోగిని ఉప్పుపాతర పెట్టించడానికి నిశ్చయించుకున్నాను. మీరెంత కాలం తిరిగైనాసరే తప్పించుకొని పోయిన ఆ ముచ్చురిని పట్టుకొనకుండా తిరిగి యింటికి రావలదని నా పరివారంలో మంచి సామర్థ్యంగల వారిని నియమించాను. కాని యెవరును విజయం పొంది తిరిగి రాలేదు.

ఒకనాడు సభదీరి కూర్చున్న సమయం. నలుగురు చెంచులు నా దర్శనానికి వచ్చారు. నేను వారిని పరామర్శి కూర్చుండ నియమించిన తరువాత మీరు వచ్చిన పని యేమిటని వారిని పరామర్శించి కూర్చుండ నియమించిన తరువాత మీరు వచ్చిన పని యేమిటని నేనడిగాను. వారంతట "మీతో ఒక ముఖ్యమయిన విషయం మాటాడడానికి వచ్చాం. కాని అది చాలా రహస్యమైనందున యితరులు మన మాటలు వినరాదు. మహారాజులు దయయుంచి మా కటువంటి సదవకాశం కలిగింప ప్రార్థించుచున్నామని వినయంగా చెప్పుకున్నారు.

నేనంతట వారికై కొంత సమయం కల్పించాను.

ఆ వచ్చిన వారిలో ఒకరు "దొరా! మీ నిర్బంధములోని ఖైదీలు కొందరు పారిపోయినట్లు మాకు తెలిసింది. వారిలో కొందరిని మీకప్పగించిన వారికి తమరీయగల బహుమాన మేమిటో మాకు చెప్పగలరా?" అన్నాడు.

"ధర్మము ననుసరించి వారడిగిన దేదైనను యిస్తా" నన్నాను.

పారిపోయిన వారిలో అసలు దోషి యెవరని మీయభిప్రాయం ప్రభూ!

ఆ మాట వింటూనే నాకనుమానం కలిగింది. ఈ వచ్చినవారు నిజమైన చెంచులు కారని-పారిపోయిన రాజదంపతులీ వేషంలో వచ్చి యుంటారని యూహించి "పారిపోయిన వారందరూనేరస్తులు—దండనార్హులే. వారిలోముఖ్యంగా కేదారగుప్త రాజైనందున అభిమానంతో నాకు బందీగా యుండలేక తప్పించు కొని పోవడానికి యోగిని ప్రోత్సహించి యుంటా"దని మేమభిప్రాయపడుతున్నాం. దానికి మీరేమంటారు?" అన్నాను.

మీరలాగా అభిప్రాయ పడడంలో న్యాయముంది—కాదనడం లేదు. కాని మునీంద్రుడు మహోజ్ఞాని కావలయును గదా ఒకరు దుర్బోధ చేసినంత మాత్రమున తాను వినవచ్చునా! ప్రభూ! దీని కంతకును కారకుడు హఠయోగీం ద్రుడే. వాని మాట నమ్మి తప్పించుకొని పోవడం రాజదంపతుల లోపం. చేసిన పొరపాటుకు ఫలితం ననుభవించిన కేదారగుప్త పశ్చాత్తాపంతో మిమ్మి శరణు జొచ్చితే మీరాయనను మన్నించ గలరా? 'మహారాజా!'

"పశ్చాత్తాపం చెందిన వానిని మన్నించడం మానవత్వ మనిపించుకుం టుంది. కాని మాకు నమ్మకం కలగాలిగదా!" అని నేనంటుండగానే కేదారగుప్తుడు తన మారురూపం తొలగించి నా పాదాలమీద వ్రాలి "విజయశేఖర మహారాజా! నేనే కేదారగుప్తుడను. అపరాధంజరిగింది. ఇప్పుడు నాలో నిజంగామార్పొచ్చింది. నన్ను మన్నించండి" యనుచుండ నేనాతనిని మనసార చేతులుబట్టి లేవదీసి "రాజా! సాటి వాడవైన నీవింతగా లోబడినపుడు నిన్ను నా వానిగా గౌరవింప కుందునా! వచ్చి నా సరసన కూర్చుండుమని" యుచితాసన మిచ్చి మర్యాదలు చేయించాను—"మీకీ మారు వేషాలతో పని యేమిటి?" అని యడిగాను.

దానికాతడు లజ్జావదనుడై ప్రభూ! నేనిపుడు ప్రజా దృష్టిలో నేరస్తు డను. నాలో కలిగిన మార్పు వారికి తెలియదు. రాజసేవకులు వారి ధర్మము ప్రకారము నేను కనపడి నంతనే నన్ను పట్టుకొని కొన్ని యవమానముల పాలు

సేయుదురు. అటువంటి యిబ్బందులలో చిక్కుకుండుటచే మారువేషములను ధరించవలసిన దంటూ జరిగిన కథంతా పూసగ్రుచ్చినట్లు చెప్పాడు. ఎంతో గొప్పవాడు, జ్ఞానవంతుడూ, పూజనీయుడూ అనుకొనిన యోగి యింత దుర్మార్గుడా అనిపించి "ఇంతకాముని యిపుడెక్కడున్నాడు?" అన్నాను.

ఆ వచ్చిన వారిలో ఒకరు కేదారగుప్త. రెండవవారు రాణి రత్నప్రభ.



కేదారగుప్తుడు, రాణీ రత్నప్రభ మారువేషాలలో రాజును దర్శించుట

మిగిలిన యిద్దరూ గూడానికి చెందిన నాయకులు. వారిద్దరూ "యోగి యుండేచోటు మాకు దెలియు" నన్నారు. వెంటనే రత్నప్రభను మహారాణి భవనానికి పంపించి కేదారపుప్త నేను మరికొందరు సైనికులు యా గూడెం నుండి వచ్చిన వారిని వెంటబెట్టుకొని సన్యాసిని చిత్రవధచేసి కక్ష తీర్చుకోవాలన్నంత కోపంతో

బయలుదేరిపోయాం. గూడెం పౌరులు మునియుండే చోటులన్నీ చూసారు. ఎంత వెతికినా కనపడలేదు. రత్నప్రభాదులు తప్పించుకొని పోయినందున ప్రమాద మును శంకించి ముని యెచటకో పోయి యుంటాడని నిర్ణయించుకొని మేము వెనుకకు తిరిగి వచ్చాం. ఇంతవరకు మాకాతని జాడ తెలియలేదు. అని రాజ కుమారునికి కావలసిన భోగట్టానంతా నందించాడు.

సుధాకరుని రెండవ ప్రశ్నకు సమాధానం దొరికింది. ఇక మూడవ ప్రశ్నకు సమాధానం కావాలి. "విజయశేఖర మహారాజా! మీ వలన నాకు రెండవ ప్రశ్నకు సమాధానం దొరికింది. మీ యుపకారం మరచిపోలేను. మూడవ ప్రశ్నకు సమాధానం రజిత నగరము నందున్నట్లు తెలిసింది. ఆ రజిత నగర మెందున్నది. దానికి త్రోవ మార్గమేది? అచట కెట్లు పోవలయును వివరములు కావలయు" నన్నాడు.

విజయశేఖరుడు బదులు చెప్పలేదు.

విజయశేఖరుని వృద్ధమంత్రి బుద్ధిసాగరు డంతట "ప్రభూ! రజితనగర మెందున్నదో నాకు తెలియదు. కాని మీకొక యుపాయము చెప్పగలను. ఇచటకు ఉత్తరపు దిశగా నూటేబది యోజనాలు దూరంలో పెనుగుట్టల కొండ వున్నది. దానిమీద పాములపడక మడుగు సమీపంలో నాగుమల్లె పొదుంది. నాగుమల్లి పొదకు తూర్పుగ పదిబారల దూరాన మంత్రాల మట్టి వున్నది. మంత్రాల మట్టికి పడమరగ దిగి భూమిలోనికి చొచ్చుకొనిపోయిన యూడ ప్రక్కన శిలావేదిక యున్నది. ఆ శిలావేదిక మీద కూర్చుండి యుండే తపస్వి నడిగితే రజితనగర వివరంబు లన్నియు తెలియగల"వని వివరించాడు.

విజయశేఖరుడు తనకిపు డాత్మీయుడైన సుధాకరునకు రజితనగరం త్రోవుట కుపాయం చెప్పిన మంత్రి నమితంగా కొనియాడిన తరువాత "సుధాకరా! నీవు తలపెట్టిన ఘనకార్యం, సామాన్యులు సాధింపలేని దానిని తలమీద పెట్టు కున్నావు. నీకు దైవం తప్పక సాయం చేయగలడు. కార్యార్థివి కావున బంధు మర్యాదలకై నీ ప్రయాణంబున కంతరాయం చెప్పరాదు. నీకు కావలసినంత

ధనమును—అవసరమైన యెడల పరివారమును గూడ తీసికొని క్షేమముగ పోయి లాభమున రమ్ము. తరువాత మన మందరము కలసి మరుష్వతి నగరానికి పోయి ఆ కపట సన్యాసిని ముక్కలు ముక్కలుగా నరికినగాని నేను తృప్తిపడలే" నన్నాడు విజయశేఖరుడు.

సుధాకరుడు విజయశేఖరునకు వినయ విధేయతలతో ధన్యవాదాలు చెప్పుకొనిన తరువాత "మీ యీ యాశీర్వచనమే నాకు పదివేలు. నాకు పరివార మవసరము లేదు కాని కొలదిగ ధనమున్న చాలును. పోయి వచ్చెదనని చెప్పి రాజ కుటుంబము నందరి వలనను వీడ్కోలు పొంది వృద్ధమంత్రి చెప్పిన మార్గము ననుసరించి ప్రయాణం సాగించాడు.

## బేతాళుని చేసిన యుపకారము

కాంశ్య నగరం నుండి బయలుదేరిన సుధాకరుడు మరింత పట్టుదలతో ప్రయాణం ముందుకు సాగించాడు. వాని గుఱ్ఱం కూడ యజమాని అవసరం గుర్తించిన దన్నట్లుగా నడక వేగం పెంచింది. కాలు నిలుపకుండ కార్యదీక్షతో పరుగెత్తి నందున రాజకుమారుడు మరునాటికే గమ్యస్థానం చేరుకున్నాడు. పెను గుట్టల కొండెక్కాడు—పాములపడక మడుగు దాటాడు. నాగుమల్లి పొద చూచాడు మంత్రాలమఱ్ఱి క్రిందకు చేరాడు. శిలావేదిక కనపడింది. కాని అంతవర కాయన మనసులో నున్న ఆలోచనంతా తారుమారయింది.

తపస్వియంటె జడలుగట్టిన జుట్టు—విభూది పూత—తులసి పూసల హారం—కాషాయ బట్టలు, చేతిలో యోగదండం యుంటాయని రాజకుమారు డూహించుకున్నాడు కాని-శిలావేదిక మీద కూర్చుండి యున్న యీ వ్యక్తి ఉంగరాలు తిరిగి బిరుసుపారిన జుత్తు, భూతవైద్యునిలాగా వెడల్పయిన కుంకుమ బొట్టు-మెడలో తాయిత్తుల దండ-ఎరుపురంగు బట్టలు- ప్రక్కనొక మొరటు కఱ్ఱముక్క చూడడంతోనే సుధాకరుని గుండె కలుక్కుమన్నది-ఎంత సేపాలోచించినా ఆయనొక నిర్ణయానికి రాలేకపోయాడు.

సూర్యాస్తమయ సుయింది.

శిలా వేదిక మీద కూర్చున్న భేతాళుడు సుధాకరుని చూచి "ఏం రాజ కుమారా! ఇంకా నీ యనుమానం తీరలేదా! భయంలేదు నా దగ్గరకురా! నిన్నంతా ప్రయాణం చేసి ప్రాణమాని యున్నావు. ఐనా కార్యదీక్ష నిన్ను విననాడడం లేదు. నీవు నన్ను చూచి సందేహిస్తున్నావని నాకు తెలుసు. నిజానికి నిన్ను పలుక రించే పని నాకులేదు. కాని పరోపకారం పరమ ధర్మంకదా! అందులోను నీవు పరదేశివి. నాకతిధివి కూడాను. నిన్నాదరించి నీవు వచ్చిన పని నెరవేర్చి పంపడం నా విధి కనుక నిన్ను పరామర్శించుచున్నాను.

ఇంకొక విషయంకూడా వుంది. నీవు వచ్చింది స్వార్థానికి కాదు. కొంత స్వార్థమున్నా యితరుల కెగ్గులేదు. విశేషించి లోకోపకార మనక తప్పదు. మంచి పని మీద వచ్చిన వారిని మన్నించడం మాకు ధర్మం. కనుక నీకు రజిత నగరం వెళ్ళే దారి చెప్తాను, రేపటి యుదయం నీవక్కడకు ప్రయాణం చేయ వచ్చును. నీవీ రాత్రి యెటువంటి యిబ్బందులు లేకుంత నేను మర్యాదలు మా యింట చేయిస్తాను. నావెంట రమ్ము.

సుధాకరునికి ఆనందము ఆశ్చర్యములు రెండూ కలిగినై. మనిషి మొరటుగా నున్న మనసు మెత్తకవలె యున్నది. నేను వచ్చిన పనియు చెప్పు చున్నాడు. మునీంద్రులకు యోగదృష్టి యుంటుందని పెద్దలంటారు. ఈయనగారా కోవకు చెందిన జ్ఞానియై యుంటాడు. ఆకార మెటులున్న నేమి ఆత్మ మనకు కావలయును. వీని మాటలునమ్మి వెంటబోయిన నాకెటువంటి యపకారము జరుగ దని నిశ్చయించుకొన్న తరువాత భేతాళుని సమీపించి మహానుభావా! తమవంటి వారికి మేము చెప్పవలయునా! మీరనినట్లే కానిండు, అని నమస్కరించాడు.

భేతాళుడు రాజకుమారుని వెంటబెట్టుకొని సమీపమునందున్న తన పర్ణశాలకు తీసుకొనిపోయి శిష్యులను పిలిచి మీరీ యతిధిని తగిన మర్యాదలతో గౌరవించండి. స్నానం చేయించి భోజనం పెట్టించి హాయిగా పండుకొని వసతులు కల్పించండి. ఉదయం మరలా వీరికి కావలసిన సదుపాయంబు లొనరించిన తరు వాత నన్ను కలియగలరని యాజ్ఞాపించాడు.

రాజకుమారున కే లోపమూ రాకుండా తెలవారింది.

తెలవారుజాముననే మేల్కాంచి కాలకృత్యములు తీర్చుకొనిన సుధాకరుడు భేతాళుని సమీపించి చేతులు జోడించుకొని నిలుచున్నాడు. భేతాళుడు వానిని చేరబిలచి "రాజకుమారా! నీవు నా యీ వికారాకారం చూచి యింకా సందేహించుచునే యున్నావు. నేను సాధారణ మానవుడనే కాని భూతాన్ని కాను. ప్రేతాన్ని



భేతాళముని సుధాకరునకు రహస్యము చెప్పుట

కాను. రాక్షసుడ నంతకంటెను కాను. ఇతరులను మోసగించు తలంపునను వేషము వేయలేదు. నా యాశ్రమమున హింస మొదలైన భయంకర కృత్యములను జరుగుటకు అవకాశము లేదు. ఇక్కడకు వచ్చిన వారికి న్యాయము జరిగి తీరవలయును.

నేను నిజరూపమున నున్నప్పుడు ప్రతి దినమును నాయొద్దకు వచ్చి

పోయెడివారి సంఖ్య పెరిగింది. ఆశ్రయించి వచ్చినవారి సందర్శన పరామర్శించి పంపడములతో నా తపశ్చర్యలకు భంగం కూడా కలుగుతూ వచ్చింది. అంతవర కయినా కొంత మంచిదే, ప్రస్తుతం దేశంమీద నాస్తికులు, వితండవాదులు పెరిగి యున్నారు. వారిలో కొంతమందికి యేమీ తెలియకపోయినా అంతా తెలిసినట్లు గర్వించే మూర్ఖులున్నారు. అలాంటి వారంతా పండితవాదం చేస్తమంటూ వచ్చి నానారభస చేస్తుంటారు. నిజానికి వారంతా పండితులైతే గదా వారితో పండిత వాదం చేయడానికి? అటువంటి పనికిరాని పరమ దౌర్భాగ్యులతో పవిత్రమైనకాల మంతా పాడైపోతూంది.

అందుకని నేనీ భేతాళరూపం దాల్చి కూర్చుంటాను. ఇప్పుడు నన్ను చూచినవారు దగ్గరకు రాకుండ దూరదూరాన తొలగిపోతున్నారు. నాకు కావల సింది కూడ అదేను. ఇక నీ మాదిరిగా ప్రపంచంమీద జరిగే దుర్మార్గాలను యెదుర్కొనే సాహసం గలవారు తక్కువమంది. అటువంటివారు వచ్చినప్పుడు సహనంతో సమయంకోసం వేచియుంటారు...చక్కగా మాటాడుతారు. నిన్ను చూచినపుడే నీవు కాంశ్యనగరం నుండి వచ్చినావని...వృద్ధమంత్రి చెప్పి పంపి నాడని నా యోగదృష్టి వలన తెలిసికొన్నాను. నీ ప్రవర్తనయు నాకు నచ్చింది కనుక నీకీ యవకాశము కలిగించాను.

రాజకుమారా! నీవిపుడు రజితనగరం చేయవలయును గదా!

రజితనగరం పోయిన వారెవరూ యింతవరకు తిరిగిరాలేదు. చాల ప్రమాదములతో గూడినది. మార్గము కూడా మంచిదికాదు. కొండగుహ నుండి ప్రయాణము చేయాలి. కన్ను పొడిచుకొన్నను కానరాని చీకటి. పాములు తేళ్ళు పారాడుతుంటే చేతితో తాకిచూచుకుంటూ మెల్లమెల్లగా అడుగులు వైచుకుంటూ యెంత దూరం నడవాలో తెలియదు. అడుగడుగునా ప్రాణగండములు కలుగ వచ్చును. ఇదిగో నేనిచ్చుచున్న ఈ పచ్చాకు గుళికను సేవింపుము. ఆరునెలల వరకును నీ కాకలి నిద్రల బాధలుండవు. గొడ్డళ్ళతో కొట్టినా నీ శరీరము కాసం తయు కందదు-మరణ మసలే యుండదు. అంటూ వానికొక మాత్ర యిచ్చాడు.

సుధాకరుడు భేతాళు డిచ్చిన గుళికను భక్తిశ్రద్ధలతోనందికొనిసూర్యుని

కెదురుగా నిలబడి నేదో సంకల్పించుకొని తిన్న తరువాత మరల వాని వంక చూచాడు. భేతాళుడు "రాజకుమారా! మా శిష్యుడు నీవెంట వచ్చి రజత నగరం వెళ్ళే బిలద్వారం చూపుతాడు. ఈ కొండ కొన్ని యోజనాల పైశాల్యముంది. లెక్కలేనన్ని లోయలు-చూడలేనన్ని బిలాలు యిక్కడున్నవి. రజిత నగరం చేరే బిలమార్గాన ధైర్య సాహసాలతో ప్రాణాలకు తెగించి ముందుకు సాగిపోవాలి. చాలదూరం పోయినాక ఒక విశాల ప్రదేశం వస్తుంది. అక్కడ నీకు కావలసినంత గాలి వెలుగులు లభింపగలవు.

అక్కడొక పెద్ద సరస్సు వుంటుంది. దానినిండా తామరలు వికసించి యుంటై. రాజహంసలు యీదులాడుతుంటై. అందలి నీరు కొబ్బరికాయ పాలకంటె తియ్యగా వుంటుంది. సుధాకర్! నీకు కావలసినది సరోవర సౌందర్యం కాదు... సరోవరం ప్రక్కన పెద్ద గణపతి విగ్రహముంది. ఆయననే కామసిద్ధి గణపతి అంటారు. సరోవరంలో స్నానంచేసి, యిరువది యొక్క రకాల చెట్లపత్రితో గణపతిని పూజించి బయలుదేరిన వారికి యెటువంటి సాధ్యంకాని పనులైనా గణపతిస్వామి దయతో నెరవేరి తీరగలవు. ఆ తరువాత కార్యభారమంతా నేనా గణపతిమీద వేయగగిన వాడనేగాని విషయము నేను చెప్పరాదు. నీవు ధైర్యం విడనాడక పోయిరా! విజయం పొందగల"వని దీవించి పంపించాడు.

## రజితనగర ప్రయాణం

సుధాకర్ భేతాళుని చెంతనుండి బయలుదేరిపోయి వాని శిష్యుడుచూపిన బిలంలో ప్రవేశించాడు. బిలం చీకటిమయం. ఒక్కొక్కచోటున చాల యిరుకు దారి ప్రక్కలందున్న కోసురాళ్ళు తగిలి శరీరంనుండి రక్తం వస్తూంది. కొంత దూరం పోయిన తరువాత ప్రశాంత వాతావరణం గల ప్రదేశానికి చేరగలమనే భేతాళుడు చెప్పిన మాటమీద నమ్మకందప్ప ముందు దారి బొత్తిగా కనపడడం లేదు. ఎక్కడికి పోతున్నది- ఎంతదూరం పోవలసింది అనే ప్రశ్నలకు సమాధానంలేదు. చాలాసేపటికి తాననుకున్న మనోహర ప్రదేశం చేరుకున్నాడు.

ఆ దృశ్యం చూచిన సుధాకరుని మన సానందంతో నిండిపోయింది. అచట వాతావరణంలోనే జీవితమంతా గడపడం బాగుంటుందని అనుకున్నాడు.

కాని-యింతలో నా కొఱకు కాకపోయినా గుప్తయోగి ప్రశ్నలకు సమాధానాలు తీసుకుని వస్తానని నా రాకకై వేయి కన్నులతో యెదురుచూచుచున్న చింతామణి కోసమైనా మరుద్వతీ నగరం వెళ్ళితీరాలి-ఒక్కగానొక్క కుమార్తె చిక్కబడిన విషవలయం నుంచి కాపాడి తన విచారం మాన్పగలనని కొండంత భ్రాంతి పెట్టుకున్న ధీమంత మహారాజా వారికోసమైనా తిరిగి స్వదేశం చేరాలి- తనకుమారుని కోల్పోయి యిపుడు తననే తనుగన్న ముద్దులకొడుకుగా నెన్నుకొన్న సూర్యవర్మ మహారాజాగారి కొరకయినా యుజ్జయినీనగరం పోవాలి-ఇక కన్న తల్లిదండ్రులు కొడుకే ప్రాణము, కొడుకే జీవితము సర్వస్వమని తపించుచున్న చంద్రవర్మ మహారాజావారి తృప్తికొరకైనా వజ్రపురం పోక తప్పదుగదా అని అనుకున్నాడు.

చుట్టూ కొండలు, కొండలమీద దట్టంగా పెరిగిన చెట్లు. మధ్య విశాల మైదానం. చిన్న చిన్న మెరుపురాళ్ళతో నిండిన నేల. అందమైన సరోవరం. సరోవరం నిండా తామరలు కళకళలాడుతున్నయ్. రాజహంసలు ఈదులాడుతున్నాయ్ దాని కన్నివైపులా నీటిలో దిగేటందుకు బారులుదీరినమెట్లున్నవి. ప్రక్కప్రక్కల పూలచెట్లు పోయినవారిని పలుకరించుచున్నట్లున్నవి. కామసిద్ధి గణపతిస్వామియు దర్శనమిచ్చాడు. సుధాకరుడు భక్తిశ్రద్ధలతో గణపతి నారాధించి రాత్రి,కక్కడనే శయనించాడు.

మరునాడు తెలవారింది. బారెడు ప్రొద్దెక్కింది. బాటసారిని లేపినవారు గాని-పలుకరించిన వారు గాని యెవరూలేరు. మేతలకై వచ్చిన కుందేలు పిల్లలు వానిమీది కెక్కుతూ గెంతుతూ దూకుతూ ఆటలాడడంతో వానికి మెలకువ వచ్చింది. లేచి కూర్చున్న రాజకుమారునికి కొంత సేపు కుందేలు పిల్లలతో వినోద కాలక్షేపం జరిగింది. ఆ తరువాత తను ప్రయాణం చేయాలనుకున్నాడు. ఎటు బోవడాని కెక్కడా దారి కనపడడంలేదు. ఏమడగడానికి యెవరూ కనపడిందిలేదు.

ఉన్నట్లుండి ఆయన మనసు కొక యాలోచన వచ్చింది. ఇక్కడకి కుందేళ్ళు వచ్చినవంటె యిందెందయినా యొక మార్గముండి తీరాలి అని నిశ్చయించుకున్నాడు. ప్రయత్నించితే నొక దారి కనపడకపోదనుకొని లేచి చుట్టు ప్రక్కల పొదలచాటున చూడగ నొకచోట బాహాటమైన సొరంగం కనిపించింది.

కొంత ఉత్సాహంతో తిరిగివచ్చి గణపతికి నమస్కరించుకొని సొరంగ మార్గాన ముందుకు ప్రయాణం సాగించాడు.

ఈ సొరంగంలో చీకటిగాకుండా కొంత వెలుగు కనబడుతుంది. ఆ వెలుగు యెక్కడ నుండి వస్తుంది? ఎలాగ వస్తుందనే ప్రశ్న వాని మనసుకు రాలేదు. ఒక్కొక్కచోట దారి చాల లోతుకుపోయి మళ్ళీ పైకి యెక్కుతూ



రాజకుమారుడు సొరంగ మార్గం గుండా ప్రయాణం చేయడం

యెగుడు దిగురులుగా వున్నది. మెట్లులేవు-గట్లులేవు. అంగుళం మొదలు మూడంగుళాల పై శాల్యంకలిగిన పలచని చదరపురాళ్ళతో నిండియుంది-ఆరాళ్ళు రెండుమూడు రంగులలో నునుపుదీరి యున్నందున లోయలోనికి దిగేటప్పుడు కాలునిలువక కొన్ని గజాలదాకా ప్రయాణికుడు జారిజారి యెక్కడికో పోతుంటాడు. అలాగే యెక్కేటప్పుడు కూడా కాలిక్రింద పట్టుదొరకక క్రిందికి జారి

పోతుంటాడు. రాజకుమారుడీ అవాంతరాల నన్నింటిని భరించుకొని పట్టుదలతో పయనించుచునే వున్నాడు. పడుతూ లేస్తూ చాలదూరమలాగే ముందుకుపోయాడు ఒకచోటున వానికి కాలు పట్టుతప్పింది. జారగిల బడినవాడు పడినట్లె లేచి నిలబడే యవకాశం లేకుండా నునుపురాళ్ళ వేగానికి పోయి యింకొక ప్రక్క సొరంగం ద్వారా చాల లోతుననున్న అగాధంలోపడిపోయాడు. అక్కడాయనకు నీటితడి తగిలి లేచి చూచాడు. ఆ కొండ సొరంగంలో అంతలోతున నీటికాలువ పారడం చూచి ఆశ్చర్యపడ్డాడు. రమారమి రెండు గజాల వైశాల్యంలో పారుతున్న కాలవలో కనపడే చిన్నరాళ్ళ వలన లోతేమియు లేదని తెలిసికొన్నాడు. కొంత ధైర్యాన్ని కూడా పుంజుకొని నీరిక్కడ పారుతూన్నదంటే యిచటినుండి వెలుపలికి దారి యున్నదని గట్టిపరచుకున్నాడు. కాని, నీరెంత సన్నని జాలు ననుసరించియైనా ప్రవహింపగలదు గాని మనిషి ప్రయాణం చేయలేడు గదా! ఒకవేళ ముందు మార్గమంత జొరరానిదై యున్న యెడల మరల వెనుకకుతిరిగి కాలువ గట్టుగనే యిక్కడకు రాగలను గదా యని నిశ్చయించుకొని నీటిజాలున నడవసాగాడు.

ఎంతసేపు నడిచాడో వానికి తెలియదు. చాల దూరం పోయిన తరువాత జనం మాటలచప్పుడు వినబడింది. వెలుతురు గూడ కొంచెం కొంచెం పెరిగింది. అనుకొనినట్లె కొండ లోయలో నుండి బయటపడ్డాడు. ఇక్కడ నీటికాలువ మరింత వైశాల్యం పెరిగి లోతుగా నున్నది. జాలరులు చేపలు పట్టుకుంటున్నారు వారేవో మాటాడుకుంటున్నారు. కాని వారి భాష తెలియక రాజకుమారుని కొక మాటగూడా బోధపడలేదు. సుధాకరుడు జాలరులను చూచి "యిది యేవూరు రజితపురం పోయే బాటయేది?" అని యడిగాడు. ఆయనడిగే దేమిటో వారికి తెలియలేదు— వారేం చెపుతున్నారో ఆయన కంతకన్నా తెలియడంలేదు. ఆ జాలరులలో ఒక ముసలాయన దూరంగా స్నానం చేస్తూన్న మునిని చూపి "అక్కడకుపోయి యడుగు"మని సైగచేసి చూపాడు.

సుధాకరుడు చకచకా నడిచిపోయి మునికి నమస్కరించాడు. ఆ ముని స్నానం చేయడం ముగిసినందున యొడ్డుకువచ్చి "నీ వెవరవో నాకు క్రొత్త

వాడవు- నాకేకాదు యీ ప్రదేశానికే క్రొత్తవాడవనితెలుస్తూంది. మా యాశ్రమానికి వచ్చి నీవు వచ్చిన పనియేమిటో చెప్పిన తరువాత నాకు చేతనైన సాయం నీకు తప్పకుండా చేస్తా" నంటూ రాజకుమారుని తనవెంటబెట్టుకొని ఆశ్రమానికి తీసుకొని పోయి కావలసిన యుపచర్యలు చేయించాడు. తరువాత పరదేశి తన కధనంతా వివరించి చెప్పి తనకిప్పుడు రజితనగరం పోయే యుపాయం చెప్పుమని వేడుకున్నాడు.


మునీంద్రుడా రాజకుమారునితో "అబ్బాయీ! నీవిపుడు రజిత నగరానికి సమీపము నందున్నావు. ఒక్కరోజు ప్రయాణముగూడ యుండదు. అయినా మార్గం మంచిదికాదు. బందిపోటు దొంగలు బాటను కాచియుంటారు. నిన్ను నీ వస్త్రములు చూచినచో మహారాజుల బిడ్డవేనని తలంచి నిన్ను దోచుకొంటానికి వస్తారు. అందువలన నీపని కాటంకాలు రాగలవు. అసలే దూరదేశపు బాటసారివి ఒంటరివి, చాలా శ్రమలుబడి స్రొక్కియున్నావు. ఇంకను నీవు సాధింపవలసిన ఘనకార్యమెంతయినా ముందున్నది. కొన్నికొన్ని సమయాలలో యుక్తినను సరించడం మంచిది. నీవీ రాజదుస్తుల నిక్కడవిడిచి చిన్న మూటగట్టుకొని నేనిచ్చిన కాషాయ బట్టలు గట్టుకొని బయలుదేరుము. నీవొక సన్యాసివని తలంచి దొంగలు నీజోలికిరారు. నీవు సుఖంగా రాజనగరం చేరగల"వని చెప్పాడు.

ఆ మాటలు రాజకుమారునికి నచ్చినయ్.

మునీంద్రుడిచ్చిన కాషాయబట్టలు ధరించాడు సుధాకరుడు. తను కట్టి విడిచిన దుస్తుల నన్నింటిని మూటగట్టి చంకకు దగిలించుకొని సరాసరి రజిత నగరం చేరుకున్నాడు. పూటకూటి యింటికి పోవాలని విచారించాడు. ఆనగరంలో పేదరాశి పెద్దమ్మ ఇల్లేలేదని తెలిసింది. ఎవరింటనైనా నివసించే వసతి లభించునేమోనని యాలోచించాడు. ఎవరి నడిగినా పరదేశి వనినంతనే "మాఇంట్లో వీలు పడదు. వెళ్ళు"మని బయటకు పంపి తలుపులు బిగించుకుంటున్నారు, ఒకరిద్దరు కాదు. ఏ యింట చూచినా యిదే మర్యాదయైనందున సుధాకరుడు తిరిగివచ్చి ఒక రచ్చబండిమీద కూర్చున్నాడు.

## ప్రాణగండం తప్పిన పరదేశి

సుధాకరుడా రచ్చబండ మీద కూర్చుండి యెంత సేపో కాలేదు. తిరి తిరిగి వచ్చిన అలసటయైనా తీరలేదు. పదిమంది రాజభటులు వచ్చి మాటా మన్న నలులేకుండగనే బంధించారు. రాజకుమారుడు "మీరెవరు? నన్ను బంధించుచున్నా రెందుకు? నేను చేసిన నేరమేమి!" యని అడుగుచున్న వారు వినిపించుకో



సుధాకర్‌ను ఉరికంబం ఎక్కించుట

కుండా బలవంతంగా నడిపించుకొని పోసాగారు. వీరు తనను రాజసన్నిధికి తీసి కొని పోవుచుండిరేమో అనిఅనుకున్నాడు సుధాకర్. పురవీధులలో అతనిని చూ ఎవరూ జాలిపడడంలేదు, కనీసమొకరైనా "ఈయనెవరు? ఎందుకిలా బంధించార ఎక్కడకు తీసికొని పోవుచున్నా"రని ప్రశ్నించిన వారుకూడా లేరు. ఎదురై వారంతా అతనినిచూచి పగవారి మాదిరిగ మొగంత్రిప్పుకొని తొలగిపోతున్నార

సుధాకరుని మనసు పరిపరి విధాల పరుగెత్తింది. నేను రాజకుమారుడను. ఒక రాజ్యానికి యువరాజును. మాయదారి యోగీంద్రుని విషవలయంలో పడువారిని కాపాడడానికి కంకణం గట్టుకొని — ఊరనక పల్లెనకా - రాయనక రప్పనకా - రేయనక పగలనకా - కష్టమనక సుఖమనకా - తిండనక తిప్పలనకా త్యాగం చేసి నేనీనాటికి వీరిరాజ్యంలో నేరస్థుడనయ్యానా! ఎంత శోచనీయం! ఇంతకును నేను చేసిన అపరాధమేమిటి యనే దానికి సమాధానం లేదా యని తనలో తాననుకుంటూ వారి వెంట నడక తప్పలేదు.

చివరకా రాజభటులాయనను శిక్షణాలయానికి తీసికొనిపోయి దగ్గర నున్న గుడ్డమూటను దూరంగా బెట్టి బలవంతంగా యురికంబం మీది కెక్కించారు. సుధాకరుడు తన కంతటితో జీవితం సమాప్తం కాబోవుచున్నదేమోనని [illegible] చెందాడు. కింకరులు పరదేశి మెడకు ఉరివేయబోతూ "ఓయీ! నీకు చావు సమీపించింది. నీవు దుర్మార్గుడవైనా-సన్మార్గుడవైనా మిత్రుడవైనా-శత్రువైనా మా రాజ్యాంగ ధర్మం ననుసరించి చావబోవువానికి తుది కాలంలో కలిగే కోర్కె దీర్చటం మా బాధ్యత. కావున నీవే మడుగుతావో అడుగు నీ కోరిక చెల్లించిన తరువాతనే యురి తీస్తా"మన్నారు.

"నిజంగా నే నడిగింది మీ రిస్తారా?"

"తప్పకుండా యిస్తాం."

"ఐతే ఒకసారి మీ రాజావారి దర్శనం యిప్పించండి!"

"ఎందుకు?"

"అది తరువాత మాట! నేను మరణకాలంలో కోరిన దానిని మీరు నెరవేరుస్తామన్నారు. నాకు కావలసింది నే నడిగాను. మీరు నిజంగా నీతి, నిజాయితీలు కలవారైతే మాట తప్పకుండా రాజావారి దర్శనం నాకిప్పించండి. ఒకటి చెప్పి యింకొకటి చేయువారైతే మీ పని మీరు పూర్తిచేసుకొనండి" అని ధీమాగానే సమాధానమిచ్చాడు రాజకుమారుడు.

రాజసేవకులలో యొకనికి యోచన కలిగింది. "ఒరేయ్! ఇదేదో యాలోచింపదగిన కథగానే యున్నదిరా! వీదెవరో నేరస్తుడైతే రాజదర్శనం కోరడు. ఐనా తప్పేముంది? నేను పోయి మన హరిచందన మహారాజా వారితో

చెప్పివస్తానన్నాడు. మిగిలినవారంతా "నీ వన్నది గూడా బాగున్నది. ఒకవేళ మనం రాజావారికి చెప్పకుండా యితనిని యురితీసిన యెడల తరువాత హరిచందన ప్రభువులు విచారించి "ఉరి దీయబడెడివాడు నా దర్శనము కావలయునని యడిగి నపుడు మీరు నాకెందుకు చెప్పలే"దని మనలను దండింపవచ్చును. కనుక చెప్పి రావడమే మంచిది. నీవు తిరిగివచ్చే వరకు షేమితనిని తప్పించుకొని పోకుండ కనిబెట్టి యుంటామని సమ్మతించి పంపారు.

ముందు మాట్లాడిన సేవకుడు సరాసరి తిరిగిపోయి సభ దీరియున్న హరిచందన మహారాజుతో "ప్రభూ! ఏలినవారి యాజ్ఞ ప్రకారముగా మే మొక సన్యాసిని పట్టుకొనిపోయి యురికంబ మెక్కించి నీ మరణకాలవాంఛ యేమిటని యడుగగా వాడు "నాకు మీ రాజావారి దర్శన మొకసారి చేయించండి. చాలు" నన్నాడు. ఏమి చేయుటకు పాలుపోక నేను మీ దర్శనానికి వచ్చాను. తరువాత యేలినవారు చేయమనినట్లు చేస్తామని మోకరిల్లాడు.

రాజుగారికాలోచన కలిగింది. అతనెవరో మోసగాడై యుంటే యింత నిర్భయంగా నా దర్శనం కోరడు. విషయం తెలియకుండా వానికి మరణదండన విధించడము కూడ న్యాయంకాదు. పోయి విచారించడం అన్నివిధాలా మంచిదను కొనినంతనె వారి గుఱ్ఱంనెక్కి సరాసరి వధ్యాలయం దగ్గరకు వచ్చారు. సేవకులు వెంటనే ప్రభువులు కూర్చుండటానికి ఆసనం యేర్పరిచారు. హరిచందన మహా రాజు యురికంబము మీదనున్న వానినిచూచి "ఎవరవు నీవు?" అని ప్రశ్నించాడు.

సుధాకర్ వానిని చూచి "నీవేనా యీ రాజ్యానికి రాజువు" అని యడిగాడు.

"ఔను నేనే"నన్నాడు హరిచందనుడు.

"వీధిలో కనబడిన వారిని యురి వేయించే అధికారం గూడా నీవే యిచ్చావా?"

హరిచందనుడు మాటాడలేదు. అక్కడున్న వారందరకూ కోపం ముంచుకొచ్చింది. "ఓయీ, పొగరుబోతూ! మహారాజా వారి దర్శనం కాగానే నీవు నమస్కారం చేయలేదు సరికదా! ప్రభువుల కీయదగిన మర్యాదగా "మీరు-తమరు" అని యనక "నీవు-నీవేనా!" అని యంటున్నావు. సన్నురిదీయడంకాదు-

ముక్కలు ముక్కలుగా నరికి యుప్పుపాతర వేయాలిరా!" అని హూంకరించారు.
"మిమ్ము నేనొక మాటడుగుతున్నాను, దానికి సమాధానం చెప్పండి అనిన సుధాకర్ యింతకు నేనెవరో చెప్పగలరా" అని సూటిగా యడిగాడు.

అక్కడున్న వారంతా "తెలియ"దన్నారు.

"పోనీ నేను చేసిన నేరమేమిటో అపయినా తెలియునా?" అన్నాడు సుధాకర్.

అదీ తెలయదన్నారు.

"మీకుగాని — మీ రాజుగారికిగాని నేనెవరో తెలియదు. నేను చేసిన నేరమేదియో గూడ తెలియనపుడు మీరు నన్నెందుకు యురిదీయుచున్నారని నేనడుగుచున్నా"నని ప్రశ్నించిన పరదేశిని సమాధానం చెప్పలేక హరిచందన మహారాజు క్రిందమీదులయ్యాడు. కొంతసేపటికెలాగునో సర్దుకొని ఒక మాయదారి సన్యాసి వచ్చి మమ్మందరినీ నమ్మించి క్షమింపరాని ద్రోహం చేసి పోయాడు. అంతటితో మాకు బైరాగి యనువాని మీద కక్ష పెరిగింది. సన్యాసి రూపంలో కనబడినవాని నెవనినైనా పట్టుకొనిపోయి నా యజ్ఞ లేకుండనే యురి దీయండి. సన్యాసులకు మన రాజ్యంలో విచారణ లేదని నేనింతకుముందు శాసించాను. ఇక చెప్పదలచిన దేదియొ చెప్పు. నీవు నేరస్తుడవు కావని ఋజువు చేసుకొంటే నీకీ యురి తప్పించడమే గాక-నీకు బహుమానమిచ్చి సత్కరిస్తా" నన్నాడు.

సుధాకరుడంతట కొంత గౌరవిస్తూ "మహారాజా! నేను మీ యెడల తొందరపడినందుకు మన్నించండి. ఇదిగో యిది నా మూట. ఇందేమిగలవో విప్పి చూడండి" యన్నాడు. రాజభటులలో కొందరా మూటను విప్పి చూడగ రాజదుస్తులు బయటపడినై. వానిని చూచి విస్తుబోయిన హరిచందనుడు—"ఈ రాజదుస్తులు నీవేనని తెలియుచున్నది. నీ విట్లు బైరాగి వేషము ధరించిన కారణమేమి"టని యడిగాడు. సుధాకరుడుడంతట "మహారాజా! నేను మణిద్వీపము నందున్న వజ్రపురాధీశ్వర చంద్రవర్మ మహారాజ కుమారుడను. నా పేరు సుధాకరుడు. నేనొక కార్యార్థమింతదూరము మిమ్ము కలియుటకే వచ్చాను. దారిలో దొంగలభయ మధికముగా నున్నందున నేనొక రాజకుమారునిగా వారికి కనపడ

కుండుటకీ బట్టల కట్టితి"నని చెప్పగ వినినవారి మొగంబులన్ని వెలవెలబోయినై.

హరిచందనుడు యురికంబము మీద నున్న సుధాకరు నాలింగనము చేసికొని "వజ్రపుర యువరాజా! జరిగిన ప్రమాదమునకు నన్నన్యథా భావింపక నా యాతిథ్యాదులు స్వీకరింప మా గృహంబునకు దయచేయండి" అన్నాడు రాజకుమారుడు "మీరంత మాటనకండి, నాకు మీ రాత్మీయులు కావలసిన వార" నగ పరమానందం చెందిన రంజిత పురాధీశ్వరులు బంధుమర్యాదలతో సుధాకరుని వెంటబెట్టుకొని అంతఃపురానికి పోయాడు.

## హరిచందన – సుధాకరుల సాంగత్యము

మరునాటి యుదయాన హరిచందనుడు సుధాకరుని పిలిచి దగ్గరగా కూర్చుండబెట్టుకొని "రాజకుమారా! మా తాత ముత్తాతల నాటి నుండి మేమీ రజితపుర పాలకులమై యున్నాం. మా వంశము వారంఏరూ మొదటి నుండి దానధర్మములు చేయువారు-పుణ్యకార్యములం దాసక్తి కలవారు పరులకు సాయం సేయువారేకాని మంచి మర్యాదలు తెలియనివారు కారు. నాకును వారి బుద్ధులే పట్టుబడినై మా వంశమువారి మంచితనం నాకుగా నేను చెప్పుకొనరానిదే కాని నీవు మాత్రం క్రొత్తవాడవైనందున విషయం వివరించి చెప్పక తప్పదంలేదు.

భగవానుని దయవలన నాకు యుత్తమురాలైన భార్య లభించింది. ఆమె పేరు వైజయంతి. మాకు రమాచందనుడు, ఉమాచందనుడుడను కుమారులిరువురి తరువాత చందనవతి యను కుమార్తె కలిగింది. వారు ముగ్వురును చక్కగ చదువుకొని విద్యావంతులయ్యారు. రాజ్యాంగ ధర్మాలలోను ఆరితేరారు. వారికి పెండ్లీడు వచ్చింది. హేమనగరాధీశ్వరుడు యశోవర్ధన మహారాజు మా బావగారు. వారికి రాజవర్ధనుడను కుమారు డొకరున్నాడు. రాజవర్ధనుడు మంచి రూపవంతుడు, విద్యావంతుడు, బుద్ధిమంతుడు నైనందున యెందరెందరో రాజులు హేమపురాధీశ్వరుల వారితో వియ్య మందుకోవాలని తిరిగారు. కాని మా బావగారు మా మీదగల ప్రేమాభిమానాలకొలది వారందరితోనూ మాకు మా బావమరిది యొద్ద కన్యయున్నది, చిన్నప్పటి నుంచి అనుకుంటున్న సంబంధం, ఒకనాటి ప్రకారం మేమీ పాత చుట్టరికాన్నే చేసుకుంటాం కనుక వేరే సంబంధాలు

చూచే పనియుండదని చెప్పుతూ వచ్చారు.

తరువాత మా బాగారు స్వయంగా వచ్చి లగ్నాలు పెట్టించారు, నిర్ణీత కాలంలో మహావైభవంగా వివాహం జరిగింది. ఉభయులం గొప్పగా చేసిన మా పెండ్లికి యెక్కడెక్కడి దూరపు బంధువులు కూడా వచ్చారు. అప్పుడు మా రజిత నగరం పెండ్లి వేడుకలతో కోలాహలంగా వుంది. నూతన వధూవరుల నాశీర్వదించడానికి కొందరు ఋషులు కూడా వచ్చారు. వివాహానంతరం నూతన వధూవరుల నాశీర్వదించడానికి కొందరు ఋషులు కూడా వచ్చారు. వివాహానంతరం నూతన వధూవరులు హేమనగరం వెళ్ళి అక్కడ మూడు రాత్రుళ్ళుండి వ్రతం చేసుకొని తిరిగి వచ్చారు ఇచ్చట పదహారురోజుల పండుగ కార్యక్రమాలన్నీ విధివిధానముగా నెరవేరిపోయినై. తరువాత తగిన మర్యాదలతో సారె చీరెలిచ్చి అమ్మాయిని అత్తవారింటి కంపకాలు చేయించాను. వచ్చినవారంతా యెటు వారటు వెళ్ళిపోయాక గూడా ఒక మునిమాత్రం తిరిగి పోకుండా పెండ్లి సమయంలో వానికిచ్చిన వసతి యింటిలో తిష్టవేశాడు. నా కుమారులు కాదనలేక వేళ ప్రకారం వానికి కావలసిన యుపచర్యలు చేయించుచునే యున్నారు.

ఆ ముని యెప్పటికి వదిలిపోతాడో తెలియలేదు.

ఈ విషయం నాదాకా వచ్చింది.

నేనపుడు స్వయంగా ముని దగ్గరకు పోయి "స్వామీ! తమరు మా యింటిలో జరిగిన శుభకార్యానికి వచ్చి చిరంజీవుల నాశీర్వదించారు. ఆనందం గలిగింది. వచ్చిన వారందరి మాదిరిగా మీరును తిరిగి పోయారనుకున్నాను. మీరిక్కడనే యున్నట్లు తెలియనందుననే యింతవరకు మీ దర్శనానికి రాలేదు. తమ వివరాలు మాకు తెలియనందుననే యడుగుచున్నాను. ఇంతకూ మీ పేరేమి? ఊరేది? మీ రిచటనే యున్న కారణమేమిటో సెలవీయండి" అని యడిగాను.

అందులకా ముని శాపీగా నావైపు చూచి "రాజా! నేను హిమాలయ ప్రాంతాన తపస్సు చేసికొనుచున్న యోగానంద మహర్షిని. నా తపస్సు కానందించి శంకరుడు ప్రత్యక్షమై "యోగానందా! నీకే వరం కావలెనో కోరుకో ఇస్తా" నన్నాడు. నేను చేతులు ముకుళించి "శంకరా! భక్తశంకరా! నాకు ప్రపంచం మీద బ్రతికి సుఖాలననుభవించాలన్న భ్రాంతి లేదు. నాకు ధనధాన్యాలుగాని,వస్తు

వాహనాలు గాని—భార్యాబిడ్డలుగాని—సిరిసంపదలు మొదలైన వేమియు అక్కర లేదు. నేను మోక్షంచెంది మీ పాదపద్మముల సన్నిధిలో నుండే అవకాశాన్ని ప్రసాదించండి." అని ప్రార్థించాను.

పరమేశ్వరు డంతట సంతసించి "యోగానందా! కేవలం ముక్తినే కోరిన నీకోరిక మన్నింప దగినది. నీవు నా యాజ్ఞ ప్రకారం కొంతకాలం భూలోకంలో నున్న తరువాతనే కైలాసం రావలసియుంటుంది. నేను రజిత నగరంబున నటరాజరూపాన నవతరించ దలచియున్నాను. ఆ రాజ్యము నేలు యశోవర్ధనుడు



పరమేశ్వరుడు యోగికి కలలో కనిపించాడని చెప్పుట

పరమధార్మికుడు. ప్రపంచమున ధర్మమున్న చోటునందే దైవముండుననినీకును తెలియునుగదా! నీ వచటకు వచ్చి రాజాదరణతో నీవు దేవాలయాదులను నిర్మించి నా సేవలు సేయుచుండుము, అనంతరమున నీకు బొందితో కైలాసమును పొందునట్లు నేను చేయుదు"నని యదృశ్యమయ్యాడు.

నేనా పరమేశ్వరుని సంకల్పం ననుసరించి మంచి దినంబున బయలు దేరి మార్గమధ్య మున్న క్షేత్రములను దర్శించి చూచుచు, తీర్థములలో స్నానాలు సేయుచు మహాఋషులను గలియుచు మీ నగరం చేరుకున్నాను. నేను వచ్చుసరికి మీ కుమార్తె వివాహం జరుగుచున్నది. నేనును సమయమునకే వచ్చితిని గదా యని సంతసించి మీ మర్యాదలు, ఉపచారములను పొందాను. నీవింకను పెండ్లి సందడియందే యున్నవనియు—నీతో మాటాడుటకు సమయం కావలయుననియు దలంచి యింతకాల మిక్కడనే వేచియున్నాను. ఇప్పుడు నీవే వచ్చి యడిగినందున నీతో జరిగినది చెప్పడానికవకాశ మేర్పడిం"దని యెంతో నమ్మకం కలిగేలాగా కథసల్లుకొని మాటాడాడు.

నేనపు డాలోచనలో పడిపోవలసి వచ్చింది.

అంత గొప్ప యతీంద్రులబద్ధమాడరని నా నమ్మకం.

నేనేకాదు-ఆ సమయంలో వాని నోటినుండి వెలువడిన మాటలాల కించిన వారెవరూ బూటకమని త్రోసిపుచ్చలేరు. అందరిమీదా మత్తు చల్లినట్లని పించింది. నాకు గూడ మైకం క్రమ్మింది. "ఇపుడు నన్నేం చేయమంటారు?" అన్నాను అప్రయత్నంగానే.

ఆయనకు కోపం వచ్చినట్లుంది. "అది నన్నడగకపోతే నీకు తెలియదా రాజా! ఈనాటి తెల్లవారుజాముననే పరమేశ్వరుడు నాకలలో కనబడి "ఎల్లుండి పంచమీ గురువారం నాడు నేను రాజుగారి యుద్యానం ప్రక్కగ కోనేరుకు తూర్పున మూడుగజాల దూరంలో నే నవతరించబోతున్నాను. మీరందరూ వచ్చి నేను చెప్పిన గుర్తులలో మూరెడు లోతు త్రవ్వితే నా విగ్రహం కనబడుతుంది. దానికి విధివిధానముగా ప్రతిష్ఠాదులు చేయించండి" అని సెలవిచ్చి అదృశ్య మయ్యారు.

నీ నగరంలో యుద్యానంలో పరమేశ్వరుడు వెలయబోతున్నాడు. నీవు స్వతంత్రుడవు-సర్వాధికారివి. శంకరమూర్తికి దేవాలయం కట్టించగలవు. నీవేమి చేయవలయునో నీకు తెలియకపోతే యెవరినైనా అడిగి తెలుసుకో-నీకిష్టం లేక పోతే నేను చేయదలంచుకొనలేనని చెప్పు. పరమేశ్వరుడు సాక్షాత్కరించిన తరువాత నేనాస్వామి విగ్రహాన్ని కడిగి శుద్ధి చేయకుండ- ప్రతిష్ఠించకుండ-

ఆలయ నిర్మాణం జరిగించకుండ శివాజ్ఞ మీరలేను. దైవాపరాధం చేయడానికి వెనుదీయని నీ రాజ్యంలో నివసించగూడదు కనుక నేనిపుడే వెళ్ళిపోతున్నా"నని లేచి నిలబడ్డాడు.

అది చూచిన నా భార్య కుమారులు "మునీంద్రులకు కోపంవచ్చి వెళ్ళి పోతున్నారు. వారిని నిలపండి" అని నన్ను తొందర పెట్టారు. నేనాలోచించేటందుకు యెడం గూడ లేకపోయింది. వెంటనే వాని పాదాలంటి "తొందరపడకండి మహామునీ! మా యుద్యానంలో బయల్పడనున్న శివమూర్తిని దర్శించడానికి కుటుంబసమేతంగా వస్తున్నాను. మంగళవాయిద్యాలు తెప్పిస్తాను. కావలసిన పండ్లు, పూలు, పత్రి, సుగంధ ద్రవ్యములు సమర్పించుకుంటాను. తరువాత దేవాలయం నిర్మించి ప్రతిష్ఠాదులు కూడ మా పేరుతో మీరే నెరవేర్చడానికి కావలసిన ధనమెంతయినా భరిస్తాను. తమరు నిదానించండి" అని ఆయనగారిని కూర్చుండబెట్టాను. ప్రశాంత వాతావరణమేర్పడింది.

## నటరాజ దేవాలయ నాటకము

మూడవనాటి వేకువజాముననే నేను నా కుటుంబ సభ్యులమంతా నిద్రలు లేచి తలంటు స్నానములు చేసి మడిబట్టలు గట్టుకొని మేళతాళములతో వచ్చి ముందు యోగానంద మునీంద్రులకు పాదపూజచేసి కానుకలు సమర్పించిన తరువాత అందరము కలిసి యుద్యానంలోని కోనేరు దగ్గరకు పోయాం. "స్వామీ ఎక్కడ త్రవ్వమంటారు!" అని నేనడిగినమీదట యోగానందముని రెండు మూడు చోట్ల తిరిగిచూచి తరువాత "ఇదుగో యిక్కడ త్రవ్వించండి!" అన్నాడు. అర గజంలోతు త్రవ్వగానే నటరాజస్వామి విగ్రహం బయటపడింది. పాలరాతితో చేసిన ఆ మూర్తి చాలా సుందరంగా వుంది. వెంటనే కొబ్బరికాయలు గొట్టడం-కర్పూరం వెలిగించడం మొదలైన తతంగమంతా జరిగిపోయింది.

భగవంతుడు బొమ్మరూపం దాలుస్తాడా!

నా రాజ్యంలో, నానగరం, నాయుద్యానంలో వెలిసే దేవుడు నాతోనే చెప్పక యితరులకు చెప్పి నాకు చెప్పిస్తాడా? ఆ దేవునికి నాకు మధ్య యీ పెద్దమనుష్యుల రాయబారాలెందుకనే యాలోచన నాకు రాకపోయింది. మొదటి

నుంచి దేవాలయాలను కట్టించడం, ఉత్సవాలు చేయించడం మాన్యాలీయడం మొదలయిన పనులలో అలవాటుపడిన వంశంలోని వాడనై నందున "యిది నిజమా! ఒకవేళ శ్రీ బొమ్మని మునే చేయించి యెవరూ లేని సమయంలో ఇక్కడ పెట్టించి యుంటాడా! అని గూడా అనుమానించలేక పోయాను. అలా శంకించడం దైవాపరాధమగుతుందేమోనని నా కిప్పటిదాకా భయముండేది కూమను.

యోగానందులు చూపిన సూచనల ప్రకారము నటరాజ దేవాలయము నిర్మాణమయింది. అది చాల గొప్పది. ఆలయ ప్రాకారం లోపల చిన్న చిన్న గదులు, పెద్ద పెద్ద గదులు యేర్పాటైనై, వానిలోనే కొన్ని విలాస భవనాలు, రహస్యమందిరాలు గూడ ఏర్పడినై. నిత్యదీప ధూపనైవేద్య ఖర్చులకు వైభవాలకు గాను శాశ్వతంగా కొంత మాన్యం యీయబడింది. ఆలయం మీద ఆలయ చిరాస్తుల మీద సర్వాధికారి మునీంద్రులేయయ్యారు.

మా దేశంలో వెలసిన నటరాజస్వామి స్వయంభూ అనే పిచ్చినమ్మకం ప్రజలలో పాతుకొనిపోయింది. భక్తులు వేలాదిగా రాసాగారు. వారికై సత్రాలు వెలిసినై. "శ్రీ నటరాజస్వామి పామరులం కనుక మనతో మాటాడడుకాని మహానుభావుడైన యోగానంద మహామునితో ప్రతిదినం కనబడి చెబుతుంటాడు" అనే విశ్వాసం కలిగింది. ఈ యోగీంద్రులే మాకు పలికి మాటాడే దైవమయ్యాడు. ఆయనకు పాదపూజలు చేయువారు, కానుకలిచ్చేవారు విపరీతంగా పెరిగిపోతున్నారు. శిష్యజనం ఆడవారిలో, మగవారిలో కూడా ఏర్పడ్డారు.

అంతవరకు బాగానే వుంది.

క్రమక్రమంగా పద్ధతులు మారినై.

భక్తి నిలయం కేవలం రక్తి నిలయమైంది. యోగానందస్వాములవారికి యేకాంత సేవలు, పవళింపు సేవలధిక మయ్యాయి. గురువుగారికి ప్రధానసేవకు లాడవాండ్రయ్యారు. సర్వం భగవతార్పిత మంటూ గురువుగారిని భక్తురాండ్రన్ని విధాలా కైవసమయ్యారు. యోగానంద మునీంద్రస్వాములవారికి ఆంతరంగిక శిష్యులయినారు కూడా. వారికి తగిన ప్రియురాండ్రతో కేళీవిలాసాలు జరపడం మొదలు పెట్టారు. మధుపానం మాంసభక్షణలకు హద్దులు లేకపోయినై. దేవాలయ ప్రాకారంలోనే కాకుండా గర్భాలయంలోను దానికి ముందున్న మండపంలో గూడ

మాతో కలిసినందున మా బలం యినుమడించింది. శత్రువులు కుట్రలుపన్ని కొన్ని మోసాలుచేసి మొదట కొంత విజయం పొందినా మా సేనానాయకులు పిదప మెలకువతో వారిని నోడించడం జరిగింది. మాకు విజయం లభించింది.

చంద్రసేనుడు రాజీకి వచ్చాడు.

అతనిని సామంతునిగా యంగీకరించి యుద్ధనష్టం క్రింద కోటివరహాలు పుచ్చుకొని ఇంటికి తిరిగి వసున్నాం. మా బావగారు దారిలో చీలి హేమనగరం వెళ్ళారు. మేము వచ్చేదారిలో కొన్ని పందిళ్ళు వేసియున్నవి. వానిని చూచి"ఇవి యెక్కడివి!" అని విచారించుచుండగా యోగానందుడు బయటకు వచ్చి "రాజా! మీకు యుద్ధంలో విజయం కలగాలంటూ పరమేశ్వరుని నారాధించాను. దైవాను గ్రహం వలన మీరు గెలుపొందడం మాకెంతో ముదావహం. మీకోసం స్వామి పాదతీర్థం పట్టుకొచ్చాను. మీరంతా వాహనాలు దిగి స్నానాలు చేసి ఆ కనపడే దుర్గాలయంలో దేవిని సందర్శించి నేనిచ్చిన దేవతీర్థం పుచ్చుకున్నాక నగరికి జేరడం మంచి"దన్నాడు.

నిజానికి నా కంతకుముందు వానిమీద నున్న గౌరవాభిమానాలు తర్వాత లేవు. లేకపోయినా స్వామివారి పాదతీర్థ మంటున్నారు కనుక కాదనలేకపోయాను. ప్రయాణం నిలిపాం. నేను నా కుమారులిద్దరు ముగ్గురం స్నానాలు చేసి దుర్గా దర్శనం చేసుకుని యోగి యిచ్చిన తీర్థం సేవించాం. అంతే మాకు మైకం క్రమ్మి పడిపోయాం. మేము త్రాగింది తీర్థంకాదు. మత్తునీరు, మత్తుతో మొరలు తెలియకుండ పడిపోయిన మా ముగ్గురునూ త్రాళ్ళతో బంధించి యొక కొండ లోయలో బసవేయించి వాకిలికి పెద్దబండను పదిమందిచే అడ్డం వేయించాడు యోగానందుడు.

మా ముగ్గురను కొండలోయలో బంధించిన యోగి సరాసరి కోలాదేశం పోయి చంద్రసేనునితో మైత్రి కలిగించుకున్నాడు. అంతకుముందు మేము చేసికొనిన నిబంధనల నన్నింటిని రద్దుచేయించాడు. ఇక మీదట మారజిత పురాన్ని యోగానందుడు పాలించే లాగునను, సంవత్సర మొకటింటికి లక్షవరహాలు చంద్ర సేనునికి కప్పమిచ్చే లాగునను ఎవరైనా దండెత్తి వచ్చిన పక్షాన చంద్రసేనుడు సేనలతో వచ్చి యుద్ధం చేయులాగునను నూతన నిర్ణయాలు చేసుకున్నాడు.

తరువాత చంద్రసేనుడు కూడ మా నగరానికి వచ్చి పుర ప్రజల ముందు మీ ప్రభువులయిన హరిచందన మహారాజావారు వారి కుమారులిద్దరూ యుద్ధంలో చనిపోయినందున ఈ రాజ్యం మా వశమయింది. ఇక మీద మాకు ప్రతినిధిగ యోగానంద మునీంద్రులవారు మీకు పాలకులై యుంటారని చెప్పడం జరిగింది.

యోగానందుడు మునియైనందున క్షత్రపరిచయం లేక భయపడి ఇద్దరు రణయోధులను తనకు అంగరక్షకులుగా నియమించుకున్నాడు.

పగవారు వచ్చి రాజ్య మ్మాక్రమించడం తెలిసికొనిన మహారాణి భయ పడి రహస్య మార్గముల ననుసరించి తప్పించుకొనిపోయి హేమనగరంలోని యశోవర్ధనుని యొద్దను చేరింది. వైజయంతి మాటలనా యశోవర్ధనుడు నమ్మలేక పోయినాడు. "అమ్మాయీ! బావగారును యువరాజులును యుద్ధంలో చనిపోయిన మాట అబద్ధం. "నేను గూడ యుద్ధంలో వున్నాను., మనకే సంపూర్ణ విజయం లభించింది.

చంద్రసేను డోడిపోయి మనకు కోటి వరహాలిచ్చి రాజీ చేసుకున్నాడు. తరువాత మేమంతా తిరిగి వచ్చేటప్పుడు నీ పెనిమిటిని, నీ కుమారులను రజిత నగరం వైపు సాగనంపిన తరువాతనే నేనిటు హేమనగరం చేరుకున్నాను. ఇపుడు నీ మాటలు వింటూంటే నాకు మతిపోతూంది. ఇంతలో చంద్రసేనుడు రజిత నగరం రావడం, యోగానందమునిని ప్రభువుగా సింహాసన మెక్కించడం ఎలాగ జరిగిననో నమ్మలేకున్నా"నని విస్తుబోయాడు.

వైజయంతికి యిప్పుడు కొంత్త వూరట కలిగింది "అన్నయ్యగారూ మీరబద్ధం చెప్పరు. నా పెనిమిటి, నా కుమారులు జీవించేయుంటారు. ఈ యోగా నందముని మహాక్రూరుడు, వాడు చూడడానికి యినీంద్రుడేకాని అంత కిరాతకు డింకొకడుండడు. వాడింతకుముందే రజిత నగరం అంతా భ్రష్టు పట్టించాడు. ఇపుడు గూడ ఏవో కుట్రచేసి యుంటాడు. మరి మీ బావగారు మీ యల్లుంద్రే విషవలయంలో చిక్కుకున్నారో, యే బాధలు పడుతున్నారో" అని కంట తడి పెట్టింది.

యశోవర్ధనుని గుండె కరిగిపోయింది. "అమ్మాయీ! దిగులు పడకు. మన పరివారాన్ని నియోగించి మనవారెక్కడనున్నా యిక్కడకు వచ్చే ఏర్పాటులు

చేస్తాను" అని చెప్పి వెంటనే చారులను పిలిచి మీరెటుపోయి హరిచంద్ర మహారాజావారు కుమారులతో గూడ యెక్కడనున్నారో తెలుసుకొని రండి" అని యాజ్ఞాపించాడు. వైజయంతీ మహారాణి యశోవర్ధనుని వెంటనే యున్నది.

## మరుద్వతీ నగరం చేరిన మహారాజు

కొండగుహలో బంధింపబడిన మాకా దినమంతయు స్పృహ లేక పోయింది. మరునాటి యుదయాన మెలకువ వచ్చి చూడగ మా ముగ్గురి కాలు చేతులు త్రాళ్ళతో కట్టివేయబడినవై. మేము ముగ్గురము దప్ప యింకెవరును లేరు మేమొక లోయలో పట్టుబడినట్లును గ్రహించుకోగలిగాం. కొంతసేపటికి యిదంతా యోగానందముని యిచ్చిన తీర్థప్రభావమని మాకు బోధపడింది. ఎలాగయినా ప్రమాదంలో బడినవారు రక్షణోపాయం వెదకుకొనడం సహజమేగదా! ముందు నా కుమారులిద్దరూ యొకరి యొద్దకొకరు చేరి యొకరిచేతి త్రాటిముడులింకొకరు విప్పుతూ బంధవిముక్తులయ్యారు. తరువాత వారిద్దరూ నాకున్న కట్లు విప్పి తప్పించారు.

మేము ముగ్గురమూ కలసి గుహావాకిలికి అడ్డమున్న రాతిని తప్పించుకొని వెలుపలికి రావలయునని ప్రయత్నించితిమి. కాని బండ చాల పెద్దదై నందున కదలలేదు. మా కన్నపానములు గూడ లభించలేదు. మూడవనాటి యుదయాన బండ నెవరో కదిలించుచున్న చప్పుడు వినబడింది. అయితే ఆ రానున్నవారు మాకు పగవారై యుంటారని మునుపోహ పడ్డాం. ఇంతలో యశోవర్ధనుని కంఠం వినిపించి మా కమితానందం కలిగింది. మరికొంతసేపటికి దారిచేసుకొని లోపలకు వచ్చి జరిగినదంతా చెప్పి మా ముగ్గురను వెంటబెట్టుకొని హేమ నగరం తీసుకొనిపోయాడు —యశోవర్ధనుడు.


జరిగిన కథంతా తెలుసుకున్నాం.

నా యింటికి పోవడానికే నాకు భయమయింది.

నేను పెంచిన పామే నన్ను కాటువేసింది.

ముందా చంద్రసేనుని కన్నా ఈ యోగానంద మునినే హతమార్చాలనుకున్నాం. మంది మార్బలంతో పెద్దయెత్తున రజితపురం రావడానికే బయలు

దేరాం కూడాను. మళ్ళీ మాకింతలో ఇంకొక యాలోచన కలిగింది. ఈ ముని ముచ్చు దేముంది! కత్తిపట్టగలడా? కదన మాడగలడా! పుందా కోలాధిపతినే బంధించడం మంచిదని అనుకొనినందున చంద్రసేనుని మీదికి మరలించాం. మొదటి దెబ్బతోనే చంద్రసేనుని బంధించాం. తర్వాత శరవేగంతో వచ్చి రజిత పురం కోటను ముట్టడించాంగాని యోగానందుడప్పటికే కోటలో లేకుండ, నగరంలో లేకుండ, దేవాలయంలోను లేకుండ యెక్కడికో పలాయనం చిత్తగించాడు. మళ్ళీ



చంద్రసేనుడు రాజును శరణు కోరడం.

మాకు కోట స్వాధీనమయింది. నేను నా సింహాసనం అలంకరించాను. ప్రజలంతా ఆనందోత్సాహాలు జరుపుకున్నారు.

చంద్రసేనుని తలదీయించడాని నిశ్చయించుకున్నాం కాని అతడు మళ్ళీ పాదాలంటి శరణు కోరాడు. పరమ శత్రువునైనా శరణన్నప్పుడు చంపడం మా సాంప్రదాయమేలేదు. అలాగని ఈ తుట్టెపురుగును దయదల్చితే యెప్పుడే ప్రమాదం రాగలదో చెప్పలేం. ఒకసారి యుద్ధంలో పరాజయం పొంది క్షమాపణ

చెప్పారున్నాడు. సంధి నియమాల కంగీకరించాము. కాని యెవరో యేవో చెప్పితే విని మాటతప్పి అవకాశం ననుసరించి మన్నించిన వారికే మహోపకారం చేసిన ద్రోహి నెలా చంపకుండా విడవడం? అందుకని వాని ప్రాణాలు మాత్రం తీయకుండా బ్రతికినంతకాలం కఠిన కారాగార శిక్ష విధించాం.

అటు తరువాత యింత చేసిన యోగానందమునిని నిలువునా చర్మ మొలిపించినా పాప ముండదని పట్టుకొనడానికి అప్పటి నుండి యిప్పటివరకు గాలిస్తూనేయున్నాం. కోటలోగాని, నగరంలోగాని, ఆలయంలోగాని వాని జాడ కనపడనేలేదు. అప్పటినుండి మాకు సాధువులంటే సహింపరాని క్రోధ మేర్పడింది. ఆ కోపంతోనే నేను సాధువనేవాడు కనబడితే నా దగ్గరకు తీసుకొని రాకుండగనే, విచారణ లేకుండగనే వెంటనే యురిదీయించండి అని ఆజ్ఞాపించిన మాట్లైతే నిజం. అదొక విధంగా నీవంటి యుత్తమునకు యిబ్బంది కలిగించినందులకు నేను మిమ్ము క్షమాపణ కోరుకుంటున్నా"నని మనసులోని బాధ వెలిబుచ్చాడు.

క్షమాపణ అన్నందుకు సుధాకర్ యెంతగానో నొచ్చుకున్నాడు.

"మీరంత మాటనకండి. మీ యంతవారిని క్షమించే యధికారం నాకు లేదు. నేనన్ని విధాలా మీకన్న చిన్నవాడను. అంతేకాకుండా నాకు కావలసిన మూడవ ప్రశ్నకు సమాధానం తెలియజేసిన మహోపకారులు. ఈనాటి నుంచి మనం బంధువులం. మీరున్ను నావెంట మరుద్వతీ నగరం దయచేయవలసిందిగా ప్రార్థన ఇప్పటికే కాలాతీతమైంది. అక్కడ మా చింతామణి, మా మామగారు, నా తల్లిదండ్రులంతా నా రాక కెదురుచూస్తుంటారు" అన్నాడు సుధాకర్.

యశోదావర్ధనుడానందించి "కుమారా! నీవు చరితార్థుడవు. నిన్ను గన్న తల్లిదండ్రులు పుణ్యానీయులు. మేము నీవెంట మరుద్వతీ నగరం వచ్చి గుప్త యోగి పేరున వింత ఘోరకలి చేయుచున్న యోగానందుని గ్రుడ్లు పీకకుండా నాకు మతిస్థిమిత ముండదు. అంతకన్న నేను కోరేదింకొకటుంది నీ తల్లిదండ్రులను యానందించడం నాకు ముఖ్యమైనదిగా భావిస్తున్నాను.

"సుధాకర్! నీవు చాలా దూరం శ్రమపడి వచ్చావు. తిరిగి మనం చేయవలసిన ప్రయాణం గూడ చాలా భారమయింది. అందుకని నీవిక్కడ నాలుగు

దినాలయినా విశ్రాంతి తీసుకొనడం యెంతైనా మంచిది. ఈ మధ్యలో నేనిక్కడ సైనికులకు హెచ్చరిక చేయిస్తాను. సేనలకు, మనకు కావలసిన ఆహారపదార్థాలకు, ఆయుధ సామగ్రిని సమకూరుస్తాను. మేమిచటనుంచి బయలుదేరుచున్నట్లును, మీరు కూడా మీమీ పరివారాలతో, తగిన ప్రయత్నాలతో బయలుదేరి మరుద్వతీ నగరానికి రావలసినదిగా కాంశ్య నగరానికి వార్తాహరులను పంపించే యేర్పాటులు చేస్తా"నన్నాడు.

సుధాకర్ యశోవర్ధనునికి ధన్యవాదాలు చెప్పాడు.

యశోవర్ధనుడు అప్పటికప్పుడే విశ్వాసపాత్రులైన వార్తాహరులను రావించారు. వచ్చిన వారిని రండు జట్లుగా విభజించి మీలో ఒక జట్టు కాంశ్య నగరంపోయి విజయశేఖర మహారాజుగారి తోడను యింకొక జట్టు యిలా నగరం పోయి జయసేన మహారాజువారి తోడను పరిచయాలు చేసికొనిన తరువాత "గుప్తయోగి యిచ్చిన మూడు ప్రశ్నలకు సమాధానాలు నెరవేర్పవచ్చిన యువరాజా సుధాకరుడు పూర్తి విజయం సాధించాడు. ఉచిత నగరాధీశ్వరులు యశోవర్ధన మహారాజావారిని వెంటబెట్టుకొని తగిన సేనలతో మరుద్వతీ నగరం చేర ప్రయాణం సాగించుచున్నాడు. మీరును మీమీ పరివారాలతో వెనువెంటనే మరుద్వతీనగరం చేరరావలసినదిగా మీకు వార్తలంపించినారు రావలయు"నంటూ నియమించారు.

సుధాకరుడు లేచి విడిది భవనం వైపు నడిచాడు.

## సుధాకరుని పునరాగమనం

మరుద్వతీనగరంలో మర్మయోగి తలపెట్టిన మారణహోమం జరుగుచునే వుంది. చింతామణి అందచందాల గొప్పతనం విని ఆమెను వివాహమాడవలయునను భ్రాంతితో ఆమె ప్రశ్నలకు సమాధానం చెప్పబోయి చెప్పలేక ప్రాణాల గోల్పోయిన రాజకుమారుల సంఖ్య ఇప్పటికి తొమ్మిది వందల తొంబది తొమ్మిదయింది. ధీమంత మహారాజు తన మూలకంగా యిందరు యువరాజులు హతమైపోయినందున విచారంతో కుమిలిపోతున్నాడు.

చింతామణి కూడా ఒక్కొక్కప్పుడు తన పరిస్థితిని గురించి "యీ

ముని ప్రశ్నలు ప్రశ్నలనిపించుకొనవు. వీనికి సమాధానములు వేదశాస్త్రములందైన యుండదగినవికావు. ఇక వీనికి సమాధానం చెప్పగలవారెవరు నుందరు. అయి నప్పుడు నేనిట్లే పెండ్లి పేరంటాలు లేక బ్రతికినంతకాలమూ బ్రహ్మచారిణిగా యుండిపోవలసినదేనా! నామీదనే ఎన్నో భ్రమలు పెట్టుకొన్న నా తల్లిదండ్రులు నన్ను గురించి యెంతగా చింతపడుచుండిరో గద! సంతానం లేని హేమంతరాజు వారికి నేను పుట్టకపోయినను వారికిన్ని యగచాట్లు కలిగియుండేవికావు.

అయ్యో! ఈ పాపిష్టి నియమంబున కట్టుబడి మా బావ ప్రభాకరుని నేనే చేతులార చంపుకొంటిని. ఒక్కగానొక్క కొడుకును గని నా కరవాలమున కర్పించిన మా యత్తమామలు శకుంతలాదేవీ, సూర్యవర్మ మహారాజు మొద లయినవారు నన్నెంత క్రూరురాలినిగా నిందించుచుండిరో గదా! అయినప్పటికీ ప్రశ్నలకు సమాధానం సేకరించుకొని వస్తాను.మా చింతామణి శకలు విడిపిస్తాను. మా అత్తమామలనే గాక మీ యందరిని సంతోషపరుస్తానని నా స్నేహితురాలు మంజులతో శపథం చేసిపోయిన మా చినబావ సుధాకరు డెక్కడ తిరుగుచున్నాడో! ఏమి చేయుచున్నాడో తెలియదు.అంతఃపురం దాటి బయట అడుగిడని రాజకుమా రుడు నా మూలముగ యే యడవులు బట్టి తిరుగుచున్నాడో? ఎన్ని బాధలు పడు చున్నాడో? వేళ కన్నపానాదులు లేక యెన్ని బాధలపాలయ్యాడో గదా!

అదిగాక నా ప్రశ్నలకు సమాధానము చెప్పవలయునని వచ్చి యిచట యీ విషవలయంలో చిక్కుబడి నిష్కారణంగా హతమైపోయిన యింతవరకు రాజ కుమారులను గురించి వారి తలిదండ్రులెంతగా వాపోవుచుండిరో ? నన్ను, నా తల్లిదండ్రుల నెట్లు నిందించుచున్నారోగదా! అట్లనుకొని యీ బాధలు భరింపలేక ఎదిరించితే మునీంద్రుడేమైనా శపించునేమోనన్న భయంతో కంట తడి పెట్టు కుంటుంది.

తొమ్మిదివందల తొంబదిమంది రాజకుమారులు లిప్పటికి వధింపబడి నందున గుప్తయోగి తన సంకల్పం ఫలించబోతూన్నదిగదా యని పొంగిపోతు న్నాడు. మూడురకాల ముప్వురను మోసగించాడు. కాని ముగ్గురి దగ్గర తన పొరపాటు చిక్కిపోయినందున పారిపోయి వచ్చాడు. ఐనా వానికి బుద్ధి రాలేదు. వీళందర్ని జయించి తన గుప్పిటలో పట్టుకోవాలనే దురభిప్రాయం ఇంకా పోతుక

పోయింది. మహాకాళీ యొద్ద వేయిమంది రాజకుమారులను బలియిస్తే దేవి ప్రసన్న మిచ్చి ప్రపంచంలో యెవరికీ లభింపని మహాద్భుత శక్తులనన్నింటినీ తనకు సిద్ధింప చేయిస్తుందని భ్రాంతిపడ్డాడు.

వేయిమంది రాజకుమారులను బలియిడం తనకు సాధ్యపడే పని కాదు. దానికే యుక్తిపన్నుకొని వచ్చాడు.


ఈ చదరంగంలో ధీమంతమహారాజావారి నొక పావులాగా, చింతామణి నొక పావులాగా యిప్పటిదాకా యుపయోగించుకొని ఇంత ఘోరం చేయించాడు. ఇంకొక రాజకుమారుడు వస్తే తన నిర్ణయం ప్రకారం వేయి మందిని బలిఇచ్చిన వాడవుతాడు. లోపల కాళికాలయం గూడా గట్టించాడు. అమ్మవారికి ప్రతి దినం గుగ్గిలంపొగ వేస్తుంటాడు. ఇదంతా గమనించుచునేయున్న చింతామణి స్నేహితు రాలు మంజుల యేమీ తెలియనట్లుగా నటించుతూంది.

దేశమంతటా కలవరం పెరిగిపోయింది. ఇంతమంది రాజకుమారుల చావుకు కారణమైన ధీమంత మహీపాలునిమీద సాటి రాజులకున్న గౌరవ మర్యాదలు నశించిపోయినై. అదే సమయమన మరుద్వతీ పురాధీశ్వరునిపై విరోధం గల రాజులంతా దుష్ప్రచారం చేయ ప్రారంభించారు. ముఖ్యంగా కొడుకు నను పోగొట్టుకొనిన తల్లిదండ్రుల కడుపులు మండిపోయినై. అవసరమైతే ధీమంతుని మీద యుద్ధంచేసి గుప్తయోగి యున్న మందిరాన్ని నేలమట్టం చేద్దామనే నిర్ణ యంతో దేశదేశాల నుండి రాజులు వారివారి బలగాలతో వచ్చి పట్టణమంతటా గుడారాలు వేశారు.

కొందరు రాజసభకు పోయి "ధీమంతా! ఏమిటి యీ ఘోరం? ఎందు కిలా మారణహోమం చేయిస్తున్నావు? మేం మీకేం అపకారం చేశామని మా కుమారులనందరినీ నాశనం చేయిస్తున్నావు. నీకు కుమారులు పుట్టలేదని మా కుమారులను నీ పొట్టనబెట్టుకుంటే నీకు వచ్చినదేమిటి? నీ కిష్టమైతే యే రాజ కుమారునికో యొకనికి నీ కూతురునిచ్చి పెండ్లిచేయడం కాకపోతే నీ పుత్రికా రత్నములను నీ యింటినే కూర్చుండబెట్టుకోవడం చేయదగింది కాని ప్రశ్నలనే పేరుతో పిలిపించి ప్రాణాలు దీయడం మంచిపని కాదు. దేశ దేశాల రాజులంతా

నీమీద యుద్ధానికి వచ్చారు. మాకేం సమాధానం చెబుతావు ?" అని యొత్తిడి చేశారు.

ధీమంతుడంతట వచ్చినవారందరికి నమస్కారం చేసి "అయ్యలారా! మీకన్యాయం జరగలేదని నేననడంలేదు. నాబిడ్డ యిపుడు చావుబ్రతుకులు గాకుండ పాముసోట చిక్కిన కప్పలాగా నలిగిపోతూంది. ఆమె చనిపోయినా ఒక్కసారి యేడ్చి పూరుకొందుము గానీ నిత్యమనుభవించే యీ యమ యాతనలు చూచి మా



రాజులందరూ ధీమంతుని నిందించడం

కడుపులు రంపపుకోతలు కోసివేస్తున్నాయి. ఇది ముమ్మాటికిని సత్యం. ఆ పరమేశ్వరుడు సన్నే చేయనున్నాడో తెలియదు. ఇక మీయిష్టం. మీరేం చేయదలచుకున్నా నేను తలపంచక తప్ప"దన్నాడు.

ధీమంతుడు చెప్పినదిగూడ నిజమే.

ఇప్పుడేమిటి చేయడమని అందరాలోచనలో పడ్డారు, రాజులంతా.

ఇంతలో "సుధాకర యువరాజావారికి జై-సుధాకర యువరాజావారికి

జై" యనే నినాదాలు దిక్కులు పిక్కటిల్లేలాగా మారు మ్రోగినయ్. మహదానంద ముతో ధీమంత మహారాజు కోట వెలుపలకు వచ్చాడు. విజయసమేతంగా వస్తూన్న సుధాకర్ చుట్టూ ప్రజలు గుంపులు గూడారు. సుధాకర్ ప్రక్క యింకా క్రొత్త వారున్నారు. అంత దూరంనుండే మామగారిని చూచిన సుధాకర్ గుంపునంతా త్రోసుకుంటూవచ్చి ధీమంతునికి పాదాభివందనం చేశాడు. ధీమంతుడు సుధాకరు నాలింగనం చేసుకొని "క్షేమంగా తిరిగి వచ్చావా నాయనా! నీ రాకకోసమే ప్రతి నిమిషం యెదురు చూపులు చూస్తున్నాం" అన్నాడు.


"మీ దయవలన క్షేమంగా విజయం సాధించుకొనే వచ్చాను. మామ గారూ! గుప్తయోగి ప్రశ్నలకు సమాధానం చెప్పి వాని నంతంచేస్తాను. ఇరుగో- యీ వచ్చినవారు రజితపురాధీశ్వరులైన యశోవర్ధన మహారాజావారు, అరుగో అక్కడున్నవారు కాంశ్యనగరాధీశ్వరులైన విజయశేఖర మహారాజావారు, అరుగో! ఆ వచ్చుచున్నవారు ఇలాపురాధీశ్వరులైన జయసేన మహారాజావారు. వీరందరూ యోగి ప్రశ్నలకు సంబంధించిన వారే"నన్నాడు. సుధాకర్ విజయ గర్వంతో—ధీమంతుడానందంతో ఆ వచ్చిన వారందరూ యథోచిత మర్యాదలు చేయించారు.

## చింతామణి - సుధాకరుల కళ్యాణము

మరునాడు తెల్లవారింది. తెల్లవారకముందే గుప్తయోగి భవనం చుట్టూ దేరాలు నిర్మింపబడినై. ఆసనాలు గూడ అమర్చబడినై. జనం గుంపులు గుంపులు గూడారు. ధీమంత మహారాజు నిండుతనం తగ్గకుండా వచ్చి ప్రక్కగ కూర్చు న్నాడు. ఆయన వెంటనే బావమరదులు సూర్యవర్మ, చంద్రవర్మ మహారాజులు వచ్చి ప్రక్కగ కూర్చున్నారు. ఆ వరుసలో జయసేన మహారాజు, విజయశేఖర మహారాజు, యశోవర్ధన మహారాజులు గూడా వచ్చి కూర్చున్నారు. వారి వెనుక రాజకుటుంబాలకు సంబంధించిన బంధువులు, మిత్రులు మొదలయిన వారంతా వచ్చి వారి వారి స్థానాలలో ఆశీనులయ్యారు.

సుధాకరుడు వచ్చి సరాసరి గొలుసులాగి గంట మ్రోగించాడు.

రాజభటులు వారి ధర్మము ప్రకారము సుధాకరుని వెంటబెట్టుకొనిపోయి చింతామణి ముందు నిలబెట్టారు. చింతామణి ప్రశ్నలడగడం ప్రారంభించింది. అయితే ఆమె మనసులో బావగారిని చూచినంతనే ధైర్యం వచ్చింది. రాజ కుమారా! ఇదుగో! మొదటిప్రశ్న అడుగుచున్నాను. సర్వమూ సన్యసించిన పరిశుద్ధ మునీంద్రుని చందంబున నటించి రాజాదరణము పొంది, పూజారి మక దలకు మచ్చికపడి మహామంత్రి నమాంతంగా సంహరించి ప్రియురాలితో గూడ



సుధాకరుడు గొలుసు లాగి గంట మ్రోగించటం

సరిహద్దు రాజ్యానికి పారిపోయిన కపట సన్యాసి యెవరు? సరిహద్దు రాజుల వైరము లెట్లున్నవి? ఆ రాజు లెవరు? వారి పేరు లేమి?" దీనికి సమాధానం చెప్పుమన్నది.

సుధాకర్ వెంటనే "చింతామణీ! ఇది జరిగింది యిలా నగరంలో. జయసేన మహారాజుగారిని నమ్మించి స్వాములవారుగా నటించి తిరువేంగళాంబకు మచ్చికపడి మహామంత్రిని చంపి అవంతీపురం చేరి అక్కడ తను నమ్ముకొని వచ్చిన స్త్రీని హత్యచేసిన యనంతరం కాంశ్య రక్షితనగరాలలోను యిటువంటి

దుర్మార్గుల చేసి వచ్చిన సన్యాసియే మీ గురువు గుప్తయోగి. సరిహద్దు రాజులు సఖ్యముగనున్నారు! ఆ రాజులైన జయసేన గణపతిసింహ మహాప్రభువులు యిప్పుడిక్కడకు వచ్చియున్నారు. ఇక రెండవ ప్రశ్న నడుగు"మన్నాడు.

చింతామణి సుధాకర్‌తో "తన నుండి రక్షణ పొందిన రాజుకు విశ్వాస పాత్రుడుగ నటించి వాని చెఱశాల యందున్న శత్రురాజదంపతులను బందీలనుండి తప్పించిన తరువాత వారిని విడదీసి రాణిపొందుగోరి మోసపోయిన యోగీంద్రు దెవరు? అతడిపుడెక్కడున్నాడు? తిరిగి యా రాజదంపతులు కలుసుకొన్నారా! ఇపుడేమి చేయుచున్నారు, వారి పేరులేమి?" దీనికి సమాధానం చెప్పుమన్నది.

సుధాకర్ వెనుకాడక "చింతామణీ! ఇది జరిగింది కాంశ్యనగరంలో. మొదట నొక రాజునకు రక్షరేకునిచ్చి వశపరచుకొని విషాద పురాధీశ్వరుని కుటుంబ సమేతంగా చెఱసాల యందుంచునట్లు చేసి తరువాత ఆ రాజదంపతులను కారాగారం నుంచి తప్పించి వెంటగొనిపోయి దారిలో పెనిమిటిని మోసగించి భార్యను పొందబోయి వంచింపబడిన తరువాత రజితనగరంలోను నానారభసచేసి వచ్చిన హఠయోగి మీ గురువు గుప్తయోగి. ఆ రాజదంపతులయిన రాణీరత్న ప్రభ, కేదారగుప్త మహారాజును మరునాడే కలుసుకున్నారు. కాంశ్యనగరాధీశ్వరుడయిన విజయశేఖరవర్మ మహారాజు, కేదారగుప్తరాజు లిపుడిక్కడకు వచ్చి యున్నారు—ఇక మూడవ ప్రశ్న నడుగు"మన్నాడు.

చింతామణి "రాజకుమారా! రాజకుమారీ వివాహ సమయంలో ప్రవేశం కల్పించుకొని, ఆ రాజును వంచించి ఆలయపాలకుడై యుండి నమ్మి సేవించిన రాజును, వాని కుమారులను మోసంతో బందీలను గావించి పరాయి రాజుల చేయి కలిపి మొదటి రాజ సింహాసన మాక్రమించిన సాహసి యెవరు? అతడిపుడెక్కడ నున్నాడు? ఆ రాజదంపతులేమి చేయుచున్నారు. వారెవరు? దీనికి సమాధానం చెప్పు"మన్నది.

సుధాకర్ నిర్భయముగ "చింతామణీ! ఇది జరిగింది రజతనగరంలో. నూతన వధూవరుల నాశీర్వదించుచు పరిచయం కల్పించుకొని నటరాజ దేవాలయం నిర్మించి యుద్ధంలో నుండి విజయం పొంది వచ్చుచున్న తండ్రికొడుకులను దారిలో వంచించి బంధించిన తరువాత ఓడిపోయిన నగధాని సాయం గోరి

ఆదరించిన, రాజసింహాసన మాక్రమించిన యోగానందుడే మీ గురువుగు ప్రయోగి. ఆ దంపతులు సుఖముగనే యున్నారు. వారిలోని హరిచందన, చంద్రసేన మహారాజు లిపుడిక్కడనే యున్నారు" అన్నాడు.

చింతామణి యడిగిన మూడుప్రశ్నలకు సుధాకర్ సమాధానం చెప్పాడు. చింతామణి గురువుగారి వంక చూచింది. ఆయనక్కడ లేడు. మొదటి సమాధానం



సుధాకర్ చింతామణిల వివాహం

వింటూనే యోగి ప్రాణాలు లేచిపోయినై. అక్కడనుండి తప్పించుకొని పోవ డానికి ప్రయత్నించాడు. కాని ఈసారి పోలేకపోయాడు. అంతకుముందే రాజ సేవకు లాయుధాలు ధరించి మందిరం చుట్టూ కాపలాలు గాయుచున్నందున వెంటనే వారి చేతులలో పట్టుబడిపోయాడు. సన్యాసి గురువుగారు తన్ను పట్టు కున్న భటులను బెదిరించి చూచినా,లంచాలభ్రాంతి చూపినా ఫలితం లేకపోయింది.

కాళ్ళు, చేతులు విరచికట్టబడిన రాజగురువు పదిమందిలో నేరస్తుడై చిక్కబట్టాడు. ఇలా నగరం, కాంశ్య నగరం, రజిత నగరాలనుండి వచ్చిన రాజులు మునీంద్రుని దురాగతాలన్నింటిని బట్టబయలు చేశారు. భీమసింహ మహారాజు వానిని కరవాలంతో తెగవేయబోయాడు కాని సుధాకర్ మామగారిని వారించి- వెంటనే దొంగసన్యాసికి పళ్ళూడగొట్టించాడు—మంగలిచేత తల నున్నగా గొరిగించారు. సున్నపుబొట్లు పెట్టించాడు. పాత చెప్పులదండ మెడలో వేయించాడు. గాడిద మీదెక్కించారు. పదిమంది రాజసేవకులను పిలిచి మీరీతనిని మన మరుద్వతీ నగరంలో వీధి వీధులలో త్రిప్పుకొని తీసుకరండి అని నియోగించాడు.

గాడిదనెక్కి వీధులలో తిరిగేటప్పుడు ప్రతి ఇంటిముందాడవారు పేడ కలిపిన నీళ్ళు మొగి మొగానగొట్టారు చీపురు దెబ్బలు—చెప్పుదెబ్బల తిన్న యోగి మరునాడు నగరం నుంచి పారద్రోలడంతో ఆ పీడ వొదిలి పోయిందనుకున్నారు.

తరువాత చింతామణి సుధాకరులకు వివాహ మతి వైభవంగా జరిగింది.

సుధాకర్ తన వజ్రపురానికే కాకుండా పెదతండ్రిగారి ఉజ్జయినీ నగరానికి మామగారి మరుద్వతీ నగరానికి గూడ ప్రభువులయ్యారు. ప్రజల కోరిక మీద రాజకుమారుడు యింత చరిత్ర జరిగిన మరుద్వతీ నగరంలో సామ్రాజ్య పట్టాభిషేకం గూడా చేసుకున్నాడు. బంధువులు, మిత్రులే గాకుండా పరిసర రాజులూ, యితర దూర దేశాలనుండి వచ్చిన ప్రభువులంతా నూతన రాజదంపతులకు ఘన సన్మానాలు బహూకరించారు.

ధర్మం జయించింది—

కథ కంచికి—మనమింటికి.

C 894.8133 NAa
Acc no. 26816

మంగళమ్